
# శ్రీ జ్ఞానేశ్వర్ జీవిత చరిత్ర



శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్, గొలగమూడి.

వెల: 15.00

# ఆశయము

జ్ఞానేశ్వరి భగవద్గీత అనే గ్రంథం ఉందనే విషయం కూడా నాకు తెలియని రోజులలో శ్రీ భరద్వాజ మాస్టర్ గారు నన్ను ఇక ఏ భగవద్గీత చదవవద్దు, జ్ఞానేశ్వరి మాత్రం తెప్పించి చదవమని ఆజ్ఞాపించారు. తెప్పించి చదివాను. ఆ మహనీయుని వివరణ నేను చెప్పలేనంత గొప్పగా ఉన్నది. ఇంత గొప్ప వివరణ ఇచ్చిన మహనీయుని జీవిత చరిత్ర చదవాలని ఆశ. ఇంతటి గొప్ప వ్యాఖ్య వ్రాసిన మహనీయుని వయస్సు పన్నెండు సంవత్సరములు మాత్రమే. 1. తన వీపును పెనముగా జేసి దోశలు పోయించుట. 2. చనిపోయిన మిత్రుని బ్రతికించుట. 3. దున్నపోతు చేత సుస్వరముగా మూడు గంటల సేపు వేదగానము చేయించుట. 4. మొండి గోడను నడిపించుట. 5. శ్రాద్ధమునకు పితృదేవతలను రప్పించుట. మొదలగు ఎన్నో దివ్యలీలలు ఒనర్చిన జ్ఞానస్వరూపులు. ఆత్మజ్ఞానియైన మహనీయుని మాటలు వినడమే సత్సంగము.

ఈ జ్ఞానేశ్వరి భగవద్గీత రెండు భాగములుగా- నవ రత్నా పబ్లిషర్స్ విజయవాడ మరియు వెంకటరమణ బుక్ షాపులన్నింటిలోను ఈమధ్యనే ప్రింటయి అమ్ముచున్నారు. భక్తులందరు చదివి శ్రీ భరద్వాజ మాష్టరు గారి ఆశయము నెరవేర్చగలరని ఆశిస్తున్నాను.

పెసల సుబ్బరామయ్య.

# జ్ఞానదేవుడు

తదనంతరము వృద్ధ వశిష్టాది మునులు జ్ఞానదేవుని చరిత్రమును తెలుపుమని ప్రార్థింపగా నా భాజిసిద్ధుడు వారితో-

"సిద్ధులారా! సావధానముగా వినుడు. పరమభక్తుల చరిత్రమునుగాని జీవన్ముక్తుల చరిత్రమునుగాని శ్రద్ధతో చెప్పువారికిని వినువారికిని భగవత్కటాక్షము సులభముగా లభించును. భగవద్భక్తుల చరిత్రములు అతి పవిత్రములు. జ్ఞానదేవుని చరిత్రము పరమ పవిత్రమైనది. నాకు తెలిసినంత మాత్రము మీకు తెలిపెదను.

గంగానదీ తీరమునందు ఆప గామను నొక గ్రామము గలదు. ఆ గ్రామమున గోవింద పండితుడను నొక సత్పురుషుడు నివసించు చుండెను. అతడు గ్రామ కరణముగా పనిచేయుచు జీవనమునకు ఎట్టి యిబ్బంది లేక సుఖముగా కాలము గడుపుచుండెను. అతిథులు అభ్యాగతులను ఆదరించు చున్న ప్రదాతయన్న కీర్తి నార్జించెను. అతని భార్య నిరూబాయి. అతి సౌందర్యవతి. సద్గుణరాశి. సంసార భారమును చక్కగా నిర్వహించుచు భర్తకు అనుకూలవతియై ఉండెను. వారిరువురు నా గ్రామమునందున్న గైనీనాథను సత్పురుషుని ఆశ్రయించి తత్త్వోపదేశమును పొంది నిరంతరము సజ్జన సాంగత్యమున తత్వ విద్యా రహస్యమును విచారించుచు సంతసించు చుండిరి.

ఒకనాడు గైనీనాథు వారి యింట విందారగింప వచ్చి, వారి సుగుణ సంపదకు మెచ్చి, సంతానము లేకుండుటకు విచారపడి, వారిని తన సమీపమున గూర్చుండ జేసికొని, "పుణ్యాత్ములారా! అపుత్రస్య గతిర్నాస్తి" యను స్మృతివచనమును మీరు వినియుందురు. ఎంత భాగ్యమున్నను సంతానము లేకున్న సుఖముండదు. పుత్రులు లేనివారికి పుణ్యలోకములు సిద్ధింపవనియు, సంతాన రహితమగు గృహము శూన్యమనియు శాస్త్రములు దెలుపుచున్నవి. కుమారుని కౌగలించుట వలన గలుగు నానంద మంత యింత కాదు. మీరు పండరిపురమున కేగి పాండురంగమూర్తిని దర్శించినచో సవశ్యముగా సుపుత్రుడు కలుగు" సని చెప్పెను.

మరునా డాదంపతులు గురువచనము చొప్పున ప్రయాణమై, కొన్ని దినములకు పండరిపురము చేరి, చంద్రభాగలో స్నానము చేసి, పాండురంగని

దర్శించి, యచట మూడు దినము లుండిరి. మూడవ నాటి రాత్రి తెల్లవారు జామున గోవింద పంతునకు స్వప్నమునందు పుండరీక వరదుడు బ్రాహ్మణ రూపమున గనబడి, సుపుత్రుడు ఉదయించునని పలికి, యొక దివ్యఫలమును చేతియందుంచి యదృశ్యుడయ్యెను. గోవిందపంతు వెంటనే మేల్కాంచి తాగన్న కలను తలపోయుచు పరమానందముచే నా సంగతిని నిరూబాయికి దెలిపెను. భగవత్ప్రీతిగా సమారాధనలు, సంతర్పణలు, దానధర్మములు చేసి అచటి నుండి బయలు దేరి వారు కొన్నిదినములకు తమ గ్రామము జేరిరి.

భగవానుని యపారకరుణచే నిరూబాయి గర్భము ధరించి నవ మాసములు నిండిన పిదప నొక శుభలగ్నమున నొక కుమారుని గనెను. గోవిందపంతు భాగవతులకును పేదసాదలకును దానధర్మము లాచరించి, జాతకర్మము జరిపి పాండురంగమూర్తి యనుగ్రహమున జన్మించుటచే నా బాలునకు విఠోభాయని పేరిడెను. ఆ బాలుడు దిన దిన ప్రవర్ధమానుడై తల్లిదండ్రుల కానందము గలిగించుచుండెను.

గోవిందపంతు తన కుమారునకు యుక్త కాలముని నుపనయన మొనర్చి వేదశాస్త్ర పురాణాది విద్యల నెల్ల జక్కగా జదివించెను. తన కుమారునకు చిన్న వయస్సుననే పెండ్లి చేయవలెనని ప్రయత్నించుచుండెను.

## విఠోబా తీర్థయాత్ర

విఠోభాకా విషయము దెలిసి తండ్రి వచ్చి "నాయనా! మీరిప్పుడే నాకు వివాహము జేయ ప్రయత్నించుచున్నారు.కాని నాకు చాల దినముల నుండియు తీర్థయాత్ర చేయవ లెనను కోరిక కలదు. సెలవిచ్చినవో తీర్థయాత్ర చేసికొనివచ్చి వివాహము చేసి కొందు" నని పలికెను. గోవిందపంతు చింతాక్రాంతుడై యింత చిన్న వయసులో తీర్థయాత్ర పనికిరాదనియు, చతురాశ్రములలో గార్హస్థ్యమే ప్రశస్తము గనుక నా ప్రయత్నమును మానుమనియు దెలిపెను.

అందులకు విఠోభా సంసారసాగరము నందలి దుఃఖముల నెల్ల వివరించి, యంత చిన్న వయసులో భార్య యను బండ రాయి భారమగుననియు తీర్థయాత్ర ముగించి వచ్చినతోడనే వివాహ మాడెద ననియు పలికెను. గోవిందపంతు విధి లేక సమ్మతించి యొక సంవత్సరం లోపల తీర్థయాత్ర ముగించి తిరిగి రమ్మని పలికెను.

విఠోభా తల్లిదండ్రుల యాశీస్సుల నంది, మెల్లగా బయలు దేరి, హరిస్మరణ చేయుచు, భగద్విలాసములను దలంచుచు నడచి, ద్వారావతికి బోయి, యచట వెలసియున్న శ్రీకృష్ణుని దర్శించి, సుధామపురికేగి స్వామిని సందర్శించి, రుక్మిణీ కృష్ణులకు వివాహ మహోత్సవము జరిగిన మూల మాధవమునకు వెళ్లి శ్రీకృష్ణుడు పరమపదము జెందిన స్థలమున నున్న వాలుకా తీర్థమును సేవించి, సోమనాధమున కేగి ముచికుందు నివాసస్థానమును వీక్షించి, కాలయవనుడు భస్మమైన గుహను వీక్షించి యచటనుండి బయలుదేరి పురాణ ప్రసిద్ధములగు తీర్థ క్షేత్రములను సందర్శించి, గోదావరీ తీరము జేరి కపాలేశ్వరుని దర్శించి, నాసికా త్ర్యంబమునకు బోయి కుశావర్తము నందు స్నానమొనర్చి, గంగాద్వారము బ్రహ్మగిరి మొదలగు దివ్య స్థలముల నెల్ల సందర్శించి, యలకాపురమునకు బోయి యొక పొదచాటున గూర్చుండి దేవతార్చన జేసికొనుచుండెను. అలకాపురమున వాసము చేయుచున్న కులకర్ణ సిద్ధోపంతను నొక బ్రాహ్మణు డతిథుల కొరకు దిరుగుచు విఠోభాను జూచి, యతనిని సమీపించి, యతడు పూజ ముగించి లేచిన తోడనే నమస్కరించి, "స్వామీ! నీ వెవ?"రని యడిగెను. విఠోభా తన విషయమును వివరముగా దెలిపెను. సిద్ధోపంతు "స్వామీ ! నే నీపురమున వసించు బ్రాహ్మణుడను. చక్రతీర్థమునకు స్నానమునకు వచ్చు బ్రాహ్మణులను ప్రతిదిన మింటికి దీసికొనిపోయి యున్నంతలో భోజనమిడి పంపుచుందురు. ఈ దినము నీవొక్కడివే కన బడితివి. దయచేసి యీ పూట మా యింటికి భోజనమునకు రావలె" నని వేడెను. విఠోభా సంతసించి యతని యింటి కేగెను. సిద్ధోపంతు విఠోభాను దైవస్వరూపునిగా భావించి, పంచభక్ష్య పరమాన్నములను వడ్డించి యతనితో గూడ తానును సంతుష్టిగా భుజించెను. విశ్రాంతిగా కూర్చుండి యతనితో తత్వ విషయములను ముచ్చటింప సాగెను. విఠోభా యతిని సంశయముల నెల్ల తీర్చెను. అతని యఖండ పాండిత్యమునకును, ప్రజ్ఞకును, సత్ప్రవర్తనముకును సిద్ధోపంతు సంతసించెను. సిద్ధోపంతు ప్రార్థనపై విఠోభా నాటి రాత్రి యచటనే నిలిచెను. తెల్లవారు జామున సిద్ధోపంతునకు స్వప్నమున పుండరీక వరదుడు కనబడి, విఠోభా మహాపురుషుడనియు నతనికి తన కుమార్తె నిచ్చి పెండ్లి చేయుమనియు నామెయందు దైవాంశ సంభూతులగు బిడ్డలు నలువురు పుట్టెదరనియు తెలిపి, యదృశ్య డయ్యెను.

అతడు వెంటనే మేల్కాంచి, యాశ్చర్యచకితుడై, విభోభా మేలుకొన్న తోడనే తాను గన్న కలను గూర్చి తెలిపి, తన కుమార్తెను వివాహమాడు మనెను. విభోభా యులికిపడి "అయ్యా! మంచి మాట సెలవిచ్చితివి. భావి త్రవ్వబోయి భూతమును జూచి నట్లును, పుత్రవగమునకు బోయి పురుషుని బలి యిచ్చినట్లును తటస్థించినది. ఇందులకే కాబోలు నయవినయములతో నన్నిచ్చటికి దీసికొని ఎంత సమర్థుడవు! వచ్చినది! అహా! పూర్వ మెప్పుడో వేశ్య లరణ్యములకు వెళ్లి మధుర పదార్థములను బెట్టి మోహింపజేసి మహనీయుడగు ఋష్యశృంగుని మాయలో ముంచిరని పురాణము లందు విని యాశ్చర్య పడుచుంటినిగాని యిప్పుడది మీ చేష్టల వలన ప్రత్యక్ష మగుచున్నది. నీ వింత గొప్పవాడవైయుండియు విదేశీయుని కులగోత్రములనైనను విచారింపక చిక్కినదే చాలునని మెల్లగా దక్కించుకొన జూచుచుంటివి. నీవంటి వాని కిట్టి పని మంచిది కాదు. నేనెవ్వడను? మీరెవ్వరు? నాకును మీకును సంబంధ మేమి? ఈ ప్రస్తావము వింతటితో చాలించుము. నేను పోయి వత్తు" నని పలికెను.

సిద్ధోపంతు "అయ్యా! తొందర పడకుము. మీ గోత్ర సూత్రములు సరిపోకున్న భగవంతుడు మా పిల్లను నీకిమ్మని యెట్లు" సెలవిచ్చును? గోత్రములు సరిపోయిన మారు మాట బలుకక యిప్పుడే మా పిల్లను పెండ్లి యాడవలెను. లేనిచో నీ యిష్ట ప్రకారం వెళ్ళవచ్చును. మీ యింటి పేరును గోత్రసూత్రములను తల్లి వంక వారి గోత్రసూత్రములను తెలియజేయు" మనెను. అందుకు విభోభా సిద్ధోపంతు ప్రశ్నల కెల్ల సమాధానముల జెప్పి, "మీకును మాకును సంబంధ మెట్లు సరిపడునో తెలియజేయు" మనెను.

సిద్ధోపంతు తన భార్యను పిలిచి, తమకును వానికిని గల బంధుత్వమును వివరముగా తెలిపి యతడు వరుసలో మేనల్లు డగుననెను. విభోభాతో "నాయనా! ఇంకనైన పెండ్లి చేసికొనుము, బంధుత్వమును గూర్చి వింటివి గదా? యని పలికి, కొందరు బంధువులను బిలిచి, వారికి జరిగిన సంగతి నెల్ల తెలియజేసెను. వారు పెండ్లి చేయుట యవశ్య కర్తవ్య మనిరి. విభోభా నతడు మఱింత బలవంత పెట్ట సాగెను.

విభోభా వ్యసనా క్రాంతుడై, యటనుండి తప్పించుకొని పోవుట కుపాయము గానక సిద్ధోపంతుతో "స్వామీ! నా మనవి వినము. నేను బ్రహ్మచర్య మవలంబించి యాత్ర చేయుచున్నాను. నాకు వ్రతభంగ

మొనర్చుట మీకు ధర్మము కాదు. మోయలేని బరువును మోయుమన్న నెట్లు మోయవచ్చును? నాకీ పెండ్లి యక్కర లేదు. ఒక వేళ మీరు బలవంతముగా నాకీ పెండ్లి చేసినచో మీకు తీరని దుఃఖము ప్రాప్తించు" నని పలికెను.

సిద్ధోపంతు మందహాసము చేసి, "నాయనా ? నిన్ను మోసగింపవలెనని మేమనుకో లేదు. ఇది భగవదాజ్ఞ. మా మాట విని వివాహము చేసికొని తరువాత నీ యిష్ట ప్రకారము కొంతకాలము తీర్థయాత్ర చేసిరావచ్చును. నీ తీర్థయాత్ర కాటంక ముండ" దని పలికెను.

విఠోభా యా రాత్రి యెటులైన గడిపి తెల్లవారగనే తప్పించుకొని పోవలెనని నిశ్చయించెను. ఆ రాత్రి మూడవ జామున భగవానుడు విఠోభాకు స్వప్నమున గనబడి "నాయనా! నేను సిద్ధోపంతునకు సెలవిచ్చినమాట నిజమే. అతని కుమార్తె నీకన్ని విధముల యోగ్యమైనది. మీ వలన లోకోపకారమగు పను లెన్నియో కావలసి యున్నవి. అందువలన సిద్ధోపంతు యిష్టానుసారముగా నడచు కొమ్ము. నీకు సకల శ్రేయములు గలుగు" నని పలికి మాయ మయ్యెను.

విఠోభా యులికిపడి లేచి, భగవత్ప్రేరణకు చింతించి, యట నున్న దుఃఖపడ వలసి వచ్చునని యెంచి, కాలికి బుద్ధి జెప్పదలచి మెల్లగా లేచి, చప్పుడు గాకుండ ముందుకు బోయి, వీధి తలుపు దీసి, వెలుపలికి వెళ్లెను.

## రుక్మాబాయి - విఠోబాల సంవాదము

కంటికి నిద్ర పట్టక నిమిష మొక యుగముగా గడుపుచు పడక మీదనే కూర్చొనియున్న సిద్ధోపంతు కుమార్తె యగు రుక్మాబాయి యతనిని జూచెను. ఆమె తన తండ్రి యనుమతి ప్రకారము తనకు నిరుపమాన సౌందర్య సుజ్ఞాన సంపన్నుడగు వరుడు లభించుటకై మహాలక్ష్మి వ్రత మాచరించుచుండెను. విఠోభా విషయమై భగవంతు డాజ్ఞాపించిన సంగతి విన్నప్పటి నుండియు తన వ్రతము ఫలించి తగిన వరుడు లభించెనని సంతోషించు చుండెను. ఎప్పుడు వివాహమగును? ఎప్పు డతని సేవ సంప్రాప్తించు? నని దలపోయుచు నిద్రపట్టక కూర్చొని యుండెను. దొంగవలె వెళ్లుచున్న విఠోభాను జూచి "ఇతనిని మాటిమాటికి జూచుచుండ నదేదో యొక విధముగా నున్నది. నా తల్లిదండ్రులు నన్నితనికిచ్చి వివాహము చేయ నిశ్చయించినప్పటి నుండి నేనితని సొమ్మయితిని. నేనితనిని దప్ప మరి యొక్కని భర్త గా వరింపరాదు.

ఇప్పుడితనికి స్వప్నమున భగవంతుడు పెండ్లి విషయమై యానతిచ్చి యుండవచ్చును. లేకున్న నితడిట్లు లేచి పోవుటకు నిమిత్తముండదు. తల్లిదండ్రులు భగవానుడును నానతిచ్చుటచే నితడే నాకు భర్త. ఇతని యిష్టానుసారము వర్తించుట నాకు ముఖ్య ధర్మ" మని నిశ్చయించి, లేచి, పరుగెత్తిపోయి విఠోభా ముందు నిలిచి, భక్తి ప్రపత్తులతో నతనికి నమస్కరించి, "స్వామీ! ఇంత రాత్రి వేళయంది ట్లెవ్వరికి దెలుపకుండ యెచ్చటికి వెళ్ళుచుంటివి? నీ కిచట నుండుట కిష్టము లేకున్న మా తండ్రికి దెలిపి, యతని వద్ద సెలవొంది, నన్ను గూడ వెంట నిడుకొని మీ దేశమునకు వెళ్ళ వచ్చును ర" మని పలికెను.

విఠోబా యులికిపడి, ఈ వెన్నెలకాంతిలో రుక్మాబాయిని జూచి, యాశ్చర్యచకితుడై "నీ వెవ్వతవు? ఒంటరిగా నీరాత్రి వేళ వచ్చి నన్నాటంక పరచు టెందుల?" కని యడిగెను. రుక్మాబాయి లజ్జా భయములతో పయ్యెద సవరించుకొనుచు "స్వామీ! నేను సిద్ధోపంతు కుమార్తెను. భగవదాజ్ఞ ప్రకారము నీకిచ్చి వివాహము చేయుటకు నిశ్చయింప బడిన దానను. తప్పించుకొని పోవుటకై ప్రయత్నించుచున్న నిన్ను మరల నింటికి బిలుచుకు పోవటానికై వచ్చితిని. దయచేసి లోనికి ర" మ్మని వినయముతో బలికెను.

విఠోబా కొంత యోచించి "చిన్న దానా నీవు గొప్ప తప్పిదము చేసితివి. స్త్రీల కెప్పుడును స్వాతంత్ర్యము లేదు. తల్లి దండ్రు లెవ్వని కిత్తురో వానినే వరింప వలెను. ఇంత రాత్రి వేళ బయటికి వచ్చి పర పురుషులను బలవంత పెట్టుట మంచిది కాదు. అభిమాన మెంత మాత్రమును లేని నీవంటి తులువ నెవ్వడైన వివాహ మాడునా? స్వతంత్రించి పురుషునితో సంభాషింప దలచిన వనిత వ్యభిచారిణి యనియే చెప్పవచ్చును. ఇంతటి దోషము నీ యందు జూచియు నీ ముఖము చూడవచ్చునా? ఛీ! ఇచ్చట నిలువక శీఘ్రముగా వెడలి పొ" మ్మని కసరుకొనెను.

రుక్మాబాయి "స్వామీ! నన్నూరక నిరాకరింపుము. న్యాయమును విచారించుము. పెండ్లి చేసికొనరాదన్న పట్టుదలతో నాయందు దోషము నారోపించు చుంటివి గాని న్యాయమును విచారించుట లేదు. భగవానుని యాజ్ఞ మేరకు నా తల్లిదండ్రులు నన్ను నీకే యీయవలెనని నిశ్చయించుట నేను నా మనస్సునందు నిన్నే వివాహమాడ నిశ్చయించితిని. అందువలన నీకు భార్యనైతిని. సందేహము లేదు. సర్వవిషయములకు మనస్సే

ప్రధానముగదా! మనః పూర్వకముగా జేసికొన్న వివాహమే వివాహము. కానీ యితరములు వివాహములు కావు. నామనస్సు నీకర్పించినప్పుడే నేను నీకు భార్య నైతిని. ఇతరులను కన్నెత్తి చూడను. నిన్ను పెండ్లాడకున్నచో నా ప్రాణముల నిప్పుడే నీపదముల కర్పణ చేయుదును. ఇది నిశ్చయ"మని పలికెను.

విఠోబా విసుగంది "చాల బాగున్నది. ఎవరి ముక్కునకు సూటిగా వారు చెప్పుట సహజము. నీ పలుకులు యుక్తమైనవి కావు. ఇతరులు విన్న నవ్వుదురు. వచ్చిన దారిబట్టి వెళ్ళుము. నిలిచినచో నీ పరువు దక్కదు. నేను తీర్థయాత్రాపరుడను. సంసారమునందిచ్ఛ లేనివాడను. నీవు నన్ను బీడించుటవలన ప్రయోజనము లేదు. మాట విని యింటికి వెళ్ళుము. ఇచట నిలువకు" మని పలికెను.

అందులకు రుక్మాబాయి "స్వామీ! పతివ్రత యన్యుల దలంపదు. అట్లు తలచినచో నది గాడిదెయేగాని యాడుది కాదు. నీవు నాకు భర్తవనియు, నేను నీకు భార్యననియు మనశ్శుద్ధిగా నిశ్చయించిన వ్యతిరేకముగా నడుచుకొనుట ధర్మమా? నిన్ను తిరస్కరించి మరి యొక్కని వరించునంతటి పాపాత్ములాలనుగాను. ఈసంగతి విన్న నెవ్వరైన నవ్వుదురంటివి. నలువురు నవ్వు నంతదాక మన మిచ్చట నుండవలసిన పనిలేదు. వెళ్ళుదము ర"మ్మనెను.

విఠోబా "వివేక హీనురాలా! నోటికి వచ్చినట్లు వదరు చున్నావు. నీ సుఖమును నీవు దలంచుచున్నావు. ఆత్మబుద్ధి సుఖకర మనియు, గురుబుద్ధి యధిక సుఖకరమనియు, పరబుద్ధి వినాశకర మనియు, స్త్రీబుద్ధి ప్రళయంకరమనియు పెద్ద లందురు. తల్లిదండ్రులను మోసగించి దారిని బోవువానితో దొంగతనముగా దేశాంత రము లేచిపోవుటకు ప్రయత్నించు నీ వంటి పాపాత్ములాలితో మాటాడినను పాపమే. ఇక తిరిగిచూడక వెడలిపొ"మ్మని ధిక్కరించి పలికెను.

రుక్మాబాయి "స్వామీ! నీవు నేను జెప్పిన విషయమునందలి న్యాయమును విచారించుట లేదు. భగవంతుని వాక్యముకంటే విశేషమున్నదా? అతని యాజ్ఞ మీరవచ్చునా? నీవు నన్ను తిట్టినను కొట్టినను సంతోషమే. నేను నీదాన"ననెను.

అందులకు విఠోబా మిక్కిలి విచారపడి, యామె బారినుండి

తొలగిపోవుట కష్టమని యెంచి, మంచిమాటలతో బుజ్జగింపనెంచి, "సుందరీమణీ! నీ యందచందములు వర్ణించుట కలవి గాదు అసమాన సౌందర్యనిధివి. నిన్ను వివాహ మాడవలెనన్నచో నెంతయో పుణ్యము చేసియుండవలయును. నీవంటి సౌభాగ్యవతికి నావంటి యనామ ధేయుడు పనికి రాడు. తల్లి ధనవంతుని, తండ్రి బుద్ధిమంతుని, బంధువులు కులవంతుని, కన్య సౌందర్యవంతుని కాంక్షించుట సహజము. కావున వికృతరూపముగల నన్ను వివాహమాడినచో నలుగురు నవ్వుదురు. నీ చక్కదనమునకు దగిన పురుషుని వెదకి వరింపుము. నన్ను తొందర పెట్టుటవలన ప్రయోజనము లే"దని పలికెను.

రుక్మాబాయి మందహాసముచేసి "స్వామీ! పతివ్రతకు పతి యెట్టివాడైనను అతనినే పరదైవముగా భావించి యతని యిష్టానుసారముగా మెలగుట కర్తవ్యము. పూర్వము దమయంతి తన సౌందర్య సౌకుమార్యములకు మోహించి దిక్పాలకులే వచ్చి బోధించినను మొట్ట మొదట తానపేక్షించిన నలునిదప్ప నితరులను వరించెనా? ధర్మమునకు వ్యతిరేకముగా నడువరాదు. నామనవి చిత్తగించి నాయందు కరుణించి నన్ను వివాహమాడిన మేలు. లేకున్న నా దేహము నగ్ని హోత్రమున కాహుతి చేసెద"నని పలికెను.

విఠోబా తప్పించుకొని పోవుటకు వీలుగాక యనేక విధముల జింతించుచు, కోపావేశపరుడై "ఓసీ! మూర్ఖురాలా! నాతో ప్రతిఘటింతువా? ఇప్పటికైన నామాటవిని యింటికి వెళ్ళుము. లేకున్న నిన్ను శపింతు"నని పలికెను. రుక్మాబాయి భయపడి  గజ గజ వణకుచు కంటికి మంటికి నేకదారగా పెద్ద పెట్టున నేడ్వసాగెమ.

## విఠోబా వివాహము

ఇంతలో సిద్ధోపంతును, నిరూబాయియు మేల్కాంచి, కుమార్తె రోదన ధ్వని విని, పరుగెత్తుకొనివచ్చి, రుక్మాబాయిని ధిక్కరించుచు నిలుచున్న విఠోబాను జూచి "అయ్యా! ఎంతటి నాటకమాడితివి? పిల్ల నిచ్చుట లేదని మేమేమయిన చిక్కులు గలిగించినగదా నీవిట్టి దుష్కృత్యమున కొడిగట్టవలసినది? దొంగతనముగా నీమెను లంకించుకొని పోవలసినంత పనియే"మని యనేక విధముల నిందించిరి.

విఠోబా సిద్ధోపంతుతో "అయ్యా! నన్ను దూషింపకుడు. నేను మీ కుమార్తెను మోసగించి తీసికొని పోవదలచ లేదు. గ్రహచారము చాలక మీయింటి కతిథినై వచ్చినందులకు మంచి బుద్ధి చెప్పినారు. ఇట్టిచోట నొక్క నిమిష మైనను నిలువరాదు. మీవంటి మోస గాండ్ర మొగము జూడరా"దని పలికి, యచటినుండి వేగముగా నడవసాగెను.

సిద్ధోపంతు తన కుమార్తెను భార్యను లోనికిబంపి, విఠోబా చేతిని బట్టుకొని "అయ్యా! కోపింపకుము. నిన్నటి విషయమేమియు దెలుపకయే నీ విట్లు వెళ్ళుట మంచిదికాదు. ఆలోచింతము ర" మ్మనెను. అందులకు విఠోబా కోపించి భగవంతుడే స్వయముగావచ్చి చెప్పినను నే నీవివాహమాడను. మీ దారి మీరు జూచుకొను"డని పలికి చేయి వదిలించుకొని వేగముగా నడువసాగెను. సిద్ధోపంతు యెంతయో బతిమాలెను. ఎంతజెప్పినను వినకపోగా విఠోబాతో " మా కుమా ర్తె నీయందే బద్ధాను రాగయై యున్నది. నీవు వివాహ మాడనిచో నామె ముందు వెనుక చూడక తక్షణమే ప్రాణములు విడుచును. అందువలన మేము బ్రతికినంత కాలము పుత్రికాశోకము ననుభవింపవలసివచ్చును. క్రమముగా మాకుమార్తె గతియే మాకునుబట్టును. ఇందువలన నీకు స్త్రీహత్యాపాతకముతో బాటు బ్రహ్మహత్యాపాతకము గూడ సంభవించును. అట్టి పాతకము సంభవించిన తదుపరి యాత్రాఫలము దక్కదు. జపతపములు ఫలింపనిచో మోక్షము సిద్ధింపదు. మామాట వినకున్న ఇన్ని యనర్థములు వాటిల్లును. ఆలోచించు"మని పలికెను.

విఠోబాకు గుండెల్లు జల్లుమనెను. ఆ యాపదనుండి కాపాడు మని భగవానుని ప్రార్థించెను. భగవాను డదృశ్యముగా నుండి "విఠోబా! విచారించకుము. నీవు సిద్ధోపంతు కుమార్తెను వివాహ మాడుము. నీకు సకలార్థ సిద్ధియగునని పలికెను. విఠోబా విస్మయ మందెను. సిద్ధోపంతు "అయ్యా! ఇప్పు డేమందువు. ఇకనైన వివాహము చేసికొందువా"యని పలికి యతనిని వెంటబెట్టుకొని యింటికి వచ్చి, తెల్లవారగనే బంధువులనెల్ల రావించి, పరమ సంతోషముతో తన కుమార్తె నతనికిచ్చి విధ్యుక్తముగా వివాహ మహోత్సవముచేసి, బంధుమిత్రుల నుచితరీతి సత్కరించెను.

మరునాడు విఠోబా సిద్ధోపంతుకు భక్తితో నమస్కరించి. "అయ్యా! బలవంతముగా పెండ్లి చేసి నీ యిష్ట ప్రకారముగా పొంద వలసిన ఆనందమునంతయు పొందితివిగదా? ఇప్పుడైన దయచేసి సెలవిచ్చిన

మిగిలినయాత్ర పూర్తి చేయుదు" ననెను. సిద్ధోపంతు భార్య కావిషయమును దెలిపి తాను గూడ విఠోబా వెంట బయలు దేఱెను. వారిరువురును దివ్యస్థలములను దివ్యతీర్థములను సేవించుచు నహోబిలము, శ్రీశైలము, పండరిపురము, శ్రీరంగము, గోకర్ణము, రామేశ్వరము మున్నగు పుణ్యస్థలములను సేవించి పుణ్య తీర్థములలో స్నానమాడి, వెనుకకు మరలి సుఖముగా కొన్ని దినములకు అలకావతి చేరిరి.

## విఠోబా తల్లిదండ్రులకడ కేగుట

ఒకనాడు విఠోబా సిద్ధోపంతుతో "ఇక నేనుబోయి తల్లిదండ్రులను దర్శింపవలెను. వారు నా రాకకై నిరీక్షించుచుందురు. దయచేసి సెలవి"మ్మని వేడెను. అందులకు సిద్ధోపంతు సమ్మతించి, మరుసటి దిన ముదయమున సకుటుంబముగా నతనితో ప్రయాణమై కొన్ని దినముల కాపగాముజేరి వియ్యపువారి యింటికి బోయెను.

విఠోబా తన తల్లిదండ్రులకు నమస్కరించెను. సిద్ధోపంతు వారికి నమస్కరించి కుమార్తెను దీసికొనివచ్చి మ్రొక్కించెను. గోవిందపంతు కుమారునిజూచి యానందించి "నాయనా! వీరెవ్వ"రని యడిగెను. సిద్ధోపంతు అందుకొని, విఠోబా తన యింటికి వచ్చినప్పటి నుండి జరిగిన విషయముల నెల్ల దెలిపి, వివాహ విషయమై వర్త మానముచేయ వీలుగా లేదనియు, నందులకు మన్నించు మనియు వేడెను. నిరూబాయి రుక్మాబాయిని జూచి మిగుల సంతసించెను. కోడలిని వియ్యపురాలిని శ్రద్ధగా నాదరించెను. గోవిందపంతు సిద్ధోపంతుకు నమస్కరించి "స్వామీ! మీ యనుగ్రహమువలన నా కుమారుని కన్నులార గనుగొను భాగ్యము గలిగినది. వీని వైరాగ్య వృత్తిని దలచినచో గుండెలు తల్లడిల్లును. మీ దయవలన మాకా విచారము తీరిపోయిన" దనెను. సిద్ధోపంతు తమ కంత మంచి సంబంధము లభించినందులకు సంతసించెను. సిద్ధోపంతు కొన్ని దినములుండి వారివద్ద సెలవంది, కుమార్తెకు జెప్పవలసిన బుద్ధుల జెప్పి, భార్యతో గూడ బయలు దేరి, స్వస్థలము చేరి భగవంతు నారాధించుచు సుఖముగా నుండెను.

కాలక్రమమున విఠోబాకు వైరాగ్య మధికమయ్యెను. రుక్మాబాయి కీడువచ్చి యయిదారు సంవత్సరములైనను నొక్కనాడైన నామెను కన్నెత్తి చూడలేదు. దైవవశమున నతని తల్లిదండ్రులు యోగనిష్ఠ నవలంబించియుండి

పరమపదించిరి. విఠోబా వారికి విధ్యుక్త కర్మలనెల్ల జరిపెను. ఒకనాడు తన భార్యతో "ఓసీ! నా తల్లిదండ్రుల యస్థులను దీసికొని వెళ్ళి గంగానదిలో గలుపవలెను. గనుక నేనిపుడు కాశికి వెళ్ళవలసియున్నది. నీ వొక్కతె వింట నుండ లేవు. నిన్ను దీసికొని వెళ్ళి నీ పుట్టినింట దిగబెట్టెదను, మన యింట నున్న సొత్తులో నీకు వలసినంత దీసికొని మిగిలిన దానిని భగవత్ప్రీతిగా పేదసాదలకు బంచి పెట్టు" మనెను. రుక్మాబాయి తనకొర కేమియు నుంచుకొనక సమస్తమును బీదసాదలకు బంచిపెట్టెను.

విఠోబా యామెను వెంటదీసికొని బయలు దేరుటకు సిద్ధ బడెను, ఇంతలో సిద్ధోపంతు తన వియ్యంకులు పరలోకగతులగుట విని తనయల్లు నోదార్ప నచ్చటికి వచ్చెను. తన యల్లుని చర్యల కాశ్చర్యపడి, తన కుమార్తెవలన విషయమంతయు విని, తన గ్రామమునకు, దీసికొనిపోవ నిశ్చయించెను. వారిని వెంట దీసికొని కొన్ని దినముల కలకావతి జేరెను. విఠోబా తనకు కాశికి వెళ్ళవలసిన యావశ్యకతను దెలియజేసి, వెళ్ళుటకు సెలవిమ్మని యడిగెను. సిద్ధోపంతు బడలిక దీర్చుకొని వెళ్ళవచ్చునని కొన్ని దినములు నిలిపెను. రుక్మాబాయి రహస్యముగా తల్లిదండ్రుల కతని వైరాగ్యమును విశదముగా దెలిపి, వెడిలిపోయిన మరల రాడనియు, నెట్లయిన సంసారమునందు మెలగు నట్లు చేయుడనియు పలికెను. సిద్ధోపంతు మిక్కిలి జాగరూకుడై యల్లుని నీడవలె ననుసరించి కంటికి ఱెప్పవలె గని పెట్టుకొని యుండెను.

ఒకనాడు విఠోబా గంగాయాత్రకు సెలవిమ్మని సిద్ధోపంతును నిర్బంధ పెట్టెను. సిద్ధోపంతు తాను గూడ వచ్చెదననెను. విఠోబా తన స్వేచ్ఛకు భంగము గలిగినందులకు మిక్కిలి విచారించి, భార్యను బిలిచి "ఓసీ! ఈ సంసార నరకము ననుభవింప నా కిష్టము లేదు. సన్యాసము దీసికొని స్వేచ్ఛగా నుండ నిశ్చయించితిని. నీకు దెలుపక వెళ్ళుట యుక్తము కాదు గనుక నిజము దెలుపుచున్నాను. నీ తల్లిదండ్రుల కీవిషయమును దెలువుము. జాగుచేయక నన్ను బంపించు"మని పలికెను. రుక్మాబాయి పిడుగువంటి యాపలుకుల కులికిపడి, తల్లి దండ్రులతో నావిషయమును దెలిపెను. సిద్ధోపంతు పరితాపపడి యల్లునికడకుబోయి, "నాయనా! నీవింకను పసివాడవు. విషయ సుఖమును బొత్తుగా ననుభవింపలేదు. ఈ వయసున నింద్రియములు వశపడవు. కాయ గసరులు దీని వనములలో వసించు మునులు సైత

మింద్రియములు వశము గాకపోగా షడ్రసోపేతములగు పదార్థములను భుజించుచు యౌవనావస్థలో నున్న వారి కవి వశమగునా? సంసార సన్యాసముల రెంటికి జెడి యిహపరములకు వెలియుక్తము కాదు. సన్యాస మిప్పటికి సుఖముగా దోచినను ఇంద్రియ వికారములకు జిక్కి త్రొక్కట బడినప్పుడు కష్టముగా దోచును. అనువిభంచునప్పటికిగాని దాని స్వభావము తెలియదు. ఏకార్యమునై నను మెట్టు వరుసను సాధింపవలయునేగాని త్వరపడి యొక్క మాఱే మీదికెక్క యత్నించుట యుక్తముకాదు. కూరుచుండి పరుండవలెనుగాని నిలుచుండియే పరుండబోయిన క్రిందబడి తలపగిలిపోవును. అందు వలన పెద్దలు బ్రహ్మచర్య గార్హస్థ్య వానప్రస్థ సన్యాసములను క్రమముగా నేర్పరచి, యనుష్ఠింపవలెనని విధించిరి. సన్యాసము సన్యాసమని యూరక తల్లడిల్లుచున్నావు. సన్యాసమనగా తల బోడి చేసికొని కాషాయవస్త్రములను ధరించుట కాదు. సంకల్ప వికల్పముల ద్రుంచివేసి జాగ్రత్తయందు సుషుప్తిని పొంది ఆనందమాత్రముగా నుండుటయే సన్యాసము. ఇది సామాన్యులకు సాధ్యముకాదు. తల బోడియైన మాత్రమున తలపు బోడి కాదు. నారదుడు, విశ్వామిత్రుడు, బృహస్పతి, శుక్రుడు, త్రిమూర్తులు సామాన్యులా? అంతటివారే స్త్రీ వ్యామోహమునకు జిక్కి చొక్కగా నితరుల మాట జెప్పనేల? కాలుడయిన వశమగునుగాని కాముడు వశుడుగాడు. సంసారమున నున్నను పద్మపత్రమువలె సంగముల నంటక ప్రవర్తించువాడే పండితుడుకాని, సన్యాస మవలంబించి సాధింప లేక పతనమగు వాడు పండితుడు కాడు. ఈ విషయము లన్నియును నీకు దెలియనివి కావు. తొందరపడి సన్యాసము దీసికొనుట యుక్తము కాదు. నామాట విని గృహస్థధర్మము నవలంబింవుము. అట్లు నీకిష్టము లేనిచో నొక్క కుమారుడు గలుగుదాకనయిన నీభార్యతో కలిసి మెలసి యుండు" మని భోధించెను.

విఠోబా తన మామకు నమస్కరించి, "స్వామీ! సింహ మెంతయాకలిగొన్నను సమీపమున దిరుగాడు నక్కలమీద చేయి వేయక మదగజ కుంభస్థలములకే వేచియుండు నట్లు విరక్తుడెప్పుడును విషయములు తనంతన పైబడి వచ్చినను లెక్కింపక పరమానందమునే కోరుచుండును. యుక్తాయుక్త పరిజ్ఞానముగల వివేకి యెప్పుడును స్త్రీ సుఖము నపేక్షింపడు. సంతత దుఃఖములకు మూలముగు సంతానము నాకేల? మీరు కాదు,

భగవంతుడే వచ్చి నన్నడ్డగించినను నేనిచట నుండను. నాయాశమాను"డని పలికి, వారెంత బతి మాలినను వినక యస్థుల నెత్తుకొని కాశికి నడువబోయెను. రుక్మాబాయి యేడ్చుచు నతనిపాదములను గట్టిగా, బట్టుకొనెను. విఠోబా వారిని మోసగించిపోవ నిశ్చయించి యప్పటికి ప్రయాణము మాని వేసెను.

కొంతకాలము గడచిన పిదప విఠోబా యొకనాడు ప్రాతఃకాలమున భార్యకడకుబోయి, "స్నానమునకై వెళ్ళెద"నని ద్వంద్వార్థముగా జెప్పెను. రుక్మాబాయి యతిని కపటము దెలియక "చిత్త" మని ప్రత్యుత్తర మిచ్చెను. తోడనే విఠోబా సంతోషాంతరంగుడై, శని వదలినదని యెంచి, పంజరమునుండి విడివిడిన చిలుకవలెను, రంభ యొక్క చిక్కు నుండి విముక్తి నొందిన శుకమహర్షి వలెను, సంసార గహనము నుండి తప్పించుకొని, వాయు వేగమున బరుగెత్తుచు నిద్రాహారములు మాని రాత్రింబవళ్ళు ప్రయాణము చేసి కొన్ని దినములకు కాశి చేరేను. గంగానదిలో స్నానము చేసి, జననీ, జనకుల యస్థులను గంగలోగలిపి, పిండప్రదానాది కార్యముల నొనర్చి ప్రయాగకు బోయెను. అచటి నుండి పుష్కరమునకు బోయి యొకచోట బస చేసి, సత్పురుషులతో నిరంతరము వేదాంత శ్రవణము చేయుచు సుఖముగా నుండెను.

తన పెనిమిటి యెంత తడవునకు రాకపోవుటచే రుక్మాబాయి తన తల్లిదండ్రుల కావిషయమును దెలిపి, యేడ్వసాగెను. సిద్ధోపంతు విఠోబా చెప్పిన మాటలలోని గూఢార్థమును పర్యాలోచించి, మోసగించి వెళ్ళెనని నిశ్చయించి, పలువురు మనుష్యులను బంపి వెదకించెను.కాని యల్లునిజాడ తెలియ లేదు. రుక్మాబాయి యేడ్చి యేడ్చి యాహార పానీయముల నొల్లకుండెను. తల్లిదండ్రు లామె నోదార్చిరి. అగ్ని ప్రవేశ మొనర్తునని పలుగకా సిద్ధోపంతు "తల్లీ! కొలది దినములు గౌరీవ్రతము సనుష్ఠింపుము. అవస్యముగా మరల బతితోడి సంగతి పడయగలవు. తొల్లి పరమశివుని భర్తనుగా వరింపగోరి పార్వతీ దేవియ, శ్రీకృష్ణుని భర్తనుగా వరింపగోరి రుక్మిణీ దేవియు, నీ వ్రతమునే సలిపి తమ యిష్టాపూర్తి చేసికొని సంతుష్టి నొంది"రని పలికి, సమ్మతింపజేసెను. వ్రతవిధానమును దెలియజేసెను. రుక్మాబాయి తండ్రి యుపదేశించినట్లు భక్తిశ్రద్ధలతో నావ్రతము ననుష్ఠించుచుండెను.

# విఠోబా శ్రీ పాదస్వామి నాశ్రయించి సన్యాసము స్వీకరించుట

ఒకనాడు విఠోబా సాధువులతో గూడి వేదాంత ప్రసంగము చేయుచున్న యొకసత్పురుషుని కడకుబోయి యత డుపన్యసించు నిషయములనెల్ల శ్రద్ధగా వినుచుండెను. ఆ పురుషుడు "అయ్యలారా! అన్ని యోగములలో సన్యాసము శ్రేష్ఠమైనది. సమస్త ప్రాణుల యందు సమదర్శనము గలిగి వర్తించువానికి సులభముగా సద్భక్తి లభించును. భక్తివలన పరమాత్మదర్శనము, పరమాత్మ దర్శనము వలన బ్రహ్మానందమును గలుగును. భగవంతునియందు చిత్తము జేర్చి సుఖించువాని కెప్పుడును దుఃఖము లేశమైన గలుగదు. అహంకార మమకారములకు లోబడినవాడు తప్పక చెడిపోవును. సంసారబంధము నుండి విడుదల జెందుటకు ముఖ్య సాధనము రాగద్వేషములను విడు చుటయే. విషయ సుఖానుభవము విషముతో గలిసిన పాలవలె తాత్కాలికముగా నానందము గలిగించినను మీదటికి అనంత దుఃఖములకు పాత్రముగా జేయును. కావున విషయసుఖములను స్మరింప రాదు. శోత్రాది ద్వారముల గుండ బుద్ధియందు బ్రవేశించు శబ్దాది విషయములను నిగ్రహించి దృష్టిని భ్రూమధ్యమున నిలిపి ప్రాణా పానములను రెంటిని సమముగా నాసికము లోపల చరింప జేసి, మనో బుద్ధీంద్రియములను వశపరచుకోని యరిషడ్వర్గమును జయించి కేవల ముముక్షత్వమును వహించి మెలగువా డొక్కడే బ్రహ్మానందము ననుభవింప పాత్రుడు. తక్కినవారు పాత్రులు కారు" అని చెప్పెను.

విఠోబా కావిషయము విన్నప్పటి నుండియు సన్యాసము పై కాంక్ష హెచ్చెను. యోగ్యుడగు నాచార్యుని కొరకు దిరుగసాగెను. ఒకనా డాకస్మికముగా నక్కడ వసించుచున్న శ్రీపాదస్వామి యను బరమహంస యతనికి గనబడెను. విఠోబా యతని లక్షణములనెల్ల బరీక్షించి, దనకు దగిన యాచార్యుడని నిశ్చయించి, యతనిని సమీ పించి, సమస్కరించి, చేతులు జోడించుకొని వినయముతో నిలుచుండి, యతని ననేక విధముల గొనియాడెను.

శ్రీపాదస్వామి విఠోబాను గనుగొని "నాయనా! నీ వెవ్వడవు? నా కడకేల వచ్చితి?" వని ప్రశ్నించెను. అందులకు విఠోబా

"స్వామీ! సంసార బాధనుండి తప్పించుకొని సుఖింపవలెనను

కోరికచే నిన్నాశ్రయించితిని, కరుణించి నన్ను నీదాసునిగా జేసి రక్షింపవలె"నని ప్రార్థించెను. శ్రీపాదస్వామి "ఎల్ల వారికి సంతోషము గలిగించుచున్న సంసారము నీకెట్లు బాధ కలిగించినదో తెలుపు"మనెను. అందులకు విఠోబా "స్వామీ! విషయ సుఖములను గొప్పగా నెంచి దానివలన నెట్టి సంతోష మనుభవింతురో తెలియదుగాని నేను మాత్రము సంసారమను కీకారణ్యమున జిక్కువడి త్రోవగానక త్రొక్కడ పడుచున్నాను, దయచేసి దారిజూపి కడ తేర్చు"మనెను.

శ్రీపాదస్వామి మందహాసము చేసి, "నాయనా! అర్థమైనది. విషయములను ఘోరమృగములను జంపుటకు దగిన చంద్రహాసము కొరకు నేనును నీ వలెనే వెదకుచున్నానుగాని నా కింతవర కది లభింప లేదు. ఈ విషయము తప్ప తక్కిన విషయము లేవికావలసి యున్నను నిరాటంకముగా నిచ్చెద" నని పలికెను. అందులకు విఠోబా "స్వామీ! నన్నూరక పరీక్షించుట వలన ప్రయోజనము లేదు. నాపై దయ యుంచి నన్ను శిష్యునిగా బరిగ్రహించి తత్వమార్గమును బోధించి యహంకార మమకారములను దొలగించి యజ్ఞానమును నిరసించి ఆనంద రసపానముచేత జొక్కు నట్లుగా ననుగ్రహించి రక్షింప వలె"నని పలువిధముల బ్రార్థించెను.

స్వామి యతని తీవ్ర పరిపాకమునకు మెచ్చి, కరుణాకటాక్షముల విఠోబా నాదరించి, తన సమీపమున గూర్చుండజేసికొని, "నాయనా! ఇంతటి వైరాగ్య సంపన్నుని నేనింతవరకు చూడలేదు. నీ చిత్త స్థైర్యము శ్లాఘింపదగినవి. ఇంత చిన్న వయస్సులో నింతటి వైరాగ్యము కుదురుట నీ యదృష్ట"మని పలికి, "నీవు బ్రహ్మచారివా? గృహస్థుడువా? తల్లిదండ్రు లున్నారా? లేరా? నిక్కముగా తెలియజేయ" మని యడిగెను. విఠోబా తనకు వివాహమైన సంగతి తెలిపినచో నచటి నుండి వెడలగొట్టునని యెంచి తాను బ్రహ్మచారి ననియు, కొలది దినములు క్రింద తన తల్లిదండ్రులు కాలధర్మ మొంది రనియు పలికెను. శ్రీపాదస్వామి సంతోషించి యతని శిరము మీద తన కరముంచి, శ్రద్ధతో వినుమని చెప్పి, ప్రణవాది మంత్రములలో నగ్రగణ్య మైనదియు, సమస్త సిద్ధులను సులభముగా సమకూర్చు నదియు, నద్వితీయ భావమును స్థాపించునదియు, వేదాంతములలోని సారాంశమైనదియు, మన శ్చలనమును నిరోధించునదియు, సచ్చిదా నంద భావమును బ్రసాదించునదియు, నిత్యానందప్రద మైనదియు, పదార్థత్రయయుక్త

మైనదియు, నైక్యాను సంధానమును వెల్లడించు నదియు, మతభేదరహిత మైనదియు, సంశయములనెల్ల ఖండించు నదియు, నహంకార మమకారములను నశింపజేయునదియు, నఖండానందము ననుగ్రహించు నదియునై వెలయుచున్న 'తత్త్వమసి' యను మహావాక్యమును బోధించి భవబంధ విముక్తునిగా జేసెను.

విఠోబా పరమానందముతో గురువునకు నమస్కరించి, యా మహావాక్యము యొక్క రహస్యార్థమును వివరము తెలియ జేయుమని ప్రార్థించెను. శ్రీ పాదస్వామి యధిక సంతోషముతో "నాయనా! ఈ మహావాక్య రహస్యార్థకమును దెలిసికొనుటకు నీ వధికారివై యున్నావు సావధాన చిత్తుడవై వినుము.

ఋగ్వేదము నందు ప్రజ్ఞానం బ్రహ్మయనియు, యజుర్వేదము నందు అయమాత్మా బ్రహ్మయనియు, సామవేదమునందు తత్వమసి యనియు, ఆధర్వణ వేదమందు అహం బ్రహ్మాస్మియనియు జెప్పబడు నీమహావాక్యములు శిరోభూషణములై యున్నవి. వానియర్థమును విశదముగా దెలియజేయు నంతటిశక్తి నాకు లేదుగాని, పెద్దలవలన విన్నంతవరకు నీకు వంచన లేక తెలియజేసెదను.

"ప్రజ్ఞానమనగా నాత్మ; బ్రహ్మమనగా పరమాత్మ; ప్రజ్ఞాన స్వరూపమే బ్రహ్మమని తెలియజేయుటయే మొదటి వాక్యము యొక్క యంత రార్థము. శబ్ద స్పర్శ రూప రస గంధములను విషయములను దెలిసికొను నింద్రియములను, ఆ యింద్రియములను దెలిసికొను నంతఃకరణములను, ఆయంతఃకరణములను తెలిసికొను చిదాభాసుని, వీని నన్నిటిని మరుగుపరచు నవిద్యను దెలిసికొనుచు సాక్షి మాత్రముగా వెలయుచున్న పదార్థమే ప్రజ్ఞానమనియు, నిట్లు సమస్త పదార్థములలోపల నివసించి వాని నెల్ల తెలిసికొను సర్వసాక్షియే బ్రహ్మమనియు వేదములు పలుకుచున్నవి. బహువిధ నామముల కాధారమై సాక్షిమాత్రముగా వెలయుచున్న జ్ఞానమే యాత్మ యనియు, బహువిధ నామముల కాధేయమై సర్వసాక్షిగా వెలయు చున్న బ్రహ్మమే పరమాత్మయనియ వేదాంత శాస్త్రములు తెలుపుచున్న"వని చెప్పెను.

అందులకు విఠోబా "స్వామి! ఒక్క దేహమునకు సాక్షిగా నున్న యాత్మ సర్వసాక్షి యగు పరమాత్మ యెట్లు కానేర్చు"నని యడిగెను. స్వామి

"నాయనా! దీపము దివిటీ యనుపేర్లు వేరుగా నున్నను వాని ప్రకాశము మాత్రము భిన్నము కానట్లు ఆత్మ పరమాత్మ యను నామములు భిన్నములుగా నున్నను స్వభావము మాత్ర మొక్కటిగానే యుండును. పెద్దదిగా నున్నందున చెరువనియు చిన్నదిగా నున్నందున మడుగనియు, నొక్కడున్న మనుష్యుడనియు ననేకులున్న సంఘమనియు, నామభేదములు గలిగియున్నను జలముల యొక్కయు, మనుజుల యొక్కయు స్వభావము మాత్రము వేరుపడక యొక్క విధముగా నుండునట్లు ఒక్క దేహమునకు సాక్షిగా నుండుట వలన నాత్మయనియు, సకల దేహములకు సాక్షిగా నుండుటవలన పరమాత్మయనియు నుపాది భేదముల చేత నామము లేర్పడినవిగాని విచారించగా నాత్మ పరమాత్మలకు భేదము లేదు" అని చెప్పెను.

విఠోబా "ఆత్మస్వరూప మెట్టి"దని యడిగెను. స్వామి "ఇంద్రియ మనోవికారములను నిగ్రహించి, మానావమానములను దూరము చేసి, మౌనముద్ర ధరించి, సంకల్ప వికల్పముల నణచి, నిర్వికల్ప సమాధియందు నిశ్చలతనొంది సుఖముగా నుండుటయే బ్రహ్మను సంధానము. ఇదియే యాత్మస్వరూప" మని చెప్పెను. అతనికి బూర్ణాభిషేకముకమును జేసి చైతన్యస్వామి యని నామముంచి, తాను నిర్వి కల్పసమాధి నిష్ఠబూని, బ్రహ్మానందము ననుభవించుచుండెను. గురు కరుణా కటాక్షముచే సంకల్పములెల్ల తోలగిపోయి చిత్తస్థైర్యము కలుగగా విఠోబా బ్రహ్మధ్యానమునకు బూనుకొని బ్రహ్మానందము ననుభవించుచుండెను.

# శ్రీ పాదస్వామి యలకావతికి వచ్చుట

సిద్ధోపంతు తన కుమార్తెకు గలిగిన దుర్దశకు మిక్కిలి చింతించి, తమకు గలిగిన కష్టములను తొలగించి రక్షింపుమని నిరంతరము పాండురంగని ప్రార్థించుచుండెను. అతని భార్యయు తన కూతురు నల్లునిని జేర్చి సంతోషమును గలిగించుమని నిరంతరము రుక్మిణీ దేవిని ప్రార్థించుచుండెను. రుక్మాబాయి తండ్రి యుపదేశించినట్లు గౌరి పూజ చేయుచుండెను. తల చిక్కు తీయకపోవుటచే వెండ్రుకలు జడలు గట్టి ముఖమును కొకవిధమైన దివ్య తేజమును గలిగించుచుండగా జూచినవా రెల్లరు పరాశక్తి యని భావించి భక్తితో నామెకు సమస్కరించుచుండిరి. ఇట్లు

సంవత్సర కాలము గడచెను.

వారి తపోమహిమ శ్రీ పాదస్వామియొక్క మనస్సును వికల పరచి సంచార సమాధియందు విశేషాసక్తిని బుట్టించి యచటినుండి యతనిని లేవదీసెను. స్వామి కాశినుండి బయలుదేరి గ్రామములు దిరుగుచు నొకనా డుదయమున నలకావతికి వచ్చి చక్రతీర్థ సమీపమున నశ్వత్థ వృక్షము క్రింద పద్మాసనము వేసికొని కూర్చుండి బ్రహ్మానందరసమున మునిగి పరవశత నొందియుండెను.

రుక్మాబాయి యెప్పటివలె చక్రతీర్థమునందు స్నానముచేసి, యశ్వత్థ ప్రదక్షిణమునకై యచటికి వచ్చి, చెట్టుక్రిందనున్న శ్రీ పాద స్వామిని జూచి, యతడు గొప్పవాడై యుండునని యెంచి, త్వరితముగా నింటికేగి, భోజనపదార్థములు గొనివచ్చి, అతనికి నమస్కరించి "స్వామీ! నీవు మిక్కిలి బడసియున్నావు. దయచేసి యీ పదార్థములను స్వీకరించి కొంత విశ్రాంతి నొందు"మని ప్రార్థించెను. శ్రీ పాదస్వామి రుక్మాబాయి యొక్క మృదుమధుర వచనములు విని కన్నులువిచ్చి యామె మొగమువైపు జూచి, యామె వినయ విధేయతలకు సంతసించి, "సౌభాగ్యవతివై ముగ్గురు కుమారులను నొక్క కూతురును బడసి సంతోషముగా సుఖింతువుగాక"యని యాశీర్వదించెను. రుక్మాబాయి యద్భుత ప్రమోదములు బెనకొన చిరునవ్వుతో నా సన్యాసిని జూచుచు నిశ్చేష్టయై నిలువబడెను. స్వామి యీ చిరునవ్వున కేదైన కారణ ముండవచ్చునని యెంచి "అమ్మా! నవ్వు చుంటివేల? నా యాశీర్వాదము నిష్ఫలమగునని యెంచితివేమో! అట్లు తలంపకుము, నాయాశీర్వాద మెంతమాత్రము వ్యర్థముకా"దని పలికెను. రుక్మాబాయి తాను దెచ్చిన పదార్థముల నెల్ల వడ్డించి స్వామి సంతుష్టిగా భుజించి, విశ్రమించినపిదకు "స్వామీ! చవిటి నేలబడిన విత్తనమును, అపాత్రునియందు వినియోగించిన దానమును, జెవిటివాని యెదుట పాడిన సంగీతమును, లుబ్ధునకు బోధించిన ధర్మోపదేశమును నిష్ఫలమైనట్లు దురదృష్టవతినగు నాయెడ నీవను గ్రహించిన యాశీర్వాదము నిష్ఫలమైనదిగదాయను విచారముచేత నవ్వితి" ననెను. శ్రీ పాదస్వామి "హరిహర బ్రహ్మాదు లడ్డపడినను నాయాశీర్వాదము నిష్ఫలము కాదు. సందేహింప బని లే"దనెను. రుక్మాబాయి. "స్వామీ! నీమాట వాస్తవమేకాని యధి నెరవేరుటకు గొప్ప ప్రతిబంధక మొకటియున్నది. పురుషుడు లేక పుత్రులు గలుగ నేరరు గదా"యనెను.

అందులకు స్వామి "నీ పురుషు డేమయ్యెనో తెలియ జేయు"మనెను. రుక్మాబాయి "నా భర్త సంసారమును రోసి యెవ్వరికిని జెప్పక సంవత్సరము క్రింద దేశాంతరము లేచిపోయెను. సన్యాసము దీసికొని కాశిలో నున్నాడన్న వార్త యిప్పుడే తెలిసినది. సంసారములో నున్నప్పుడే నన్ను స్పృశించుట కిష్టము లేక వర్తించు వాడు నన్నింక బరిగ్రహించునన్న విషయము నెట్లు నమ్మవచ్చునో యూహింపుము. నీ యాశీర్వాదము ఫలింపవలెనన్న నా పెనిమిటి సన్యాసమును వదలి మరి సంసారి కావలెనుగదా? ఈ విషయమై నాకు సంశయము గలుగుచున్నది. దైవసంకల్ప మెట్లున్నదో తెలియ" దనెను. శ్రీ పాదస్వామి కొంత యోచించి "నీ భర్త గృహస్థుడై యుండుటగాక యపుత్రవంతుడై యుండగా యుక్తాయుక్తములను విచారించక యతనికి సన్యాస మిచ్చినవా డెవ్వడై యుండును? సంతానము గలుగుటకు ముందు సన్యసించినవాడును, యుక్తాయుక్తములను విచారించక యట్టివానికి సన్యాస మిచ్చినవాడును తప్పక నరకమునకు పోవుదురు. నీ మగనికి సన్యాసమిచ్చినవా డెవ్వడో కొంత దెలియ జేయు"మనెను. రుక్మాబాయి "సన్యాసిమిచ్చిన దేవరో తెలియ" దనెను. స్వామి "నీ పెనిమిటి నిన్ను వదలి వెళ్ళుటకు కారణమేమి? అత డట్లు వెళ్లుచుండగా నీవు పరమపతివ్రతవయ్యు నతని వెంట పోకుండుటకు కారణమే? మని యడిగెను. రుక్మాబాయి తన భర్త తీర్థయాత్రలకై బయలు దేరి వచ్చి తన్ను వివాహమాడినది మొదలు తన్ను విడిచి వెళ్ళు వరకు జరిగిన సంగతి నంతయు వివరించి, దుస్థితికి మిగుల దుఃఖిం చెను. శ్రీపాదస్వామి తనలో కొంత యనుమానపడి యతని యంగమత్సములను విచారించి, తన శిష్యుడగు చైతన్యస్వామియే యామె భర్తయై యుండునని యూహించి, ప్రమాదవశమున తనకు గలిగిన పాపమునకు పశ్చాత్తాపపడి, తవ యజాగ్రత్త వలన జరిగిన యకార్యమును గూర్చి చింతించి, యామెను "భర్త పేరే " మని యడిగెను. ఆమె తన భర్త పేరును క్రింద వ్రాసి చూపెట్టెను. స్వామి విఠోబా జరిపిన యకార్యమున కతని మీద నాగ్రహించి యతని ననేక విధముల దూషించుచు "ఇట్టి దుష్కృత్యమున కొడిగట్టిన యా దుర్మార్గు నిప్పుడే శపించి భస్మ మొనర్చియుందునుగాని నీకు జేసిన వాగ్దానము వలన వానిని క్షమింపవలసి వచ్చినది. పరమ పతివ్రతయగు పత్నిని విడిచి పెట్టి దుఃఖసాగరమున ముంచినది గాక కల్లలాడి నన్ను గూడ గొప్ప దోషమునకు గురి చేసినాడు. నీ తల్లిదండ్రుల నిచ్చటికి దీసికొని

ర"మ్మనెను. వెంటనే రుక్మాబాయి యింటికేగి తల్లిదండ్రులకా విషయము నెల్ల దెలిపి, వారి నచటికి దీసికొని వచ్చెను. సిద్ధోపంతు దివ్య తేజస్వీయగు సన్యాసిని జూడగానే భక్తి ప్రవత్తులతో సాష్టాంగముగా నమస్కరించి, యతనిని దన యింటికి దీసికొని వచ్చి, యుచితాసనమున గూర్చుండబెట్టి, యర్ఘ్య పాద్యములతో బూజించి, యతని యాగమన కారణము నడిగెను. పరమహంస "అయ్యా ! నేను కాశి నుండి యాకస్మికముగా రామేశ్వర యాత్రకై బయలు దేరితిని. రుక్మాబాయి దెలిపిన విషయమును బట్టి మరల కాశికి బోవలసినట్లు తటస్థించినది. నీ కుమా రైను వెంట దీసికొని నాతో కాశికి బయలు దేరవలయు" ననెను. సిద్ధోపంతు సంతసించి రుక్మాబాయిని దీసికొని పరమహంసతో కాశికి బయలు దేఱెను.

# విఠోబా గృహస్థాశ్రమ స్వీకారము

వారు మువ్వురును రాత్రింబగళ్ళు ప్రయాణము చేసి కొన్ని దినములకు కాశీ చేరిరి. శ్రీపాదస్వామి సిద్ధోపంతును రుక్మాబాయిని తన మఠములో నొకచోట రహస్యముగా నుండ నియమించి, యొక శిష్యుని బంపి, విఠోబాను బిలిపించి, "ఓరీ! చైతన్యా! నీవు బ్రహ్మ చారివా! గృహస్థుడవా వాస్తవముగా జెప్పుము. నిజము దాచితివా నిన్నిప్పుడే శపింతు" సని కోపముతో పలికెను, విఠోబా యులికిపడి గజగజ వణకుచు, నబద్ధమాడ వెరచి, వాస్తవస్థితిని దెలుపుట యుక్తమని యెంచి, వాస్తవమును వినిపించి, "స్వామీ ! నా మనో ధనముల నెల్ల నీ కెప్పుడో ధారపోసితిని గాన నీవేమి చేసినను చేయ వచ్చును. నీ యాజ్ఞానుసారము నడచుకొనుటకు సిద్ధముగా నున్నా" నని పలికి, "శరణాగతుని రక్షింపు" మని మొరపెట్టుచు నతని పాదములను బట్టుకొని మేద్వసాగెను. అటనున్న శిష్యులందరును "స్వామీ! దయచేసి చైతన్యస్వామి తప్పిదమును మన్నించి రక్షింప వలె" నని దీనిత్వముతో బ్రార్థించిరి. శ్రీపాదస్వామి కనికరించి వారి ప్రార్థన మంగీకరించి, చైతన్యస్వామిని కరుణా కటాక్షముల గనుగొని యాదరించి, "నాయనా! భయపడకుము అలకావతిలో నీ విషయము నంతయు వివరముగా విన్నాను. నీవివుడు వాస్తవమునే పలికితివి భగవద్వాక్యమును మీరరాదన్న యభి ప్రాయము చేతనే గదా నీ వా చిన్న దానిని వివాహ మాడినది? అట్టి విషయమును నిట్టి పరమ పతివ్రతము విడిచి పెట్టి నీ విట్లుండుట యుక్తము కాదు. గృహస్థుడనన్నచో నే నుపదేశింప

నన్న సంశయము చేత వాస్తవస్థితిని దాచి నాతో బ్రహ్మచారి నని యొక విధముగా బొంకితివి. అయిన నా విషయమై యెంత మాత్రము చింతింపకు" మని పలికి, లోపలనున్న రుక్మాబాయిని బిలిచెను. రుక్మాబాయి వచ్చి వినయముతో పెనిమిటి పాదములమీద వ్రాలి యేడ్వసాగెను. విఠోబా యత్యాశ్చర్యధుర్యుడై యేమియు మాటాడుటకు దోచక తలవంచుకొని యూరక నిలిచియుండెను. శ్రీ పాదస్వామి "ఈమె యెవ్వతెయో తెలుపు" మనెను ? విఠోబా మారుబలుక లేక నిలిచియుండెను.

శ్రీ పాదస్వామి మందహాసము చేసి "కుమారా! ఏల యిట్లు యోచించుచున్నావు? అరుంధతి, యనసూయ, చంద్రమతి, దమయంతి మొదలగు పతివ్రతా రత్నములతో తులదూగ గలిగిన ధర్మపత్నిని వదిలివేసి పైకి సన్యాసి వేషము వేసికొన్నందున ప్రయోజనమేమి? ఈ పరమ పతివ్రత యొక్క మన స్సెంత మాత్రము నొచ్చినను నీ బ్రహ్మోపాసన యంతయు నిరర్థక మగును. వేయి మంది సన్యాసులై నను సంసారియగు జ్ఞాని కొక్కనికి సమానులు కాలేరు. ఇట్టి పతివ్రతా రత్నముతో సంతత సాంగత్యము గలిగినచో సులభముగా కైవల్యము చూరగొనవచ్చును. ఈమె బాధపడిన నీ వెన్నటికిని వృద్ధి చెంద లేవు. సృష్టి స్థితి లయ కర్తలగు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు సహితము పరమ పతివ్రతయగు ననసూయ దేవి మహత్త్వమున కచ్చెరువంది యామెకు పుత్రులైరని వినుచున్నాము. పతివ్రతల మనసు నొప్పించుట రౌరవాది నరకములకు కారణముసుమా! నీకు తెలియని ధర్మములు లేవు. నీవు పాండురంగని యనుగ్రహమున జన్మించిన వాడవు. ఆచార్యు డొక్కడే రక్షకుడని యాశ్రయించిన వాడవు. ఆధ్యాత్మ తత్వమునంతయు నామూలాగ్రముగా నెరిగినవాడవు. నీవంటి ప్రజ్ఞావంతుడు మరియొక డుండడు. ఇట్టి వాడవగు నీ యందగ్ని సాక్షిగా వివాహమాడిన భార్యను నిష్కారణముగా విడిచి పెట్టి సన్యాసము పుచ్చుకొన్నావన్న దోషము వ్యర్థముగా. నారోపింప బడుట యుక్తముకాదు. నామాట విని యీమె నంగీకరించి, గార్హస్థ్య ధర్మము నవలంబించి, నాకు సంభవించిన యపవాదమును దొలగించి, కృతార్థుడవై, బ్రహ్మానందము ననుభవింపుము. అంతర వైరాగ్యమే ప్రయోజనకారిగాని బాహ్య వైరాగ్య మేమాత్రమును ప్రయోజన కారి కాదు. ఇతర చింత మాని నేను జెప్పినట్లు నడచుకొనుము. నీకు సమస్త శ్రేయములు గలుగు"నని యనేక విధముల బోధించి, యతనిని

సమాధానపరచి, యతని జడలను కాలి గుడ్డలను దీయించి వేసి, గృహస్థ వేషమునకు దగిన వస్త్రములు కట్టించి తనవద్ద గూర్చుండ బెట్టుకొనెను.

ఇంతలో సిద్ధోపంతు వెలుపలికివచ్చి శ్రీ పాదస్వామికి నమస్క రించి "స్వామీ! నీ కటాక్షమువలన నేడు కృతార్థుడనైతిని. నాపూర్వులెల్లరు తరించి"రని పలికి యతని గుణముల గొనియాడెను. రుక్మాబాయి స్వామి యనుమతిప్రకారము తన వికార వేషమును దీసి వేసి సముచిత ప్రకారముగా వస్త్రభూషణముల నలంకరించి, సాక్షాత్తు లక్ష్మీ దేవివలె వచ్చి భక్తి ప్రపత్తులతో నచ్చట గూర్చున్న భర్తకును, గురునకును, పితృ దేవునకును నమస్కరించెను.

శ్రీ పాదస్వామి యామెకు బ్రహ్మోపదేశము చేసి, నడవ వలసిన పద్ధతుల నెల్ల విశదమగా దెలిపి, వారిని రెండుమూడు దినము లచ్చటనే నిలుపుకొని, తరువాత విఠోబాకు జెప్పవలసిన బుద్ధులు నన్నిటిని జెప్పి, యాశీర్వదించి, స్వదేశమునకు వెళ్ళుటకు సెల విచ్చెను.

విఠోబా గురువును విడిచి వెళ్ళుటకు మనసొప్పక చేతులు జోడించి "స్వామీ! నన్ను సంసారసాగరములో బడవేయుచున్నావు. భార్య యున్నదన్న సంగతిని జెప్పక బ్రహ్మోపదేశమును పొంది నందులకు ఈ శిక్ష నాకు విధించితివి కాబోలు! లేకున్న నన్నిట్లు చేయవు ఇది తప్పిదముగా నెంచి నాకీ శిక్ష విధించుట వాస్తవమయిన దయ చేసి యీ నేరము నొక్క దానిని మన్నించి యేవిధముగానైన నన్ను రక్షింపపలె"నని బతిమాలుచు కంటికి మంటికి నేకధారగా రోదనము చేయసాగెను.

శ్రీ పాదస్వామి! "నాయనా! విచారింపకుము. నాకు నీయందు గల ప్రేమాతిశయముతో నీకు నా తపము నంతయు ధారపోసితినిగదా! దీనివలన నీవొక్కడవే కాక నీ పూర్వు లెల్లరును సద్గతిని చెందిరి. నీకు త్రిమూర్తుల యంశమున ముప్పురు కుమారులును పరాశక్తి యంశమున నొక్క కుమార్తెయు నదయింతురు. వారివలన నీకఖండ బ్రహ్మానందము గలుగును. నీభార్యకు నేను నలువురు బిడ్డలు గలుగు నట్లు వరమిచ్చితిని గనుక నామాటను నెర వేర్చుము. పురాకృత సుకృత విశేషముచే నాకు నీ వంటి సత్పురుషుని శిష్యునిగా పరిగ్రహింపగలిగిన భాగ్యము లభించినది. నామాట విని నీవు మెల్లగా స్వస్థలము చేరి నీ భార్యతో కలిసి కాపురము చేయుచుండుము. ఇంతలో నేనును సంచార సమాధిని పూర్తి చేసి నీయొద్దకు వచ్చెదను" అని చెప్పి యతనిని సమాధాన పరచెను.

విఠోబా స్వామికి నమస్కరించి "స్వామీ! చపల స్వభావము గల సంసార ప్రతిబంధ మొక వేళ సమాధి నిష్ఠను జెడగొట్ట దలపెట్టినచో బ్రహ్మమన్న దృఢ ప్రజ్ఞ పోయి యజ్ఞానముచేత గప్పబడి మాయాంధకారమున జిక్కి త్రోవగానక త్రొక్కుడ పడవలసి వచ్చునుగదా? దాని కేమి చేయవలయునో సెలవి"మ్మని యడిగెను. స్వామి చిరునవ్వుతో "నాయనా! ఆ విషయమై సందేహింప పని లేదు. అఖండమై, అవ్యయమై, అవాఙ్మానస గోచరమై, ఆనంద మయమై, అద్వితీయమై, సగుణ నిర్గుణమై, అణువై, మహత్తై స్వయం ప్రకాశమై, సర్వవ్యాపియై, సర్వాంతర్యామియై, మహా వాక్యముల యంతమున వెలుగుచున్నదై, సంతత బ్రహ్మానంద దాయకమై వెలయుచున్న పరబ్రహ్మమును నిరంతర తైలధారవలె సవిచ్ఛిన్నమగు నిశ్చలధ్యానముతో హృదయమునందు సంస్మరించుచు, పరమశివుడు సనక సనందనాదులకును, జనకుడు శుక నార దాదులకును, విష్ణువు శివప్రహ్లాదాదులకును, బ్రహ్మభృగు పులస్త్యాదులకును, వసిష్ఠులు శ్రీ రామునకును ఉపదేశించిన మహామంత్రమును నిరంతరము జపించుచు, జ్ఞానమే మౌనమనియు, మౌనమే జ్ఞాన మనియు దెలిసికొని, సచ్చిదానంద సామ్రాజ్యము ననుగ్రహించు మహావాక్యము యొక్క ముఖ్యార్థమును విడువక మననము చేయుచున్న యెడల భవబంధ మెప్పుడును దలచూప"దని విశదముగా దెలిపి మాయా వరణమును తొలగించి మాన నిష్ఠాగరిష్ఠుడవై యుండుమని యాశీర్వదించి, గురు తుర్యమార్గమును బోధించెను. స్వదేశమునకు బోవుటకు సెలవిచ్చి, వారి నూరి బయలువరకు సాగ నంపి వెనుకకు మరలెను. తాను సంచార సమాధిని సాధించుటకై స్వేచ్ఛగా బోయెను.

విఠోబా తన భార్యయగు రుక్మాబాయి, మామయగు సిద్ధోపంతుతో గూడ పుణ్య క్షేత్రముల దర్శించుచు, పుణ్యతీర్థములు గ్రుంకులిడుచు, సత్పురుషుల సేవించుచు కొలది దినముల కలకావతి చేరెను. రుక్మాబాయి యాచార్యు డుపదేశించిన ప్రకారము మహా వాక్య తాత్పర్యమును రహస్యముగా నను సంధించుచు నానందాతి శయమున జొక్కుచు భర్తను సేవించుచుండెను.

# విఠోబా రుక్మాబాయిని దీసికొని యడవి కేగుట

సిద్ధోపంతు తన యల్లు డిల్లు చేరుటచే సంతోషమున నొక నాడు బ్రాహ్మణ సంతర్పణ చేయనెంచి, యాగ్రామములో నున్న వైదికులుకు భోజనమునకు జెప్పెను. విఠోబా సన్యాసమునుండి గృహస్థుడగుటు కతని యవివేకమును గూర్చి వా రనేక విధముల నిందించు వారు. అందువలన సిద్ధోపంతు భోజనమునకు జెప్పగానే వారెల్ల రొకచోట సభచేసి, యతనితో "అయ్యా! నీయల్లుడు సన్యాసము దీసికొనుట యందరికిని దెలిసిన విషయమేగదా? అత డిప్పుడా యాశ్రమమును వదలి మరల గృహస్థా శ్రమమునకు వచ్చుట శాస్త్ర విరుద్ధముగా నున్నది. అమృతస్నానము చేసిన పిదప మద్యపానము చేసినట్లును, వేదాంతశాస్త్రము నభ్యసించిన పిదప కొక్కోకశాస్త్రము నధిగమించినట్లును, బ్రాహ్మణత్వమును పొందిన పిదప చండాలత్వమును పొందినట్లును సర్వోత్కృష్టమగు సన్యాసమును వదలి మరల సాంసారికు డయినాడు. అతనితోగూడి మీరును బ్రాహ్మణ్యమునే ముంచి వేయ బ్రయత్నించినారు. ఈ యాచారము శ్రుతి, స్మృతి విరుద్ధ మైనది. కావున మే మిప్పుడు మీయింట భోజనము చేయుటకు వీలుపడదు. మీ యల్లుని కూతురును మీ యింటినుండి వెడలగొట్టి ప్రాయశ్చిత్తము చేసికొన్నచో మీ యింట భోజనము చేయుదుము. లేకున్న మిమ్ముగూడ కులమునుండి వెలివేయుదుము. అల్లుడును కూతురును గావలసియున్న నీ యిష్టము వచ్చినట్లు నడచుకొనవచ్చు"నని పలికిరి.

సిద్ధోపంతు యోచించి వారితో "అయ్యలారా! నా యల్లుడు విషయవాంఛల చేత గృహస్థాశ్రమమును స్వీకరించ లేదు. గురువాజ్ఞ మేరకు వర్తించినాడు గనుక నతని యందు దోషము లేదు. మీకు దెలియని ధర్మములు లేవు. కనుక దయయుంచి కొంత యోచింపు" డని ప్రార్థించెను, వైదికులు కోపావేశపరులై "బాగున్నది. భ్రష్టునితో జేర్చి మమ్మందురను భ్రష్టులను జేయ నున్నావు. ఇక నెప్పుడును మా యెదుట నీ ప్రస్తావము నెత్తకు" మని యతని ప్రార్థనమును నిరాకరించి, విఠోభాను వెలివేసినట్లుగా దేశదేశముల కాంక్ష పత్రికలను వ్రాసి, చివాలున లేచిపోయిరి.

విఠోభా యా విషయమును విని యెంత మాత్రము విచారపడక ప్రళయకాల వర్షమునకు చలించని పర్వతమువలె ధైర్యముతో సిద్ధోపంతును

జూచి "స్వామీ! నేనిచ్చటికివచ్చి రాక మునుపే యిట్టి సంకటములు పెక్కులు సంభవించుట కారంభించిన జీవితాంత మీ గ్రామమున నెట్లుండవలెనో యోచింపుము. ఒక్క నిమిషమయిన నిచ్చట నుండుటకు నాకిష్టము లేదు. దయచేసి నాకు సెలవిచ్చినచో నరణ్యమునకు వెళ్లి నివసింతును, నేను లేకున్న మీ కెట్టి యిబ్బందులు లేక నెమ్మదిగా నుండవచ్చు" నని యడిగెను. రుక్మాబాయి "నాయనా! మా వలన మీ కనేక కష్టములు గలుగును. మే మీ సమీపారణ్యమున వసించుచు నప్పుడప్పుడు వచ్చి మిమ్ము దర్శించి పోగలను. దయచేసి మమ్ము పంపు" డని ప్రార్థించెను. అందులకు సిద్ధోపంతు సమ్మతించెను. విఠోబా తన భార్యయగు రుక్మాబాయితో గూడ బయలు దేరి, కొంత దూరమునే నున్న యొక యడవి చేరి యందొక కొండ గుహలో వసించి, సర్వదా సమాధి నిష్ఠ యందు జొక్కి బ్రహ్మానందము ననుభవించు చుండెను. రుక్మాబాయి యలకావతికి వచ్చి తల్లిదండ్రులను దర్శించి తమకు గావలసిన భోజన పదార్థములను దీసికొని పోవుచుండెను.

## రుక్మాబాయి గర్భమున త్రిమూర్తులును పరాశక్తియు నుదయించుట

శ్రీపాదస్వామి కాశికి దిరిగి వచ్చి, తన శిష్యుడగు విఠోబాను దలచి, యతనికి నాదిశక్తి త్రిమూర్తులు బిడ్డలగునట్లు వరమిచ్చుట దలపోసి, వారు తనకు ప్రసన్నులగుటకై యేకాగ్ర చిత్తతతో నొక మూహూర్త మాత్రము ధ్యానము చేసెను. వారు ప్రసన్నులై యతని ముందు నిలిచి "పరమహంసోత్తమా! మా వలన నీకు గావలసిన పని యేమో తెలియజేయు" మనిరి. శ్రీపాదస్వామి కన్నులు విచ్చి, వారిని దర్శించి, భక్తితో నమస్కరించి, వారి ననేక విధముల స్తుతించి "జగద్రక్షకులారా! సర్వజ్ఞులగు మీకు దెలియని విషయము లేదు. ప్రమాదవశమున నొడలు మరచి నా శిష్యుడగు విఠోబాకు తమరు నలువురును బిడ్డలగునట్లుగా వరమిచ్చితిని. ఆ వరము నెట్లయిన సార్థకపరచి నన్ను కృతార్థుని జేయు" డని ప్రార్థించెను.

విష్ణుమూర్తి మందహాసము చేసి, "పరమహంస శిఖామణీ! ఈ సంల్పము నీ యత్నము వలన గలిగినది కాదు. లోకమున ధర్మము నిర్మూలమై జనాలు పాపకర్మాచరణము నందు ప్రోత్సాహము కలవారై దుర్మార్గ వర్తను లగుటచే వారిని చక్క పరచి సన్మార్గమునకు దెచ్చి ధర్మము నుద్ధరించుటకై

ముందే మేము నలువురము భూలోకమున నవతరింప నిశ్చయించి యుంటిమి. అందు వలన నీకిట్టి సంకల్పమును గలిగించితిమి. విభోబా యన్యుడు గాడు. సాక్షాద్వసిష్టాంశ సంభూతుడు. పూర్వము దశరథమహా రాజునకు లోకరక్షణార్థమై నేనును నాది శేషుడును శంఖచక్రములును కుమారులుగా నవతరించి నప్పు డొకనాడు దశరథు డంతఃపురమున తన భార్యలతో సల్లాప సుఖము ననుభవించుచు నుల్లాసముగా గూర్చుండి యుండెను. నేనతని తొడ మీద గూర్చుండి నానావిధములగు లీలలు గావించుచు నతని కానందము గలిగించు చుంటిని. భరత లక్ష్మణ శత్రుఘ్నులును తండ్రి తొడమీద గూర్చుండవలెనన్న యభిలాషచే పెనుగులాడుచుండిరి. అతడు పరమానంద భరితుడై యిరువురను తొడలమీదను ఇరువురును మూపుల మీదను గూర్చుండ బెట్టు కొనెను. నేనును లక్ష్మణుడును మూపులపై గూర్చుండ నెంచి భరత శత్రుఘ్నులను క్రిందికి లాగ జొచ్చితిమి. వారిరువురను తండ్రి కుత్తుకను గట్టిగా బట్టుకొని దిగకపోయిరి. మేమిరువురము లేచి ముందు వెనుకల నిలిచి యతని కంఠమును లాగ జొచ్చితిమి. కౌసల్య, కైక సుమిత్రలు సంతోషమును బట్ట లేక చప్పటలు గొట్టి నవ్వసాగిరి. దశరథుడు తనువు పులకరింప, కనుకొలకులనుండి ఆనంద బాష్పములు రాల, సంతోష సాగరమున దేలియాడు చుండెను. ఈ వినోదము నెల్ల జూచి వసిష్ఠ మహర్షి పరమానంద భరితుడై, పుత్ర భాగ్యము కంటె నత్యుత్తమ భాగ్యము లేదని యెంచి, నన్నును లక్ష్మణుని తన మూపులపై గూర్చుండ జేసికొని రాజునకు గలిగిన యాయాసమును కొంత నివర్తి చేసినట్లభినయించి, తన మనస్సులో నిక్కబారుచున్న పుత్ర కాంక్ష నొక్క విధముగా ననునయింప జొచ్చెనుగాని నా పాద స్పర్శ వలస నతని కోరిక బయలుపడి "రామా! నిన్ను బుత్రునిగా బడయ గలిగిన భాగ్యమెన్నడు సమకూడునో నాడు కదా నా జన్మము కృతార్థతగను" నని ఆనంద బాష్పములతో నా పదముల కభిషేకము చేసెను. నే నతనికి హరి హర బ్రహ్మ రూపములతో దర్శన మిచ్చితిని. అతడు "దేవా! నీవొక్కడవయ్యు మూడు రూపములతో నగపడుచున్నావు. పరమ పవిత్రుడగు నత్రిమునికి మీరు మువ్వురును పుత్రులై యతనిని స్తుతిపాత్రు నొనర్చినట్లు నా యందనగ్రహ ముంచి యీ రాజనుభవించుచున్న బ్రహ్మానందమును నాకును కొంత ప్రసాదించి కృతార్థుని జేయు" మని వినయముతో బలికి, నా చెక్కులు

ముద్దాడెను. అతనికి దివ్యజ్ఞాన ముదయించెను. అదివరకు తనలో మాటాడుకొన్న మాటల నెల్ల మరచిపోయి దశరథుని జూచి, "ప్రభూ! నీ భాగ్యమే భాగ్యము. నీవు మిక్కిలి పుణ్యవంతుడ" వని కొనియాడి, మమ్మిద్దరను రాజు తొడమీద కూర్చుండబెట్టి, యతని వద్ద సెలవంది తన యాశ్రమమునకు బోయెను, తన భార్యతో "ఓసీ! నాకెందులకో పుత్రవ్యామోహము గలిగినది. త్రిమూర్తులను పుత్రులనుగా బడయవలెనన్న కోరిక నన్ను విశేషముగా బాధించుచున్నది. నా మనస్థైర్యమును హరించి వేసిన" దని చెప్పి యాశ్చర్యపడ జొచ్చెను. అరుంధతీ దేవి సంతసించి, "స్వామీ! దేవసభయందు నారదు డనసూయా దేవి యొక్క మహత్యమును వర్ణించుట విన్నప్పటి నుండి త్రిమూర్తులను పుత్రులుగా బడయవలె ననియు, పార్వతీ దేవి హిమవంతునకు పుట్టి పరమ శివుని వివాహము చేసికొన్న వైభవమును జూచి నప్పటి నుండియు పరాశక్తిని పుత్రికగా బడయవలె ననియు మిక్కిలి కోరిక గిలిగియున్నది. నీతో విన్నవించుటకు భయపడి ఎన్ని దినము లూర కుంటి" నని పలికెను.

వారిట్లు సంభాషించు చుండగా దేవలోకమునుండి నారదుడచటికి వచ్చి, వారి కోరికకు మెచ్చి, " మీ సంకల్పమును నింకను పెక్కురు మునుల సంకల్పములును కలియుగమున ఫలించును. ఈ విషయమును బ్రహ్మ బ్రహ్మర్షులతో జెప్పుచుండగా వింటిని. మీకోరిక నెరవేరును. సంశయము లే"దని చెప్పెను. వసిష్ఠుడు నారదునకు తమగుట్టు దెలిసిన దనియు నతడు లోకమున చాటకుండుటకు దగిన సదుపాయమును వెదుకవ లెననియు నాలోచించి "స్వామీ! మే మాదిశక్తి, త్రిమూర్తులను బిడ్డలనుగా కనుటకై కలియుగమున నుదయించినప్పుడు మాకు తత్వోపదేశము చేయుటకు నీవాచార్యుడవై యవతరించునట్లును, అంతవరకీ రహస్యము నెక్కడను బయలు పరపకుండునట్లును వరమనుగ్రహింపు" మని ప్రార్థించెను. నారదు డనుగ్రహించితి ననెను.

"ఆ కారణముచే నీవిప్పుడు నారదాంశమున నవతరించితివి. అరుంధతీ వసిష్ఠుల యంశమున రుక్మాబాయియు చైతన్యస్వామియును బుట్టిరి. కావున నీ సంకల్ప ప్రకారమే మేము నలువురు మిప్పు డా దంపతులకు బిడ్డలుగా నవతరింప బోయెదము సంశయింప పని లే"దని సెలవిచ్చి యంతర్ధానమైరి. శ్రీ పాదస్వామి పరమానంద భరితుడై బ్రహ్మానుసంధానము

చేయుచుండెను.

విష్ణుమూర్తి పరమశివునితోను, చతుర్ముఖునితోను, పరాశక్తి తోను భూలోకమున ధర్మము నశించి ప్రజలజ్ఞానాంధ కూపమునబడి పాడగు చుండిరనియు, తాము రుక్మాబాయి, విఠోబాలకు బిడ్డలుగా నవతరించి జనులకు తత్వోపదేశ మొనర్చి ధర్మము నుద్ధరింపవలె ననియు దెలిపెను. వారు తమ యంశములను విఠోబా తేజమునందు ప్రవేశ పెట్టిరి. వెంటనే మన్మధుడు విఠోబా మనస్సును కలతపరచి, బ్రహ్మనిష్ఠ నుండి మరలించి రుక్మాబాయి యందు వ్యామోహమును గలిగించెను. క్రమముగా త్రిమూర్తులును పరాశక్తియు రుక్మాబాయి గర్భమునం దుదయించిరి. ఆ దంపతులు క్రమముగా నీశ్వరాంశమున నవతరించిన కుమారునకు నివృత్తి దేవుడనియు, విష్ణుమూర్తి యంశమున నవతరించిన కుమారునకు జ్ఞానదేవుడనియు, బ్రహ్మాంశమున నవతరించిన పిల్లవానికి సోపాన దేవుడనియు, పరాశక్తి యంశమున ఉదయించిన చిన్న దానికి ముక్తాబాయియనియు నామకరణములు చేసి, వారి ననురాగమున పెంచుచు, వారి ముద్దు మురిపములు చూచి మిక్కిలి సంతోషించుచుండిరి.

బ్రహ్మవిద్య నిరవద్యముగా నభ్యసించి, యఖండ బ్రహ్మానంద సాగరమున దేలియాడుచు నభేద ప్రతిపత్తియు స్థిరచిత్తతయు గలిగి సమాధియందు జొక్కి యున్న చైతన్యస్వామి సృష్టి స్థితి లయములకు కారణగర్తలైయున్న త్రిమూర్తులను, పరాశక్తిని బిడ్డలనుగా గని వారి యందుగల ప్రేమానుబంధముచే బ్రహ్మానందమునుగూడ మరచి యుండెను. పుత్ర వాత్సల్య మంతపని చేసినది. రుక్మాబాయి వారమున కొకపర్యాయము పురమునకు బోవుచు పుట్టినింటినుండి తమ భోజనమునకు గావలసిన వస్తువులనెల్ల దెచ్చుకొనుచు భర్తను పుత్రులను బోషించుచుండెను. ఆరు సంవత్సరము లిట్లు గడచెను. విఠోభా కుటుంబ మభివృద్ధి యగుకొలది సిద్ధోపంతు యొక్క యావదాస్తి తరిగిపోయి జీవనమున కిబ్బంది యయ్యెను.

ఒకనా డుదయమున నలువురు బిడ్డలును విచ్చలవిడిగా నాడు కొనుచుండిరి, రుక్మాబాయియు, చైతన్య స్వామియు వారి ముచ్చటలను జూచి యానందించుచుండిరి. రుక్మాబాయి భర్తతో తన తండ్రికి సంభవించిన దుర్దశను దెలిపి, తన కింక నచ్చటనుండ సరిపడదనియు పట్టణమునకు వెళ్ళినచో నేదైన కాయకష్టముచేసి జీవనము చేయ వచ్చుననియు దెలిపెను.

అతడు సంసార భారమువలన సమాధినిష్ఠ జెడినదని యెంచి "ఓసీ! నీవు నీబిడ్డలను దీసికొని పట్టణమునకు బోయి యచ్చట సుఖముగా నుండుము. నేను వచ్చినచో మన వారికి గొన్ని కష్టములు కలుగును. కావున నా కచ్చటికి వచ్చుట కిష్టము లే" దని చెప్పెను. రుక్మాబాయి "స్వామీ! ప్రత్యక్ష సుఖానుభవమును ప్రసాదించు భర్తను విడిచి పెట్టి వెళ్ళుట, ధర్మపత్నికి యుక్తము కాదు. ఒక్క నిమిషమయిన నిన్నెడబాసి యుండ లేను. ఈ బిడ్డలను దీసికొని వెళ్ళి నా తల్లిదండ్రుల వద్ద విడిచి వచ్చెదను. మనకు కొంత భారము తగ్గు"నని పలికెను. విఠోబా సంతసించి, యామె బిడ్డలను పట్టణమున విడిచివచ్చు లోపల నింకొక వనమునకు వెడలిపోవచ్చు ననియు నామె తిరిగివచ్చి చింతాక్రాంతయై పుత్ర వాత్సల్యము చేత మరల పుట్టినింటికి బోవుననియు నిశ్చయించి, "నీవు చెప్పిన విషయము యుక్తముగానున్నది. అట్లే విడిచిర"మ్మనెను. రుక్మాబాయి బిడ్డలను దీసికొని పట్టణమునకు వెళ్ళెను.

చైతన్యస్వామి సంసారము ననేక విధముల నిందించి, గురు దేవుని స్మరించి, యచటనుండి బయలు దేరి, మరియొక కారడవి చేరి, యొక నిగూఢస్థలమున గూర్చుండి, కన్నులు మూసికొని, యింద్రియములను జెదరకుండ నిలిపి, యంతర్నేత్రమును దెరిచి, ఆనంద మాత్రముగా నున్న పరబ్రహ్మమునందు గలిసి, సంకల్ప వికల్పముల నెల్ల నాశనము చేసి, మాయాంధకారము నణచి, మహదానందమున జొక్కి, నివాతదీపమువలె బ్రహ్మనిష్ఠయందు నిశ్చలత నొంది యుండెను.

రుక్మాబాయి పట్టణము జేరి తల్లిదండ్రులకు నమస్కరించి, భర్త జెప్పిన విషయమును వారికి దెలిపి, వారికి నచ్చజెప్పి, బిడ్డల నచట విడిచి వెళ్ళుటకు కాళ్ళురాక, విధిలేక వారి నచటవిడిచి, తిరిగి పోయి యడవి నడుమనున్న కొండగవి చేరెను. తన పెనిమిటి కనబడ లేదు. ఏదైనా కార్యార్థ మెచటికైన వెడలి యుండవచ్చునని యెంచి యతని రాకకు నిరీక్షించుచుండెను. సూర్యాస్తమయయ్యెను. చీకటి పడినప్పటినుండి తెల్లవారువర కాయడవిలో నచటు నచట దిరిగెను.కాని భర్త జాడ కనబడ లేదు. అతనినిగూర్చి చింతించి, దిక్కుదోచక గట్టిగా రోదనము చేయసాగెను. అంతలో సూర్యో దయమయ్యెను. రుక్మాబాయి యాకాశమువైపు జూచుచు "పరమేశ్వరా! దీనబంధూ! సన్నీ యాపదనుండి రక్షింప నీవు తప్ప సమర్థు లెవ్వరును లేరు. కరుణించి" రక్షింపుమని ప్రార్థించి, యరణ్యమునబడి పెనిమిటిని

వెదుకసాగెను.

సిద్ధోపంతు నింట బిడ్డలు తల్లిదండ్రులను దలచుచు, వెక్కి వెక్కి యేడ్చుచు, తల్లిబోయిన దారినే చూచుచు, నవ్వయు దాతయు నెంత బుజ్జగించినను సమ్మతింపక తమ తల్లికడకు బోవ లెనని చెప్పుచు, నొకరి వెంట నొకరు తల్లిబోయిన దారిని నడువసాగిరి. అవ్వయు యు దాతయు పరుగెత్తిపోయి వారినందరను దీసికొనివచ్చి, యనేకవిధముల లాలించి, బలవంతముగా నన్నము దినిపించి, నిద్ర ఇచ్చిరి. బిడ్డలు నిద్రయందును తల్లిదండ్రులను దలంచుకొని కలవ రించుచు నులికి పడుచుండిరి. సిద్ధోపంతును నతని భార్యయు వారి సంకటమును జూచి మిక్కిలి విచారపడజొచ్చిరి.

## విఠోభా బిడ్డలనుదలచి విచారపడుట

మహారణ్య మధ్యమున నేకాంతముగా గూర్చుండి బ్రహ్మాను సంధానము చేసికొనుచున్న విఠోబాకు చిత్తవైకల్యము కలిగి సమాధిని జెడగొట్టుటచే నతడు బహిర్ముఖమునకు దిరిగి మనస్సున ననేకముగా కలవరపడ జొచ్చెను. బిడ్డలపై జ్ఞప్తివచ్చి, కంటదడి పెట్టి, బిడ్డల ముచ్చటల నెల్ల దలచి విచారపడుచు "భగవంతుడా! నన్నెంతటి దురవస్థల పాలుజేసితివి? బిడ్డలు బిడ్డలని తలగొట్టుకొని గడ్డి దిను వారి కొక బిడ్డ నియ్యవుగాని వలదన్న వారికి మాత్రము బలవంతముగా ననేకుల నిచ్చెదవు. ఆహా! నీ కఠినత్వము నేమనవలె"? నని పశ్చా త్తాపపడి, తన బిడ్డలనుగూర్చి "హా! నివృత్తి దేవా! నీ చేయిసోకగనే చి త్తము నిశ్చలతనొంది బ్రహ్మానందమును బ్రసాదించుము గదా? హా! జ్ఞాన దేవా! నీపదము సోకినంత మాత్రమున నమోఘములగు మాయా భ్రమలెల్ల తొలగిపోయి దుఃఖములు నశించి యవాఙ్మానసగోచరమగు నానంద ముదయించి పరవశత నొందించునుగదా? హా! సోపాన దేవా! నీతనువు సోకగనే పరమరహస్యమగు తత్వమంతయు బయలుపడి యాత్మస్వరూపము కరతలామలక మగునుగదా? హా! ముక్తాబాయీ! నిన్ను తొడమీద గూర్చుండబెట్టుకొన్న నణిమాది సిద్ధు లెల్ల సులభముగా సిద్ధించుటయేగాక మనస్సు నిర్మల బ్రహ్మానందమున జొక్కుచుండునుగదా? అయ్యో! ఇట్టిబిడ్డలను పట్టణమున విడిచి పెట్టి రమ్మని యెందులకు జెప్పితిని. నాయంతటి పాపాత్ము డుండునా? వారిని జూడకున్న నా ప్రాణములు

నిలుచునా?" యని తలపోయుచు, భార్యయొక్క సుగుణసంపదను దలచి విచారపడుచు, తనవలన జరిగిన యకార్యమునకు తన్ను తాను దూషించుకొనుచు, నేమిచేయుటకును దోచక భక్తిప్రపత్తులతో పరబ్రహ్మమును దలచి-

"నాలుగు వేదములకును ఆరు శాస్త్రములకును, పదునెనిమిది పురాణములకును, నిరువది యెనిమిది యాగములకును గోచరముగాక తత్వ వేత్తల కెరుగదగియుండి లోకములకు సృష్టి స్థితి లయ కారణమై సకల జంతువుల హృదయములందు నివసించునదియు సర్వభూతముల కాశ్రయభూతమై నిరంతరము జీవకోటి చేత నాచరింపబడు పుణ్యపాప మిశ్రకర్మముల కెల్ల సాక్షియై వెలయుచున్న సత్పదార్థమునకు నమస్కరించుచున్నాను. మాయ కాశ్రయమై మాయయందు బ్రతి ఫలించిన వైరాజ హీరణ్యగర్భ అవ్యాకృతులకు నియంతయై జంగమ రూపమగు మనుష్య పశుపక్ష్యాదుల చేతను, ఇంద్రియముల చేతను స్థావర రూపమగు పర్వతవృక్ష గుల్మాదుల చేతను, విషయముల చేతను గలుగుచున్న ప్రపంచ రూపసంసారము నెల్ల భరించిన జీవునకును కూటస్థునకును విలక్షణమై సచ్చిదానంద నిత్యనిర్మలత్వములను పంచ లక్షణములు గలదై జ్ఞానా జ్ఞానముల కతీతమై వెలయుచున్న పరమాత్ముని స్మరించుచున్నాను. గాయత్రి మొదలగు మహామంత్రముల కాశ్రయమై సంకల వికల్ప రహితమై షడ్భావ వికార శూన్యమై గుణాతీతమై ద్వైతవృత్తియు, సాక్షి వృత్తియు నఖండాకారవృత్తియు లేనిదై వెలయుచున్న పరబ్రహ్మమును సేవించుచున్నాను. నిత్యమై నిర్మలమై జ్ఞానస్వరూపమై మాయాతీతమై శుద్ధ సత్వమై ప్రకాశించుచున్న పరమాత్మను ధ్యానించుచున్నాను.

"పరమేశ్వరా! నేను సంసారమను కీకారణ్యమధ్యమున జిక్కి త్రోవగానిక సంకటపడుచున్నాను. నన్ను రక్షింపగల పరమ దయాళుడవు నీవే. నీవు దాక్షిణ్యనిధివి; సదానందుడవు : సర్వార్థ ప్రదుడవు : నిర్వికల్పుడవు; నిర్గుణుడవు ; నిరామయుడవు ; నిశ్చలుడవు ; నిరంజనుడవు ; నిర్మలుడవు ; నిన్ను సేవించువారి కెట్టి యాపదలును రావు. నన్ను రక్షింపు"మని యనేక విధముల బ్రార్థించెను.

ఆకస్మికముగా నశరీరవాణి "విఠోబా! విచారపడకుము. కష్టములు తొలగిపోయి సుఖ మనుభవింపగల"వని చెప్పెను. విఠోబా తనువున బులకలు

మొలకలెత్త నానందాతిశయమున విస్మృతినొంది చిత్ర ప్రతిమవలె చేష్టలు దక్కియూరక కూర్చొనియుండెను. రుక్మాబాయి యతని వెదకుచు దైవయోగమున నచ్చటికి వచ్చి, పరమా నంద భరితయై "ప్రాణనాథా నన్నిట్లు మోసపుచ్చి రావచ్చునా?" యని యతని పాదముల మీదబడి యేడ్వసాగెను. విఠోబా యులికిపడి లేచి, భార్యనుజూచి, యామె యోగక్షేమములను విచారించి, బిడ్డల మంచి చెడ్డలనుగూర్చి విచారించెను. బిడ్డలకడకేగి వారిని విచారించు చుండుమనెను.కాని యామె యతనికి కందమూలాదుల దెచ్చి సమర్పించుచు తప్పించుకొని పోవునను భయముచే నతనిని గని పెట్టుకొని యుండెను. ఇట్లు మూడుదినములు గడచెను. నాల్గవదినమున విఠోబా "సతీమణీ! మనల జూడకుండుటవలన బిడ్డలు బాధపడుచుందురు. నీతల్లిదండ్రులు విచారించుచుందురు. నేను పూర్వమున్న పర్వత గుహకు వచ్చెదను. నీవు పోయి బిడ్డలనుజూచి యాదరించిరమ్ము. నే నచ్చటనే యుండెదను. మోసపుచ్చి వెళ్ళుదునని యెంతమాత్రము సంశయింపవల"దని యామెను సమాధానపరచి ప్రయాణము చేసెను. రుక్మాబాయి యచటినుండి బయలుదేరి యలకావతి చేరి తల్లిదండ్రులకు నమస్కరించి, యత్యంత ప్రీతితో బిడ్డలను ముద్దాడి, యడవి నుండి తెచ్చిన మధుర ఫలములను వారికిచ్చి, మంచిమాటలతో బుజ్జగించి, మరలిపోయి, భర్త కావిషయమును దెలిపి సంతసింప జేసెను. చైతన్యస్వామి అభ్యాసయోగము వృద్ధియగు కొలది పుత్ర వ్యామోహమును దగ్గించుచు బ్రహ్మానందము ననుభవించుచుండెను."

అని నాభాజిసిద్ధుడు చెప్పగా వృద్ధవసిష్ఠాది మునివరులు తరువాతి వృత్తాంతమును దెలుపుమని యడిగిరి. ముని శ్రేష్ఠలను గనుగొని నా భాజిసిద్ధుడు.

"సిద్ధులారా! శ్రద్ధగా వినుడు. అలకాపురమున సిద్ధోపంతునకు వార్ధక్యదశ యెక్కువయ్యెను. ఆస్తియంతయు వ్యయమయ్యెను, బిక్షాటనమున కారంభించి దొరికినదానితో సంతుష్టి నొంది కాలము గడఐజొచ్చెను. జ్ఞాన దేవు డొకనాడు తన తాత పడుచున్న కష్టములను జూచి యతనితో తానును భిక్షాటనమునకు బయలు దేరి, యాపురమున గలవారి ననేకుల నొక్కమాఱె మోక్షసామ్రాజ్యమున కర్హులునుగా చేయసాగెను. అసమాన సౌందర్య సౌకుమార్యములతో నలరుచున్న జ్ఞానదేవునియొక్క మొగమును జూచిన వారెల్ల జాలిపడుచుండిరి. అతని నెత్తుకొని చెక్కులు ముద్దాడుచుండిరి.

కావలసిన పదార్థముల నెల్ల దెచ్చియిచ్చుచుండిరి. సిద్ధోపంతు నూర నెక్కువగా దిరుగ వలసినపని లేక దొరకుచున్న సామగ్రులనెల్ల మూటలుగట్టి మోసి కొనిపోయి. యిల్లు చేర్చుచుండెను.

ఒకనాడు సిద్ధోపంతు సామగ్రి యెక్కువగుటచే మోయ లేక యొకవీధి యరుగుమీద గూర్చుండి విచారపడుచుండెను. జ్ఞానదేవుడు "తాతా! విచారించు టెందులకు? నేను సగము మోసికొని వత్తును మూటగట్టి యి"మ్మని బలవంత పెట్టెను. సగము సామగ్రి వేయించు కొని మూటగట్టి నెత్తిమీద నుంచుకొని మోయుచు నతని వెంట నడుచుచుండెను. కొంతదూరము పోగా కాలికి దెబ్బతగిలి క్రింద పడెను. మూట విడిపోయి పదార్థములెల్ల వీధి పొడుగునను జల్లి పోయెను. అతడు తన తాత చూచిన కోపించునని యెంచి క్రిందబడిన పదార్థములను తొందర తొందరగా ప్రోగు చేయుచుండెను. సిద్ధోపంతు కొంతదూరము బోయి, వెనుదిరిగి జూచి, పదార్థముల బ్రోగుచేయుచున్న మనుమని జూచి, కోపించి, "ఓరీ! చేతగాని పనికి ముందుకు వచ్చితివి. పదార్థములనెల్ల మట్టిపాలు చేసితి"వని గద్దించి, గట్టిగా, నెత్తిమీద నొక దెబ్బ గొట్టెను. జ్ఞానదేవునకు కోపమువచ్చి సిద్ధోపంతును చేతితోబట్టి వెనుకకు ద్రోసెను. వృద్ధుడగు సిద్ధోపంతు బాలుని త్రోపునకు నిలువ లేక మూటమీద వేసికొని వెల్లకిలబడి మెల్లగా లేచి "ఓరి దుర్మార్గుడా! కష్టపడి పెంచిన నన్నింతపని చేయుదువా?" యని యురిమి చూచుచు నా బాలుని సమీపించ బోయెను. బాలుడు పరుగెత్తసాగెను. సిద్ధోపంతు వాని వెంటబడి జుట్టుబట్టి నోటికి వచ్చినట్లు దిట్టుచు వంగదీసి వీపుమీద నాలుగైదు దెబ్బలు వేసెను. జ్ఞానదేవు డాదెబ్బలకు తాళలేక పెద్ద పెట్టున నేడ్వసాగెను.

ఆకాశమార్గమున విమానము లెక్కి పోవుచున్న దేవత లీ దృశ్యమును జూచి భగవానుని కపటనాటకమున కాశ్చర్యపడి "భక్తి వత్సలా! ఈ వృద్ధుని బాధనుండి తప్పించు కొనలేక చిక్కినది చూడగా నాశ్చర్యకరముగా నున్నది. ఈ వృద్ధుడు కాలయవనున కంటె సమర్థుడా? కువల యాపీడమునకంటె బలిష్ఠుడా? ఈ పదార్థ ముల మూట గోవర్ధనపర్వతమునకంటే బరువైనదా? నిన్ను నీవేమైన మరచియుంటివా? లేక లీలా వినోదములను జేయుచుంటివా? కాదు నీశ క్తి నీభ క్తుల విషయమై సాగదని తెలియుచున్నది ఆహా! నీవు కపట నాటక సూత్రధారి" యని యతని మహత్వమును కొనియాడిరి.

జ్ఞాన దేవుడు తాతకు భయపడి తన తప్పిదమును మన్నించుమని

దీనత్వముతో వేడసాగెను. ఆదారిని బోవుచున్న జను లచటికివచ్చి సిద్ధోపంతుతో "ఏమయ్యా! ముసలివాడవే! కొంచమయిన కనికరము లేక బాలు నిట్లు బాదుచున్నావే! ఎంత కఠినుడవు! ఇక చాలింపు" మని పలికి జ్ఞాన దేవుని విడిపించిరి. సిద్ధోపంతు క్రిందబడిన సామగ్రినెల్ల బ్రోగుచేసి మూటగట్టి యొక కూలివానితో మోపించుకోని యింట దించెను. జ్ఞానదేవుని తప్పిదమును తాను శిక్షించిన విధమును భార్యతో జెప్పి, పశ్చాత్తప్తుడై, వంటయైన వెంటనే స్నాన సంధ్యాదు లొనర్చి, బిడ్డల సందరను తనపక్క గూర్చుండ బెట్టుకొని భోజనము చేసెను.

## జ్ఞానదేవుడు బ్రాహ్మణుల గర్వము నణచుట

ఒకనా డాపట్టణమున నొక ధనికుడు బ్రాహ్మణ సంతర్పణము చేయించెను. సిద్ధోపంతు నలువురు బిడ్డలతో గూడ నచటికి బోయేను. బ్రాహ్మణులు వారినిజూచి కోపావేశపరులై సిద్ధోపంతుతో "ఏమయ్యా! నీకు తెలివియున్నదా? లేదా? కులభ్రష్టునకు బుట్టిన బిడ్డలను వెంట బెట్టుకొనివచ్చి బ్రాహ్మణపంక్తిలో గూరుచున్నావు. వీరిని బంపి వేయుము. లేకున్న నిన్నేమిచేయుదుమో చూడు"మని బెదరించిరి. చిన్నపిల్లలను బలవంతముగా చేతులు పట్టి లాగి బయటికి దోలివేసి, తక్కిన బ్రాహ్మణులను విస్తళ్ళముందు గూర్చుండ బెట్టి, పదార్థములను వడ్డించిరి. వా రాపోశనము దీసికొనబోవు సమయమున నివృత్తి దేవుడు వలదని వారించుచున్నను వినక జ్ఞానదేవుడు మెల్లగా లోనికివచ్చి పంక్తిమధ్య నొక విస్తరిముందు గూర్చుండెను. బ్రాహ్మణులెల్ల సంసర్గదోషము సంభవించినదని యాపోశనములను క్రింద వదలివేసి లేచిరి. కొందరు జ్ఞానదేవుని కొట్టి, తిట్టుచుండిరి. సిద్ధోపంతు ముందుకువచ్చి "అయ్యలారా! కోపింప నేల? మంచి చెడ్డలెరుగని పసిపిల్లవాడు లోనికి వచ్చినంతనే దోషము కలుగునా?

తొందరపడి పసిపిల్లవానిని కొట్టి తిట్టుటవలన ప్రయోజనమేమి? అన్యాయముగా ప్రవర్తించినచో తప్పక హాని సంభవించు" నని చెప్పెను.

బ్రాహ్మణు లందులకు మండిపడి, "ఓహో! పోనిమ్మని నీ విషయమై యుపేక్ష చేసినందువలన నింతవరుగు వచ్చినది. కుల భ్రష్టునకు బుట్టిన పిల్లల నింటనుంచుకొని వారితో కలిసిమెలసి యున్నందున నిన్ను జాతిలోనుండి వెలివేసితిమి. ఇచటినుండి వెడలి పొ"మ్మని పలుకుచు మెడబట్టి యతనిని

బయటికి నెట్టసాగిరి. సిద్ధోపంతు కోపించి తన చేతనున్న పంచపాత్రను వారిమీద విసరివేసెను. విప్రులు యమకింకరులవలె సిద్ధోపంతును కొట్టి నేల బడద్రోసిరి, జ్ఞానదేవుడు కోపావేశపరుడై బ్రాహ్మణులతో "దుర్మార్గులారా! బ్రహ్మజ్ఞానము కలవారుగదా బ్రాహ్మణులు? మీవంటి భ్రష్టులు బ్రాహ్మణు లెట్లగుదురు? మీయందు కిరాత ధర్మము లున్నవేకాని బ్రాహ్మణధర్మ మొక్క టైనను లేదు. 'అహింసయే పరమధర్మ' మను వచనము నెంతమాత్రమును పాటింపని పాపాత్ములకు బ్రాహ్మణత్వ మెట్లుదక్కును? పెద్దవాడన్న కనికరముగూడ లేక జంతువును కొట్టినట్లు కొట్టితిరి. మీకు దగినశాస్తి చేయుదు"నని పలికి, యొక దుడ్డుకఱ్ఱ దీసికొని యెవ్వరిని దగ్గర జేరనీక బిసబిస విసరసాగెను. బ్రాహ్మణులు విజృంభించి, యట్టహాసము చేయుచు, కఱ్ఱలుదీసికొని జ్ఞానదేవుని జుట్టి కొట్టుటకు యత్నించిరి. నివృత్తి దేవుడు వెంటనే వచ్చి "అయ్యలారా! శాంతించి, యక్రమమును మాని న్యాయమును విచారింపు"డనెను. విప్రులు కోపావేశపరులై "యధాబీజం తధాం కుర" మన్న లోకి క్తి తప్పునా? పిల్లవాండ్రని వీరి నుపేక్ష చేసినచో మన కులమున కెల్ల ముప్పుదెత్తురు. కావున ముందు వెనుక చూడక వీరిపని పూర్తిచేయవలయును. లేనిచో మనబ్రాహ్మణ్యము మునిగి పోవు"నని నిశ్చయించి, నివృత్తి దేవునిమీదను జ్ఞానదేవునినిూదను బడి కొట్టబోయిరి. జ్ఞానదేవుడు కండ్లెఱ్ఱజేసి, రక్కసులమూకలో జొచ్చిన యాంజనేయునివలె బ్రాహ్మణసంఘములో జొచ్చి చేత నున్న కఱ్ఱతో వారినెల్ల నెముకలు విరుగబాదెను. ఆ దెబ్బలకు బాపలమూక తలలు, మొలలు, ముక్కులు చెక్కులు, పక్కలు, పిక్కలు, ఱొమ్ములు, కాళ్లు, చేతులు, మూతులు పగిలి యతనియెదుట నిలువ లేక చీకాకు పడి పారజొచ్చెను. కొందరు శరణాగతులై రక్షింపుమని ప్రార్థించిరి. కొందరు పరుగెత్తిపోయిరి. కొందరు క్రింద బడి విల విల దన్ను కొనుచుండిరి. కొందరు మాటున తల దాచుకొను చుండిరి, కొందరు పశ్చాత్తాపపడుచుండిరి. అత డిట్లు కొలది నిమిషములలో పొగరుబోతు బావల యొక్క పొగ రణచివేసి సింహము పిల్లవలె నటు నిటు దిరుగసాగెను.

నివృత్తి దేవుడువచ్చి జ్ఞానదేవుని చేయిబట్టుకొని "సర్వజ్ఞ మూర్తి! మన మిప్పు డీలోకములో నీవిధముగా నవతరించుటకు కారణమేమి? ఇప్పుడు నీవు చేసిన పనియేమి? ఇది యధర్మముల కెల్ల బుట్టినిల్లయిన కలియుగముగాదా?

ఈ యుగమునందు ధర్మము తల చూప వెరచునని యెరుగవా? పైకి వేషము వేసికొని బ్రాహ్మణులమని పేరు పెట్టుకొని లోకమును భ్రమింపజేయు వంచకులే తరచుగా నంతటను నిండియున్నారు. నిజమైన బ్రహ్మవేత్తలు లేరు. కావున మన మీ వేషధారులకు దగినట్లుగా నాషాఢభూతి వేషము వేసికొని మెలకువగా కార్యమును నెరువేర్చవలయును. మన మహత్వమును బయలుపరచుట కిది సమయము కాదు. ఇంకను కొంత కాలము నిరీక్షింపవలెను. లేకున్న కార్యము చెడిపోవును. చెడిన తరువాత జక్క పరచుట మిక్కిలి కష్టము. లోకతంత్రమునంతయు జరుపుటయం దఖండ పాండిత్యముగల మహాత్ముడవగు నీకు నేను జెప్ప గలిగినంతటి సమర్థుడనా"యని పలికి, కోపము నుపశమింపజేసి, యెల్ల వారిని దీసికోని యిల్లుచే రెను.

విప్రులెల్ల మూకలుగట్టి తమ్ము బాధించిన దుష్టులకు దగిన శాస్తి చేయింపనెంచి, యా పట్టణపు రాజు సముఖమున కేగి, తమకు గలిగిన విపత్తును విన్నవించుకొని, సిద్ధోపంతును నతని మనుమలను శిక్షించి సకుటుంబముగా నతనిని దేశమునుండి బహిష్కరించి తమ్ము రక్షించుమని ప్రార్థించిరి. రాజు వారి దేహములనుండి కారుచున్న రక్తమును జూచి, కోపించి, బ్రాహ్మణులను హింసించిన దుర్మార్గులను శిక్షించుట కర్తవ్యమని యెంచి, సిద్ధోపంతును మనుమలతో గూడ బట్టి తెచ్చుటకై రాజభటుల కుత్తరువు లిచ్చి పంపెను. వారు సిద్ధోపంతు గృహమును ముట్టడించి, రాజాజ్ఞ తెలియజేసి, లేచి రావలసినదని తొందర పెట్టిరి.

జ్ఞాన దేవుడు బయటికివచ్చి భటులనుజూచి, తమ తాత, బ్రాహ్మణులు కొట్టిన దెబ్బలచేత నడువ శక్తి లేక పడక పెట్టియున్నాడు గనుక నంతదూరము నడచి రాలేడనియు, నిప్పుడు వారిని విడిచి తక్కిన వారు వచ్చుటకు వీలు లేదనియు, నందరికి మారుగా తా నొక్కడనే వచ్చెదననియు జెప్పి, వారితో బయలు దేరుటకు సిద్దపడెను. రాజ భటులు లోనికి వెళ్ళి సిద్ధోపంతు స్థితినిజూచి చేయునది లేక జ్ఞానదేవుని మాత్రము తీసికొని వెళ్ళి రాజసముఖమున నొప్పగించిరి.

జ్ఞానదేవుడు నిండుకొలువున్న రాజునుజూచి, యెంతమాత్రము జంకక యతనిముందు నిలుచుండి, గంభీరముగా "సముఖమునకు బిలిపించిన కారణ మే"మని యడిగెను. రాజతని నిర్లక్ష్యమునకు కోపించి, తగినశాస్తి

జేయింపనెంచి, “నీవును నీసోదరులును గూడి యక్రమముగా నీ బ్రాహ్మణుల మీదబడి బాధ పెట్టిన విషయమును విచారించి శిక్షించుటకే పిలిపించితి” ననెను. జ్ఞానదేవుడు “రాజా! నీ విషయమును నెమ్మదిగా చి చిత్తగించవలెను. మావలన నేదేని నేరమున్న మమ్ము శిక్షింపవచ్చును. వీరివలన నేరమున్న వీరిని శిక్షింప వచ్చును. మేము సంతర్పణమునకు వెళ్ళగానే వీరు మమ్ము జూచి నిష్కారణముగా పంక్తిలో గూర్చుండ బెట్టమని దుర్వివాదమున కొడిగట్టి, నిరపరాధియు, వృద్ధుడునగు మా తాతను ప్రాణము పోవునట్లుగా గొట్టి, న్యాయము చెప్పనచ్చిన మాయన్నను నిష్కారుణముగా దిట్టి. మమ్మందరిని పూర్ణాహుతి వేయ దలపెట్టిరి. విషయమును విచారించి తెలిసికొనక మునుపే శిక్షింపనెంచు కోపస్వభావముగల నీ సముఖమున వాస్తవస్థితిని తెలియ జేయుటకు శంకింపవలసియున్నది. రాజులకు నీతియు, మంత్రులకు యోచనయు, గురువులకు జ్ఞానమును, సతులకు మాసమును ముఖ్యమైనవి. కోప స్వభావముగల రాజును కొండెములు చెప్పెడి విప్రుడును తప్పక నరక మనుభవింతురు. వాది ప్రతివాదులు వాజ్మూలమును విచారించి నిశ్చయించి నిశ్చయస్థితి తెలిసికొనక మునుపే చెప్పుడు మాటలు విని కోపపడుట రాజులకు యుక్తముకాదు. కోపమువలన సత్యా సత్యముల నెరుగగలిగిన వివేకము నశించును. వివేకము లేకున్న న్యాయము చెడును. న్యాయము చెడిన ప్రజలకు ప్రభువుపై ద్వేషము కలుగును. ద్వేషము వలన దేశక్షోభ కలుగును. దేశక్షోభ గలిగిన ప్రతిపక్షులు దేశము

నాక్రమింతురు. కావున రాజు లెప్పుడును న్యాయవిచారణమునందు శాంతము వహింపవలె”నని పలికి యతని మనస్సును నిమిషమాత్రమున కరగించెను.

రాజు జ్ఞాన దేవుని వాక్సుధారసమును కర్ణాంజలుల గ్రోలి కోప ముపశమించి ప్రసన్న వదనుడై బ్రాహ్మణులవైపు దిరిగి “అయ్యలారా! వీరిని మీపంక్తిలో నుంచుకొనక త్రోసిపుచ్చుటకు కారణమే”మని యడిగెను. కొందరు బ్రాహ్మణులు లేచి “ప్రభూ ! మా మనవి చిత్తగించవలెను. ఈ పిల్ల వాండ్ర తండ్రి విఠోభా యను నతడు సిద్ధోపంతుయొక్క కుమార్తెను వివాహము చేసికొని కొంత కాలమునకు సంసారమును రోసి భార్యను విడిచి కాశీకిబోయి యచ్చట నొక పరమహంస నాశ్రయించి సన్యాసము దీసికొని యభక్ష్య భక్షణముజేసి జాతి భ్రష్టుడైనది గాక యింద్రియ వికారములకు లోనై

సన్యాసమును విసర్జించి మరల సంసారమున బ్రవేశించి యాశ్రమ భ్రష్టతనుగూడ పొంది కొన్ని దినముల క్రిందట నిచ్చటికి వచ్చినాడు. మేము వాని సంగతులనెల్ల విచారించి, ధర్మశాస్త్రముల నెల్ల బరిశీలించి, యతని దోషమునకు ప్రాయశ్చిత్తము లేనందున నతనిని జాతి నుండి వెలివేసితిమి. అంత నతడు మనపట్టణమును వదలి తనభార్యతో గూడ సమీపారణ్యమునకు వెళ్లి వాసము చేయుచుండగా నచ్చట నతని కీపిల్ల వాండ్రు పుట్టిరి. కావున వీరిని మా పంక్తిలో గూర్చుండ బెట్టుకొని భోజనము చేయుటకు వీలు లేక పోయినది. వీరి తండ్రికే ప్రాయశ్చిత్తము విధింప బడనప్పుడు వీరి కెక్కడనుండి కలుగబోవును! అందువలన వీరిని మేము త్రోసివేసితిమి. ఈ విషయమున సంశయము కలిగినచో నాస్థానపండితులను విచారించిన వీరు దోషులైనదియు, నిర్దోషులైనదియు వారే వివరముగా దెలియచెప్ప గల"రని పలికిరి.

జ్ఞానదేవు డందులకు "మహాప్రభూ! బ్రహ్మజ్ఞానసంపన్నుడే బ్రాహ్మణుడనియు నితరులగు, బాహ్య వేషధారులెల్ల బ్రాహ్మణులు కారనియు వేదము విధించుచున్నది. అట్టి వేదవచనము ననుసరించి మాతండ్రి పరమహంస నాశ్రయించి, బ్రహ్మజ్ఞానమును సంపాదించి, యాచార్యుని యాజ్ఞానుసారము మరల గృహస్థాశ్రమము నవలంబించిన విషయమున నతనికి వర్ణాశ్రమ భ్రష్టతగలిగిన దనుట విశ్వసించు టెట్లో విచారింపవచ్చు"ననెను. అందులకు విప్రులు సన్యాసమును పరిత్యజించి సంసారవృత్తి నవలంబించుట గొప్ప దోషమనియు దీనికి ప్రాయశ్చిత్తమే లేదనియు శాస్త్రములందు విధింపబడియున్నది. అట్టి విధికి వ్యతిరేకముగా నడచినవాడు నిర్దోషి కానేరడు గనుకను, సన్యాసికి విధినిషేధములు లేకపోవుటచే చిక్కిన చోట స్వేచ్ఛగా నలక్ష్య భక్షణము చేయవచ్చును. గనుకను కర్మిష్ఠులగు బ్రాహ్మణ శ్రేష్ఠుల పంక్తి కతడు యోగ్యుడు కాకపోయినా"డని పలికిరి.

జ్ఞాన దేవుడు "పరమహంస యభక్ష్య భక్షణము చేసినను బ్రాహ్మణులు పంక్తిలో గూర్చుండబెట్టుకొని భుజింపవచ్చుననియు, నట్లు భుజించుట వలన నందరును పవిత్రులగుదురనియు శాస్త్రములు విధించుచుండగా నియమము దప్పక యాశ్రమధర్మము ననుష్ఠించిన మాతండ్రి యెట్లు ధర్మభ్రష్టు డయ్యెనో తెలియకున్నది. పూర్వము గొప్పవా రనేకులు చాలకాల మరణ్యములందు

వసించియు దేశాటన మొనర్చియు సన్యాసమును స్వీకరించియు మరల సంసారధర్మము నవలంబించి లోకమున గౌరవింపబడ లేదా? పరమహంసయై పరమోత్కృష్టతను వహించిన ఋష్యశృంగుడొక రాజుకూతురును వివాహ మాడ లేదా? సన్యాసము దీసికొని చాలకాల మరణ్యములో దప మాచరించిన యగస్త్యుడు లోపాముద్రను పెండ్లాడ లేదా? అంతటి గొప్పవారట్లు నడచియుండగా మా తండ్రి యందలి దోషమేమి? బ్రహ్మవేత్తలకు జాతిభేదములు కలవని యే శాస్త్రములందు విధింపబడినది? అట్లు విధింపబడి యున్నచో చండాల స్త్రీని వివాహమాడిన వసిష్ఠుడును, బోయకాంతను వివాహమాడిన వాల్మీకియు, పల్లెవాని కడుపున బుట్టిన వ్యాసుడును, చండాలునకు శిష్యుడై యతని యుచ్ఛిష్టమును స్వీకరించిన నారదుడును వర్ణ భ్రష్టులై యుండవలసిన వారే కదా? వారి కెవ్వరికిని సంభవింపని దోషము మా తండ్రికెట్లు సంభ వించినది? మా తండ్రి యభక్ష్య భక్షణము చేయగా జూచినవారెవ్వరు? వ్యర్థమైన యపవాదమును మోపి పరమసాధువున కన్యాయము చేయ తల పెట్టిన దైవమోర్చునా?

మహారాజా! మా తండ్రి బ్రహ్మజ్ఞానము సంపాదించుట కై కాశికిబోయి, యచట కొన్ని దినము లుండి, తగిన యాచార్యుని వెదకుచు, బ్రాహ్మణోత్తముడగు శ్రీ పాదస్వామియను పరమహంస నాశ్రయించి, యతనివద్ద తత్వోపదేశము పొంది, సర్వసంగ పరిత్యాగము జేసికొని, సన్యాసము స్వీకరించి, సచ్చిదానంద వస్తువునందు గలిసి సదానందము సనుభవించుచు, గురుని యాజ్ఞ సతిక్రమింపలేక మరల గృహస్థాశ్రమమున ప్రవేశించినాడు.కాని విషయవాంఛ చేత నెంతమాత్రమును సన్యాసమును విసర్జించి సంసారి కాలేదు. ఈ విషయము లెల్ల తెలియక వీరు మా తండ్రిమీద నిర్నిమిత్తముగా దోషారోపణము చేయుచున్నారు. గుణమొక్కటే ప్రధాన మనియు, కులము ప్రధానము కాదనియు వేదాంత శాస్త్రములందు జెప్పబడిన వచనములకు పరాశర, వ్యాస, వసిష్ఠాది మహర్షుల చరిత్రములే ప్రత్యక్ష నిదర్శనములు. ఇక నీ చిత్తమునకు యుక్తముగా దోచినట్లు చేయవచ్చు”నని చెప్పెను.

రాజు సప్రమాణముగాను సయుక్తికముగాను దెలిపిన జ్ఞానదేవు మాటలను విని, సంతసించి, యతనికి సవినయముగా నమస్కరించి, కౌగిలించి, యతని నుచితాసనమున గూర్చుండబెట్టి “స్వామీ! నీవు దైవాంశ

సంభూతుడవు.కాని యెడల నయిదేండ్ల వయస్సులో నింతటి తెలివి తేట లుండవు. ఇక పెద్దవాడవైనచో నీతో ప్రతిభు టించి మాటాడు నంతటి ధీరు లీలోకమున నుండరు. తోటి బ్రాహ్మణులైనను నీ కాలి గోటికి సాటి కారు. నేడు నా భాగ్యవశమున నీ దర్శనము లభించినది. అజ్ఞానవశమున వీరి మాటలు విని నీ కవజ్ఞ చేసితిని. నాయందు పరిపూర్ణ కటాక్షముంచి నా నేరమును క్షమింపు" మని ప్రార్థించెను. కొందరు భటులను బిలిచి, పసిడి పల్లకీలను మూటిని దీసికొని వెళ్లి, జ్ఞాన దేవుని మువ్వురు సోదరులను వానిలో కూర్చుండ బెట్టుకొని తీసికొని రావలసినదని యుత్తరువు చేసి పంపెను. రాజు భటులు పోయి నివృత్తి దేవుని, సోపాన దేవుని, ముక్తాబాయిని పసిడి పల్లకీల మీద గూరుండ బెట్టుకొని సగౌరముగా రాజసభకు దీసి కొనివచ్చిరి. రాజు లేచి నమస్కరించి వారి నుచితాసనములపై కూర్చుండ బెట్టి వారుపన్యసించిన నీతి విషయములను విని పరమానందము నొంది "ఇట్టి మహానుభావు లీదేశమున వసించుట నా భాగ్యము. మీ సందర్శనమువలన నాజన్మము పవిత్రమైన"దని వారిని కొనియాడి, వారికి ధన కనక వస్తువాహనాదుల నిచ్చి, బ్రాహ్మణులను జూచి "అయ్యలారా! మీరు నాయందు దయయుంచి నిర్దోషులగు నీసత్పురుషులను మీలో జేర్చుకొని ద్వేషమును వదలి పెట్టి నన్ను కృతార్థునిగా జేయవలయు"నని వేడి, వారికి కొన్ని వరహాలిచ్చి వారిని సత్కరించి పంపెను.

నివృత్తి దేవుడు మొదలగువారు బంగారు పల్లకీలమీద మరల నిల్లుచేరి, తమకొర కెదురు తెన్నులు జూచుచున్న సిద్ధోపంతునకు నమస్కరించి, జరిగిన విషయమును వివరముగా దెలిపిరి. సిద్ధోపంతు వారి ధైర్యస్థైర్యములకు మెచ్చి వారి నాశీర్వదించి వారి వైభవమును జూచి సంతోషింపసాగెను.

మరునాడు బ్రాహ్మణు లందరు రాజు సముఖమునకుబోయి, పైఠణపురిలో తమ ప్రధానాచార్యు డున్నాడనియు, ఆయన సముఖమునకు విఠోబాను సకుటుంబముగా బంపి ప్రాయశ్చిత్తము చేయించుకొని యతనివద్దనుండి సమాధాన శ్రీ ముఖమును దీసికొని వచ్చునట్లు చేయవలెననియు, నట్లు చేసినచో నిరాటంకముగా నతడు కులములో జేరవచ్చుననియు దెలిపిరి.

రాజు సిద్ధోపంతును బిలిపించి, బ్రాహ్మణులు జెప్పిన సంగతిని వినిపించి, విఠోబాను నతని భార్యను దీసికొని రావలసినదని చెప్పి, రెండు పల్లకీలనిచ్చి - కొందరు భటుల నతనివెంట బంపెను. సిద్ధోపంతు తన

మనుములను, మనుమరాలిని వెంటబెట్టుకొని బయలుదేరి యడవి కేగి కొండగవిలోనున్న విఠోబాను గనుగొని, తన మనుములు విజృంభించి బ్రాహ్మణుల గర్వభంగము చేసి గౌరవము పొంది యఖండ సంపదను పొందిన విషయమునెల్ల వివరించెను. "మహారాజు నిన్ను జూడదలచి పిలుచుకొని రమ్మనెను. గనుక దయచేసి నా వెంట రావలె" నని చెప్పెను. విఠోబా నవ్వి, "వసమున వసించువారికి పట్టణమున వసించుట కిష్టముండదు. కావున నన్ను నిర్బంధపరచుటవలన ప్రయోజనము లేదు. నామాట విని యెట్టి విచారమును మనస్సున నుంచక పిల్లవాండ్రతో గూడ పురమునకు బోయి, దైవాను గ్రహము వలన గలిగిన భాగ్యము ననుభవించుచు సుఖముగా నుండు"మని చెప్పి, కుమారులను గూడ జూడక మౌననిష్ఠ వహించి బ్రహ్మానందమున జొక్కియుండెను. సిద్ధోపంతు యేమియు దోచక విచారించుచుండెను. జ్ఞానదేవు డతనితో "తాతా! ఈ విషయమై విచారింపవలదు. నీవు భటులను దీసికొని మెల్లగా పట్టణమునకు వెళ్ళుము. నేను నాలుగు దినములలో మా తండ్రిని సమాధానపరచి రాజ సముఖమునకు బిలుచుకొని వత్తు"నని పలికి యతనిని సమ్మతింపజేసి పంపెను. సిద్ధోపంతు రాజుకడ కేగి "చైతన్య స్వామి నాలుగుదినములలో వచ్చు"నని చెప్పెను.

## జ్ఞానదేవ విఠోబాల సంవాదము

జ్ఞానదేవుడు తన తండ్రితో కొన్ని విషయములు చర్చింపదలచి, బ్రహ్మానందమున జొక్కి తన్మయుడైన విఠోబా యొక్క తొడ యెక్కి కూర్చుండెను. జ్ఞానదేవుని శరీరము సోకగనే నిర్వికల్ప సమాధి వికల్పమై తెలివిరాగా, చైతన్యస్వామి మౌనము చాలించి, కన్నులు విచ్చి, ప్రియకుమారుని జూచి, కౌగిలించుకొని, ముద్దాడి, నివృత్తి దేవుని, సోపాన దేవుని, ముక్తాబాయిని గూడ దగ్గరకు జేరదీసి, వారి తనువులు చేతితో దడవుచు పరమానందభరితుడై "నాయనలారా! హాయిగా తాతతో గూడ వెళ్ళి పట్టణమున నుండుట మాని యీ కీకారణ్యమధ్యమున నేల నిలిచితిరి? పట్టణమునకు వెళ్ళి రాజు మనస్సును సంతోష పెట్టుచు నెమ్మదిగా నుండు"డని చెప్పెను.

జ్ఞానదేవుడు "నాయనా! మన మందరము నొకచోట వాసము జేయవలెనన్న కాంక్ష యెక్కువగా నున్నది. దయచేసి మా కోరిక నెరవేర్చుము.

మేము పట్టణమున సుఖముగా నుండుటయు నీవరణ్యమున కష్టపడుచుండుటయు యుక్తముగా లేదు. కన్న తలిదండ్రులు కష్టపడుచుండగా కొడుకు లెట్లు నిర్విచారముగా సుఖపడగలుగుదురు? నీవు మా పట్టణమునకు రాక తప్పదు. మీరు వచ్చువరకు మేము కదల"మని చెప్పెను. నివృత్తి దేవుడును, సోపాన దేవుడును, ముక్తాబాయియు నదేవిధముగా బలికిరి. బయలు దేరవలెనని తొందర పెట్టిరి. చైతన్యస్వామి! నాయనలారా! నన్ను తొందర పెట్టనేల? పట్టణమును విడిచి యరణ్యమునకు వచ్చిన పిదప కష్టమో సుఖమో పడి తీరవలయునేకాని మరల పట్టణమునకు వచ్చుట యుక్తము కాదు. వివేకము లేని నరపశువులతో గలిసి పురమున బెక్కు సంకటము లనుభవించుటకంటె నోరు లేని జంతువులతోగూడి వనమున నిశ్చింతగా కాలము వెళ్ళబుచ్చుట మేలు సర్వ ప్రపంచమునకు గర్తయగు పరమేశ్వరుని సేవించుట మాని యొక యల్పుడగు రాజును సేవించుట వలన ప్రయోజనమేమి? నాకు పట్టణమునకు వచ్చుట కిష్టము లే"దనెను.

జ్ఞాన దేవుడు:- మంచిది. అరణ్యములోనే వసింపవలెననియు పట్టణములో వసింప గూడదనియు జ్ఞాని కేమైన విధియున్నదా?

విఠోబా :- అట్లని విధి లేదుగాని పట్టణమునకు వచ్చినచో నిష్ఠ కనేక విఘ్నములు సంభవించును. మౌన నిష్ఠ కెల్ల నిజన స్థలమే వాసయోగ్యము,

జ్ఞాన :- ఇక పట్టణ మిది యడవియనెడి భేద భావము కలిగినప్పుడే బ్రహ్మ జ్ఞానమునకు ప్రతిబంధము కలుగును. భేదభావముగల బ్రహ్మనిష్ఠ నిష్ప్రయోజనము. అభేద ప్రతిపత్తి విషయమై భేద ప్రతిపత్తి యుక్థమేమో యోచింపుము.

విఠోబా:- నావి యన్న పదార్థము లున్నంతవరకు నహంకారమును, నది యిది యను ద్వైతభావమును నాశము కావు. ఇట్టి భేద భావముల నెల్ల మూలమట్టుగ తొలగించుటే నిర్వికల్ప సమాధి యనబడును. ఇది కేవలము నిస్సంకల్ప నిస్సంగముల వలన గలుగవలసినదేకాని యితరముల చేత గలుగదు. కావున నిస్సంగమున కునికి పట్టయిన వనములో బ్రవేసించితిని.

జ్ఞాన :- తన్ను తాను తెలిసికొని తన్మయముగా నుండుటే బ్రహ్మ నిష్ఠగాని యరణ్యములో వసించుట కాదు.

విఠోబా:- సద్గురునివలన నాత్మతత్వమును సమర్థకముగా దెలిసి కొన్నను తన్మయముగా నుండి దాని ననుభవించుట కే కాంతస్థలము ముఖ్యముగా కావలసియుండును.

జ్ఞాన :- ఏకాంతస్థల మొక్కటి కావలెననెడి యభిప్రాయము చేత నొంటరిగా నరణ్యములో వసించి తప మాచరించుచో నజ్ఞానము నివర్తింపదనియు, నహంకార మమకారము లుడుగవనియు నిశ్చయించి, సుజ్ఞాను లనేకులు వనమనియు, పురమనియు, సన్యాసమనియు, సంసారమనియు నెంచక, నిశ్చల చిత్తముతో నిర్వికల్ప నిష్టాపరులై యుండగా నీవు సంసారమును రోసి యరణ్యములో నొంటరిగా నుండుటకు కారణమేమి?

విఠోబా :- సాక్షి నెరిగి సర్వసాక్షి యం దేకీభవించినవారైనను సంసారమున నున్నచో సమాధిసాధనమునకు విఘ్నముగలిగి సాక్షాత్కారదశను వ్యర్థముగా బోగొట్టుకొందురు. కావున సహజానంద సంపద ననుభవించువారికి స్వప్నమందైనను సంసార మపేక్షింప దగినది కాదు.

జ్ఞాన :- ఇది వలయునన్న సంకల్పమును నది వలదన్న వికల్పమును లేక నిర్మలముగా లుండుటే సహజానంద నిష్ఠకాని వనము నపేక్షించి పురము నుపేక్షించుట కాదు.

విఠోబా:- సంకల్ప వికల్పములు లేక స్వస్థచిత్తుడై యున్న వానికి ప్రపంచ వ్యాపార మెట్లు నడచును? ప్రపంచ వ్యాపారములో బొత్తిగా ప్రవేశింపక నిశ్చలచిత్తుడై యున్న వానికి పట్టణములో వసింపవలసిన పనియేమి? దుఃఖముల కెల్ల మూలమైయున్న శరీరమును పోషించుకొని సంతోషించుటకా దురవస్థలకు జన్మస్థానమగు పట్టణములో వసింప వలసినది? ఇది యుక్తమైనది కాదు.

జ్ఞాన :- సమాధిసాధన మన్న వ్యాపార మొకటి యుండెడు పక్షమున సంసార వ్యాపారమున్న బాధక మేమి?

విఠోబా :- సమాధిసాధన యొక్క వ్యాపారమే యైనను సంకల్ప వికల్పాది వ్యాపారముల నెల్ల మూలమట్టుగ నసింప జేయు చున్నది. సంసార వ్యాపార మన్ననో సంకల్ప వికల్పాది సర్వవికారముల నెల్ల వృద్ధిజేసి సంకటమునకు లోబరచు చున్నది. కావున సర్వానర్థములకు మూలమగు

సంసార వ్యాపార మెప్పటికిని గూడదు.

జ్ఞాన :- సచ్చిదానంద స్వరూప సాక్షాత్కారదశ నొందిన పిదప సమాధి సాధనముతో బనియేమి?

విఠోబా:- జాగ్ర త్తయందు సుషుప్తిని బొందుటయేగదా బ్రహ్మనిష్ఠ యనబడును? అది యలవడకున్న పరిపూర్ణ బ్రహ్మానంద మెట్లు సిద్ధించును?

జ్ఞాన :- జాగ్రదవస్థయందు నింద్రియ వ్యాపారమును, స్వప్నావస్థ యందు మనో వ్యాపారమును, సుషుప్త్యవస్థయందు శూన్యతను గనుగొని భ్రమింపక యుండుటే బ్రహ్మానందమనియు, నెందును నంటియు నంటక వెలయుచుండుటే జాగ్ర త్సుషుప్తి యనియు వేదములు ఘోషించుచుండ శుద్ధ శూన్యమగు సుషుప్తివలె నుండుటయే ఆనందమనియు నదియే జాగ్రత్సుప్తి యనియు నీ వెంచుట పొరపాటని తోచుచున్నది.

విఠోబా:- జాగ్రత్స్వప్నావస్థ లెప్పుడును ప్రపంచ వ్యాపారములను ధాన్యమును జల్లి విషయములను గొప్ప యురులొడ్డి జనులను మృగములనుబట్టి వివిధ దుఃఖముల ననుభవింప జేయును. కావున ప్రపంచ వ్యాపారమున కందక శుద్ధ శూన్యమై వెలయుచున్న సుషుప్తితో సమానమగు సమాధియే యుత్తమమైనది.

జ్ఞాన :- పూర్వము జనకుడు మొదలగు మహానుభావులు ప్రపంచ వ్యాపారములో బ్రవేశించియుండియు విషయములను దుష్టమృగములనెల్ల నెరుకయను ఖడ్గముచే నరికి వేసి సుఖదుఃఖముల నెంతమాత్రము లక్ష్యపెట్టక తటస్థులై యుండిన స్థితియే సమాధిగాని శుద్ధశూన్యము కాదు.

విఠోబా :- అనేక జన్మసంచిత వాసనా విశేషము చేత వెరియెత్తి విచ్చలవిడిగా పరు వెత్తుచున్న చపలచిత్తమను మర్కటము సకల బంధములనుండి విడివడిన శుకమహర్షి కొక్కనికి మాత్రమే స్వాధీనపడినది.కాని సుషు ప్తిస్థితి లేక తన్ను బ్రహ్మమాత్రముగా దెలిసికొన్న జనకునకు స్వాధీన పడ లేదు.

జ్ఞాన :- దృఢప్రజ్ఞకలిగి మెలగుచున్న జనక చక్రవర్తికే మనోలయమైనదికాని బాహ్యబంధములను వదలి యరణ్యములో

వసించుచుండిన శుకమహర్షి కేమాత్రమును మనోలయము కాలేదు.

విఠోబా:- దృజ్మాత్రముగా నుండి దృశ్యప్రపంచమును నిరసింప పలసినదేకాని దృశ్యములో నుండియే దృశ్యమును నిరసింప వలె నన్న సాధ్యముకాదు. విషదోషమును హరించుటకై మరల విషమే త్రాగినచో మఱింత శీఘ్రముగా మరణమే సిద్దించునుగాని దోషనివృత్తి యగునా?

జ్ఞాన :-విషదోషములను హరింపవలెనన్న విషస్వభావము గల యౌషధమును బ్రయోగించినట్లు భయంకరములగు నింద్రియవికారముల నెల్లను దృఢ ప్రజ్ఞ చేత జయించువాడే ధీరుడుకాని, యెల్లప్పుడు నిష్ఠలో నుండి విషయ మృగము లెక్కడ వచ్చి బాధించునోయని భయపడువాడు ధీరుడు కాడు. అట్టివానికి భయమే సిద్ధించునుగాని బ్రహ్మానందము సిద్ధింపదు.

విఠోబా : - సర్వసంగ పరిత్యా గ మొనర్చి సర్వదా సమాధి నిష్ఠలో సున్న వానినే విషయములు చలింపజేయు ననగా, సంసార వ్యాపారములోనే సంతతము మునిగియున్న వాని నెంత చేయలేవు? గొప్ప ప్రవాహములో బడి కొట్టికొని పోవుచున్న కసవుపోచయెట్లు స్థిరముగా నిలువగలుగును?

జ్ఞాన :- దృఢ ప్రజ్ఞ లేనివాడెంత కాల మంతర్ముఖముగా నున్నను బల వంతములైన యింద్రియము లేవిధముగా నైన వానిని బహిర్ముఖమునకు దిప్పి ముప్పుతిప్పలు పెట్టక మానవు. ప్రవాహమునందు బడిన గొప్ప బండఱాయి యెట్లు చలించదో యట్లు విషయవికారములును తత్సంబంధములగు విచారములు నెన్ని సంభవించినను నిశ్చలచిత్తుడై యున్న వాడే బ్రహ్మానందమునకు పాత్రుడగునుగాని చపలచిత్తుడు పాత్రుడుగా లేడు.

విఠోబా:- ఎంతటిదృఢ ప్రజ్ఞగలవాడైనను సర్వసంగములను పరిత్యజించి సంతతము సచ్చిదానంద పరబ్రహ్మము నుపాసింపక పోయినచో మాయాంధకూపములోబడి మునిగిపోవు ననుటకు సందేహము లేదు.

జ్ఞాన :- మాయ బ్రహ్మమున కంటె భిన్నమైయున్న గదా నిరంతరము నిష్ఠలో నుండి దానిని జయింపవలసినది? తన నీడ తనతో ప్రతిఘటించి యుద్ధముచేయునన్నట్లు మిథ్యాభూతమైన మాయ నొకదానిని కల్పించుకొని, నిరంతరము నిష్ఠలో నుండవలెనని యూరక భ్రమపడుదురు. నీడతో పోరబూనుకొన్న నెంత ప్రయోజనమో మిథ్యాభూతమగు మాయను జయింప బూనుకొన్న నంతయే ప్రయోజనము. మిథ్యయై యున్న మాయను మిథ్యయనియే నిశ్చయించి మౌనముద్ర వహించి యుండక లేనిపోని చిక్కులు

తెచ్చి పెట్టుకోని కష్టపడుట వలన ప్రయోజనమేమి?

విఠోబా:- నియతి చేయకయు, నేకాగ్రచిత్తత నొందకయు, సాక్షి మాత్రముగా నుండకయు బ్రహ్మజ్ఞాన మెట్లు కలుగునో చెప్పుము.

జ్ఞాన :-నేతీయను మహావాక్యము వలన నిషేధింప మొదలు పెట్టిన కొలది చీమలపుట్టవలె విషయము లసంఖ్యాకములుగా వెలువడుచునే యుండును. ఏకాగ్రచిత్తత నొంద నారంభించినకొలది పుట్టచెండెగురునట్లు మనశ్చలన మెక్కువగు చుండును. సాక్షిమాత్రముగా నుండుటకు ప్రయత్నమ చేసిన కొలది కుక్కతోక చక్క పడనట్లు దేహాది ప్రపంచ మంతయు తాననెడి భ్రాంతి యెక్కువగుచుండును. కావున నవిద్యా రూపమగు నహంకారమును మిథ్యాభూతమగు మాయయు ముత్తెపుచిప్పయందు దోచు వెండివలె నత్యంత మిథ్యయని తలచి, తానే బ్రహ్మమని నిశ్చయించి, విచారజ్ఞానముచేత నిర్విచారమును పొంది యుండుటయే బ్రహ్మానందముగాని వేరు కాదు.

విఠోబా:- సాధన సంపత్తి లేక విచారజ్ఞానము చేత తానే బ్రహ్మమని నిశ్చయించుకొన్న మాత్రమున దుఃఖమయములగు విషయములనెల్ల జయించి బ్రహ్మానందమును బొందుటయెట్లు సాధ్యమగును ?

జ్ఞాన :-జీవముతో నున్నప్పుడే వ్యాఘ్రమును జంప లేని పశువు చచ్చిన తరువాత నెట్లు చంపగలుగును? అట్లే నిత్యమై సత్యమై నిర్మలమై నిష్కళంకమై సచ్చిదానందమై స్వయం ప్రకాశమై వెలయుచున్న యాత్మను జడములైన విషయము లేమియు చేయజాలవు. పశువు లెంత బలిసియున్నను వ్యాఘ్రము ముందునకు వచ్చుటకు భయపడునట్లు విషయము లెంతవిఱ్ఱవీగునవైనను నిశ్చలజ్ఞాన సంపద గల నిర్మలచిత్తుని ముందెప్పుడును దలచూప భయపడుచుండును. ఒక వేళ తలచూపినచో వ్యాఘ్రమునకు గనబడిన పశువు వలె తక్షణమే నశించును.

విఠోబా:- అంకుటాలితో జేరిన యిల్లాలు గూడ అంకుతనమునకు దిగి చెడిపోవునట్లు నిరంతర మవివేకులతో సహవాసము చేసిన వివేకియు విషయభ్రమలకు జిక్కి యనేక దుఃఖముల ననుభవించునేగాని సుఖము నెంతమాత్రము ననుభవింప లేడు.

జ్ఞాన :- స్థిరచిత్తతగల పతివ్రత పలువురు జారస్త్రీలతో జేరి యున్నను తన పాతివ్రత్యమును జాగ్రత్తగా కాపాడు కొనునుగాని వారి దుర్బోధలకు లోనుగాదు. స్థిర చిత్తత లేని కాంత యితర సంసర్గము లేక యొంటరిగా

నున్నను తనంత తానే పాతి ప్రత్యమునకు భంగము తెచ్చుకొనును. అట్లే దృఢజ్ఞాన సంపన్నుడగు పురుషుడు దురభిమాన పిశాచగ్రస్తులకు నజ్ఞులతో నిరంతరము సహవాసము చేయుచున్నను తన సుజ్ఞానమున కెంతమాత్రమును లోపము కలిగించుకొన లేడు. దృఢజ్ఞానహీనుడగు పురుష డెవ్వరితోను జేరక యింట నొంటరిగా నున్నను జ్ఞానమును నశింపజేసికొని తుదకు వ్యర్థుడగును.

విఠోబా:- నీ వెన్ని చెప్పినను సంసార వ్యాప్తిలో జిక్కి సంకట మనుభ వించువానికి సహజ జ్ఞాన సంపద గలుగునన్నమాట విశ్వసించుటకు వీలు లేదు.

జ్ఞాన :- బ్రాహ్మణుడు నాటక రంగమున పాకీవాని వేషము వేసికొని నంటిచినను వాని బ్రాహ్మణత్వమున కెట్లులోపము కలుగదో అట్లే జ్ఞానవంతు డజ్ఞానులతో గూడి విచ్చలవిడిగా దిరుగు చుండినను అతని ఆనందమున కెంతమాత్రమును లోపము రాదు.

విఠోబా:-ఎంతటి దృఢప్రజ్ఞావంతుడైనను ముహూ ర్తమాత్రము బ్రహ్మధ్యానము చేయక యూరకున్నచో నతని ఆనంద స్థితికి లోపము సంభవించును.

జ్ఞాన :-పాకివాని వేషము వేసికొని నాట్యరంగమున నటించుచున్న బ్రాహ్మణుడు "నేను బ్రాహ్మణుడను, నేను 'బ్రాహ్మణుడ" నని పలుమారు చెప్పుచుండవలయునా? చెప్పకున్న నతడు పాకివా డగునా? జగ మెరిగిన బ్రాహ్మణునకు జందెమేల యన్నట్లుగా నహంకార గ్రంధి నడుగంట గోసిన పిదప మరల దురభిమానము నుంచుకొని 'అహం బ్రహ్మాస్మి. అహం బ్రహ్మాస్మి' యని యను సంధింపనేల? అహంకార మమకారము లడగిన పిమ్మట బ్రహ్మను సంధానము చేయకున్నను పరమానందమున కెంతమాత్రమును లోపము రాదు.

విఠోబా :- సర్వజ్ఞమూర్తి యంతటి వాడైనను సర్వదా బ్రహ్మను సంధానము చేయకున్న నజ్ఞానసాగరమున మునిగిపోవును.

జ్ఞాన:- దివిటీ చేతబట్టుకొని చీకటి నుండమన్న నెట్లుండ గలుగును? దేహాది ప్రపంచమును తానని భావించు నజ్ఞానమును తొలగించి బ్రహ్మమే తానని తెలిసికొన్న తదుపరి యజ్ఞానము నుండుమన్న నెట్లుండగలదు?

నివృత్తి దేవుడు తండ్రితో "నాయనా! తమ్మునితో నింత పట్టుదలగా జర్చించు టేల? ఏవస్తువును స్మరించినంత మాత్రమున సమ స్తపాపములు నశించునో, ఏవస్తువును విచారించినంతమాత్రమున నిస్సంగత్వము కలుగునో, ఏవస్తువును దర్శించినంతమాత్రమున జీవ త్వము నశించునో, యావస్తువునే దెలిసికొనవలెననియు, దానినే భక్తిప్రపత్తులతో నుపాసించిన లెననియు, నదియే పరబ్రహ్మమని గ్రహింపవ లెననియు వేదములు దెలుపుచున్నను స్థావర జంగ మాత్మకమైన సమస్త వస్తువులయందును పృధివ్యాది పంచభూతముల యందును శబ్దాది పంచతన్మాత్ర తలయందును అవ్యక్తి మహదహం కారాది తత్వములందును సత్వర జస్తమోగుణములయందును వాని యందు బ్రతిఫలించిన బ్రహ్మావిష్ణు మహేశ్వరులయందును పరమాణు వులయందును పరిపూర్ణముగా నిండియున్న పరబ్రహ్మమున కెట్లూ నమస్కరింపవలెనో, వాక్కు చేత జెప్పుటకును మనస్సుచేత నూహించుటకును శక్యముగాని పదార్థము నెట్లు స్తుతింపవలెనో తెలిసికొనుటకు సాధ్యమగుట లేదు. అట్టి రూపనామ క్రియాతీత వస్తువును దర్శింప వలెననియు స్తుతింపవలెననియు మాటిమాటికి బలుకుటవలన ప్రయోజన మేమి? ఆనందమాత్రముగా వెలయుచున్న పదార్థముయొక్క తత్వమును శ్రుతి స్మృతి పురాణేతిహాసములు గూడ నిరూపించ లేక మౌన మవలంబించుచుండగా నది యిట్టిదని నిర్ధారణ చేయుటకు మనకు సాధ్యమగునా ? నామ రూప క్రియలు మొదలగు చిహ్నము లెల్లను నశించిన పిదప శేషించియుండు వస్తు వేదో యదియే తానై సమస్త పదార్థములందును సమదర్శనముగలిగి వెలయుటయే యుత్తమమగు బ్రహ్మధ్యానమనియు, సంకల్ప వికల్పములు లేక సుఖదుఃఖముల నొందక యహంకారమును నశింపజేసి ఆనందమాత్రముగా నుండుటే యుత్కృష్టమగు బ్రహ్మనిష్ఠ యనియు నుత్తమ తత్వ వేత్తలు బలుకుదురు. కావున నీ వడవిలో వసింపవలెననియు పట్టణములో వసింపగూడదనియు పలుకుట శ్రుత్యనుభవములకు విరుద్ధముగా నున్నది. స్థాణువువలె నొక స్థలమున గూర్చుండి కదలక మెదలక యుండుటవలన ఫలమేమి?" అని పరతత్వ రహస్యమును దెలిపెను.

ఇక విఠోబా వారి నత్యంత ప్రేమతో కౌగిలించుకొని "అన్నలారా! పూర్ణానందబోధనములు మీతోడనే పుట్టినవి. పరతత్వ విషయమై మీతో

వాదించు సమర్థులు లేరు. ఇట్టివారిని పుత్రుడనుగా బడసిన నా భాగ్యమే భాగ్య"మనెను. నివృత్తి దేవ, జ్ఞానదేవులు శివ కేశవ రూపములను ధరించిరి. విఠోబా వారిని జూచి యత్యాశ్చరమ నొంది చేతులు జోడించి -

"పరమ దయాస్వరూపులారా! మీరు భక్తులయందు గల వాత్సల్యము నేమని కొనియాడగలను? మీరు సకలలోకములకు ప్రభువులరు. బంధమోక్షముల కధ్యక్షులు సృష్టి స్థితి లయకర్తలరు. జగదంత రాత్ములరు. మీ మహిమ గొనియాడ నెవరితరము? లోకమున మీ విషయమై కొందరు కలరనియు, కొందరు లేరనియు, కొందరు సగుణులనియు, కొందరు నిర్గుణులనియు చర్చించుచుందురు. అమోఘమగు మీరూప మందరి కన్ని విధములు దోచుచు నచింత్యమై యద్భుతమై యవ్యయమై స్వయంప్రకాశమై వెలయుచుండును. పామరులు లోకత్రయమునకును కాలత్రయమునకును మూలమై భిన్నముగా దోచునట్టి మీ మూ మార్తిత్రయ ద్యోతితమగు దివ్యస్వరూప మును పరబ్రహ్మమని గ్రహింపలేక మీయందు భేద భావములు గల్పించి దుర్వివాదముల కుపక్రమించి చెడిపోవుచుందురు. వారికి విశ్రాంతి యుండదు. యోగు లేకాంత స్థలమున గూర్చుండి యింద్రియములను జయించి మనస్సును నిగ్రహించి యోగమార్గమున జ్ఞాన నేత్రములతో పరమపవిత్రమగు మీ స్వరూపమును సందర్శించితిమని యానందింతురు.కాని యిట్లు మాంసచక్షువులతో మీస్వరూప మును తనివిదీర జూచియుండ లేరు. పరమపవిత్రులగు మిమ్ము పుత్రులనుగా బడయుటకు నేను పూర్వజన్మమున నెంతటి పుణ్యము చేసి యుంటినో తెలియదు. శివకేశవులగు మిమ్ము భక్తి ప్రపత్తులతో నిత్యమును సేవజేయుచు బ్రహ్మానందము సనుభవించుట మాని కీకారణ్య మధ్యమున బడియున్న నా యవివేకమున కేమందును? అవతరించినంతనే మీ స్వరూపమును జూసి నన్ను కృతార్థుని జేయక యింతవరకు గోప్యముగా నుండుటకు కారణము తెలియకున్నది. నా తపము పండినది" అని యనేక విధములు కొనియాడెను. సోపాన దేవుని జూచి "మహాత్మా! నీ దివ్యస్వరూపమును జూపక మౌనము వహించియుండు టెందులకు? నీ సేవను ప్రసాదించి నన్ను కృతార్థుని జేయు"మని ప్రార్థించెను.

సోపాన దేవుడు చతుర్ముఖములతో స్వస్వరూపదర్శనము చేయించి, సాదరముగా చైతన్య స్వామిని జూచి, "భాగవతాగ్రణీ !" తనయందు

పరబ్రహ్మమును గనుగొని దుఃఖములు లేవని నిశ్చయించి పరిపూర్ణ వస్తువై యున్న వానికి సంసారభయ ముండదు. సంసార భయము తొలగిపోగా స్వర్గనరకములను నిర్బంధములును తొలగును. నిర్బంధ రహితునకు బంధమోక్షములు తల చూపలేవు. ప్రపంచములో బ్రహ్మాది స్తంభ పర్యంతమును గల సమస్త పదార్థములును బ్రహ్మమనియు, ఆ బ్రహమణువున కణువై మహత్తునకు మహత్తై వెలయుచున్నదనియు దెలిసికొనుటయే బ్రహ్మానుభవముగాని వేరు కాదు. ఈ యనుభవమును దృఢముగా సిద్ధిచేసికొని సంసారము నందు కుమ్మర పురువువలె వర్తించువాడే బ్రహ్మవేత్త యనబడును. గృహస్థ ధర్మము నవలంబించి యీ యనుభవమును బొందుట చేతనే పూర్వము వసిష్ఠునకు విశ్వామిత్రుడును, జనకునకు శుకుడును, శ్రీకృష్ణునకు దుర్వాసుడును లోబడిరి. కావున గృహస్థధర్మము ననుసరించు జ్ఞానవంతుడే సర్వసంగపరిత్యాగులైన సన్యాసులలో నత్యుత్తమ మైనవాడు. ఇందులకు సందేహము లే"దని చెప్పెను. విఠోబా సంతోషాంతరంగుడై "దేవా! నీ వెట్లు సెలవిచ్చిన నట్లు నడచు కొనుటకు సిద్ధముగా నున్నా"నని పలికెను.

ముక్తాబాయి వైపు దిరిగి "అమ్మా! నీవు లక్ష్మివో సరస్వతివో పార్వతివో తెలియకున్నది. నీ స్వసరూపమును జూపి నన్ను ధన్యుని జేయు"మని వేడెను. ముక్తాబాయి త్రిజగన్మోహనాకార మగు తన దివ్యరూపమును జూపి యదంపతుల నద్భుత ప్రమోద మగ్న మానసుల నొనర్చెను. ఆ దంపతు లిద్దరు భ క్తితో నామెకు నమస్కరించి" అమ్మా! జగదీశ్వరీ! జగన్మాతా! నీ మహత్వమును గొని యాడ మేమెంతవారము! సకలలోక శరణ్యవగు నీవు మాకు కుమా ర్తెవై యవతరించుట మా భాగ్యము. మా కపరిమితానందము లభించిన" దని కొనియాడిరి. విఠోబా తన భార్యతో సతీమణి! మన యాచార్యుని యాశీర్వచన ప్రకారము త్రిమూర్తులును నాదిశక్తియు మనకు బిడ్డలుగా నవతరించిరి. మనకు వీరి వెంటనుండి వీరిని నేవించుట ముఖ్య కర్తవ్యమని పలికెను. రుక్మాబాయి మిక్కిలి సంతసించి, తన యదృష్టమును గొనియాడెను.

ఆదిశక్తి సాదరముగా జననీ జనకులను జూచి "పరమభాగ వతులారా ! ఈ యుగమునందు కలిపురుషుని ప్రభావ మెక్కుటచే ప్రజలెల్ల దుర్మార్గులై జిహ్వాచాపల్యముచే జీవహింస కొడిగట్టి సదాచారముల జెడగొట్టి దుర్గతికి

పోవుటకు ప్రారంభించిరి. వారి దుస్థితి జూచి సహింపలేక వారినందరిని సన్మార్గమునకు ద్రిప్పి కృతార్థులనుగా జేయుటకై మేము నలువురము మీ గర్భమున నవతరించితిమి. మీరు సామాన్యులు కారు. పరిశుద్ధులగు నరుంధతీ వసిష్ఠులు, మీకు బ్రహ్మోపదేశము చేసిన శ్రీ పాదస్వామి నారదుడు. పూర్వజన్మమున మీరు మమ్ము నలువురను బిడ్డలనుగా బడయ వలయునని మిక్కిలి కాంక్ష గలిగియుండుటచే నీ జన్మమున మీ కోరిక దీర్చితిమి. ఈ రహస్యము నితరులకు దెలుపక మిక్కిలి గోప్యముగా నుంచవలెను. మా కార్యమును శీఘ్రముగా నెర వేర్చవలయును, అందువలన పట్టణమున కిప్పుడే వెళ్ళవలెను. మీరు మా వెంట లేచి రం"డని పలికెను. విఠోబాను జూచి, "బ్రహ్మానుసంధానమునకు ముఖ్యసాధనమగు నద్వైతజ్ఞానమునకు భేదభావము కూడదు. సుఖ దుఃఖ సుగంధ దుర్గంధాది ద్వంద్వముల నెల్ల సమముగా నెంచి యనుభవింపగలిగిన యుత్తములకు మాత్రమే సాధింపగలిగిన బ్రహ్మనిష్ఠ యరణ్యమని, పట్టణమని, భేదబుద్ధిగల నీవంటివారి కెట్లు సాధ్యమగును? సదానందమై సచ్చిదానందమై చరాచర రూపమున సమస్త వస్తువుల యందు వ్యాపించి పరాత్పరమైయున్న వస్తువేదో యదియే పర బ్రహ్మము. ఏకమనికాని యనేకమని దానిని నిరూపింపకూడదు. ఆపదార్థ మిట్టిదని నిరూపింప సాధ్యము కాదు. వాక్కు చేత నుచ్చరింపదగిన శబ్దము నా వాక్కు చేతనే స్థిరపరచ వలసినట్లు పరమాత్మ యొక్క వాస్తవస్థితిని పరమాత్మ వలననే యెరుగవలసియుండును. హింసయొక్క స్వభావము హింస ననుభవించువానికిని, దప్పి యొక్క కష్టము దప్పిగొన్న వానికిని, పదార్థముయొక్క రుచి భక్షించినవానికిని దెలిసినట్లు సచ్చిదానంద పరబ్రహ్మతత్వము ననుభవము చేతి నెరుగ వలయునేకాని చెప్పి చూపుటకు వీలుపడదు. ఇది మంచి యిది చెడ్డయని దలంపక గాఢాగ్నివలె నున్న వాని కిది నగర మిది వనమను భేద బుద్ధి గలుగదు. నీవీవిషయములను చక్కగా విచారింపక పోవుటచే నిట్టి సంశయములు కలిగిన" వని యుపన్యసించి, సంశయముల నెల్ల దీర్చి, "అరణ్యమున నుండవలసిన పనిలేదు. పట్టణమునకు వెళ్ళుదము ర" మ్మనెను.

విఠోబా పరమానందముతో వారి వెంట పట్టణమునకు వెళ్ళుటకు సిద్ధపడెను. త్రిమూర్తులు నాదిశక్తియు నా రూపములను విడిచి, మునుపటి రూపములను ధరించి, దంపతులకు తమయందు విశేష వాత్సల్యము

గలిగించి, వారిని వెంటదీసికొని బయలుదేరి యలకావతి జేరిరి. సిద్ధోపంతు కుమార్తెయు నల్లుడును బిడ్డలతోగూడ వచ్చి నందులకు మిక్కిలి సంతసించెను.

## జ్ఞానదేవుడు దున్నపోతుచే వేదమును జెప్పించుట.

జ్ఞానదేవు డొకనాడు తండ్రితోగూడ రాజుకడకేగి, యాశీర్వదించి, విఠోబాను జూపి యతడు తన తండ్రియని తెలిపెను. రాజు భక్తితో విఠోబాకు నమస్కరించి యుచితాసనమున గూర్చుండజేసి యతని ననేక విధముల కొనియాడి, యరణ్యమునకు వెళ్ళుటకు గల కారణమును తెలుపుమని ప్రార్థించెను. విఠోబా యతని నాశీర్వదించి, "రాజా! ప్రపంచమునందలి యెనుబది నాలుగులక్షల జీవరాసులలో మానవజన్మ ముత్తమము. అందులో పురుషుడుగా బుట్టుట దుర్లభము. అట్టి జన్మము లభించగా దానిని సద్వినియోగము జేయ వలయునేకాని వ్యర్థపుచ్చరాదు. పశువులకు మానవులకు నాహార, నిద్రా, మైథున్యములు సామాన్యమే యైనను మానవులందు జ్ఞాన మొక్కటి విశేషముగా నుండుటచే వారు జంతువులలో నెల్ల నుత్తములుగా చెప్పబడుదురు. కావున మానవుల కెల్ల నాత్మానాత్మ వివేక మవశ్యము. అట్టి వివేకము కేవలము సత్సాంగత్యము వలనను శాస్త్రవిచారము వలనను కలుగును. అది లభించిన పిదప గురుముఖముగా తా నిట్టివాడనియు, మనస్సును లయింపజేయుటకు సాధన మిట్టిదనియు దెలిసికొని, దానియర్థమును మననము చేయుచు నేకాంతమున నిస్సంగుడై నిదిధ్యాసము చేత దానిని ధృఢపరచ వలయును. ఆ నిదిధ్యాసమునకు సదాభ్యాస మవశ్యము. సదాభ్యాసమునకు నిజనస్థలము ముఖ్యము. కనుక వనవాస ము త్తమమని నిశ్చయించి యందు వాసము చేయుచుంటి ననెను. రాజు పరమానంద భరితుడై "స్వామీ! పామరులగు బ్రాహ్మణులు నీ మహత్త్వమును గుర్తించలేక యుక్తాయుక్త వివేకశూన్యులై నీ కవమానము గలిగించిరి. ఆ పాపములో నన్ను గూడ భాగస్వామిగా జేసిరి. కరుణించి నా నేరమును మన్నించు" మని ప్రార్థించెను. అందులకు విఠోబా మందహాసముచేసి "రాజోత్తమా! నీవు పరిశుద్ధ చిత్తుడవు కావున సమస్త సామ్రాజ్యము నేలుచు సుఖముగా నుండగల" వని పలికెను.

రాజు ప్రతిష్ఠాన పురమున వసించుచున్న యాచార్యస్వామి కొక విన్నపమును వ్రాసి, మంత్రి చేతికిచ్చి, వీరి నెల్ల దీసికొని వెళ్లి మఠాధిపతికీ

విన్నపము నిచ్చి యితని యందు దోషము లేదని యాచార్యుని వలన నిరాక్షేప నిరూపము నొకదానిని దీసికొని రావలసినదని యాజ్ఞాపించి పంపెను. మంత్రి విఠోబా మొదలగు వారిని వెంట దీసికొని తగిన పరివారముతో బయలు దేరి పైఠణపురమునకు బోయి మఠాధిపతిని దర్శించి కానుకలు సమర్పించి విజ్ఞాపన పత్రిక నిచ్చెను. మఠాధిపతి యందలి సంగతుల నెల్ల జదివెను. అతడు బ్రాహ్మణులచే విఠోబా విషయము వినియుండటచే నవ్వి, బ్రాహ్మణులతో "అయ్యలారా! ఈ వినోదమును వింటిరా? అలకావతి రాజు సన్యాస భ్రష్టు డైన వానికి బుట్టిన పిల్లలను జాతిలో జేర్చుకొని వారి కుపనయనాది సంస్కారములను జేసి నిరాక్షేప నిరూపము నిచ్చి పంపవ లెనని విజ్ఞాన పత్రిక వ్రాసినాడు. దీని విషయమై మీ కేమి తోచుచున్నదో తెలియజేయు"డని యడిగెను.

ఆ బ్రాహ్మణులు నవ్వి "బాగున్నది. మంత్రములు చెప్పి గంగలో వేయిమాట్లు స్నానము చేయించినను శూద్రుడు బ్రాహ్మణుడగునా? స్పర్శవేది నెంత రాచి పుటము వేసినను చిల్ల పెంకు బంగార మగునా? సన్యాసము దీసికొన్న వాడు శూద్రుని పంక్తిలో సహితము కూర్చుండుటకు యోగ్యుడు గాడని శాస్త్రములు దెలుపుచుండగా బ్రాహ్మణుల పంక్తిలో నెట్లు గూర్చుండ నర్హుడు డగును? రాజు తలంపు జూడగా జారస్త్రీని పతివ్రతగా జేయనున్నట్లున్నది. వర్ణ భ్రష్టుని పిల్లలు శూద్రుల కంటే నీచులు. వీరి ముఖమైనను చూడరాదు. వీరు ప్రాయశ్చిత్త విధులతో గూడ పరిశుద్ధులు కాలే"రని పలికి ధిక్కరించిరి.

ఆచార్యస్వామి మంత్రితో "అయ్యా! విఠోబా కుటుంబములోని వారికీజన్మమున బ్రాహ్మణపంక్తిల గూర్చుండు యోగ్యత సిద్ధింపదు.ఈ విషయమును రాజునకు మనవిచేయు"మని చెప్పెను. మంత్రి బ్రాహ్మణుల మూఢత్వమునకు చింతించి, విఠోబా మొదలగు వారినెల్ల నచటనే విడిచి, తానొక్కడే యలకావతి కేగి, రాజునకా విషయమును పూసగ్రుచ్చినట్లు దెలిపెను. రాజు వారి నెట్లయిన జాతిలో జేర్చవలెనని యెంచి గొప్పగొప్ప బ్రాహ్మణుల రావించి వారితో నాలోచించుచుండెను.

జ్ఞానదేవు డామఠమున గూర్చున్న బ్రాహ్మణుల కెల్ల నమస్కరించి, తనతండ్రి విషయమును వివరముగా దెలిపి, "అయ్యలారా! పరమార్థమును గురించి సన్యాసము దీసికొన్న వాడెట్లు వర్ణ భ్రష్టు డగును? మీ వంటి పెద్దలే

యిట్లు సెలవిచ్చినచో నిక చెప్పవలసిన దేమున్నది? దయచేసి దీనులమగు మా మనవి చిత్తగించి ధర్మమును విచారించి మమ్ము రక్షింపుడు. శరణాగతులను నిరాకరించుట ధర్మము కా"దని పలి కెను. బ్రాహ్మణు లామాటలువిని కోపావేశ పరులై "ఓరీ! మిమ్ము మేము రమ్మని పిలిచితిమా? ఏలవచ్చితిరి? ఇక నోరుమూయుము. అభక్ష్య భక్షణము చేసి వర్ణ భ్రష్టులైనవాని సంతతికి కీర్తిప్రతిష్ట లెట్లువచ్చును? మీ ముఖము చూడరాదు. ఇచటి నుండి వెళ్ళిపొం"డని తిరస్కరించిరి. జ్ఞానదేవుడు చిరు నవ్వుతో "ఆత్మ తత్వమును మరచి కుక్షింబరులై శూద్రుల ధనముతో జీవించుచు వారి విషయమున నెంతమాత్రమును కృతజ్ఞత లేక వారినే దూషించు మీవంటి దుర్మార్గుల ముఖమును జూడరా"దని పలికి ధిక్కరింపసాగెను. విఠోబా కుమారునితో నింటికి బోవుదము రమ్మ నెను. బ్రాహ్మణులు పిల్లల పేర్లను దెలిసికొని వారిని పరిహాసము చేయుచు స్నానమునకై గోదావరికి బయలు దేరిరి.

జ్ఞానదేవుడు వారితో "అయ్యలారా! ఏనుగునుజూచి కుక్కలు మొరిగినట్లు సజ్జనులను జూచి దుర్జనులు నిందించుట సహజము. దాని వలన సజ్జనుల కెట్టి హానియు లేదు. మీరు మమ్ము జూచి పండ్లికిలించి నంత మాత్రమున మాకెట్టి యవమానమును లేదు. అని పలికెను. బ్రాహ్మణులు కోపించి "ఏమిరా! నీకన్నులకు మేము కుక్కల"మైతిమా? నిన్నేమి చేసెదమో చూడు" మని పలికి పండ్లు పట పట గొరుకుచు కండ్లెఱ్ఱజేసి కొట్టబోయిరి. నివృత్తి దేవుడు వారి కడ్డపడి "అయ్యలారా ! కొంత శాంతింపుడు. మా విషయముల నెల్ల మీకు మనవి చేసికొంటిమి. మీకిష్టమున్న మాయందు దోషము లేదని నిరూపము వ్రాసి యీయవచ్చును. లేకున్న వీలుండ దని చెప్పవచ్చును. అంతేకాని పరిహాసము చేయనేల? మీ కిది యుక్తమైన పనికాద"నెను. బ్రాహ్మణులు మఱింత కోపించి "తెలివి లేని మాటలు మాటాడకుము. మిమ్మిక్కడ నుండుమన్న వారెవ్వరు? ఇచటి నుండి వెళ్ళిపొం"డని ధిక్కరించిరి. నివృత్తి దేవుడు "ఆహా! మీ యోగ్యత నేనుని కొనియాడ వలెను? పూర్వము వేదముల నెల్ల జిక్కు దీసి లోకమున బ్రచురించిన వేద వ్యాసుడును, ఋషులచేత బ్రహ్మర్షి యని స్తుతింపబడిన వసిష్ఠుడును, భరద్వాజునకు బ్రహ్మోపదేశము చేసిన వాల్మీకియు, సృష్టికి బ్రతి సృష్టి చేసిన విశ్వామిత్రుడును, రామసేవయందు గడతేరిన గుహుడును నేకులము వారో, వారు బ్రాహ్మణుల కెల్ల నెట్లు ప్రథమాచార్యులైరో

విచారించినచో మాతండ్రి వర్ణ భ్రష్టుడైనదియు, వర్ణ శ్రేష్టుడైనదియు తెలియగల"దని చెప్పెను. అందులకు బ్రాహ్మణులు నివృత్తి దేవుని చురచుర జూచి "మా మాటలు పెడ చెవిని బెట్టి పుక్కిటి పురాణములు మొదలు పెట్టితివి. శాపానుగ్రహ సమర్థులగు వ్యాసాదు లెక్కడ? ఎందులకు పనికిరాని మీతండ్రి యెక్కడ? ఈ విషయము నింతటితో జాలించి వచ్చిన దారిబట్టి వెళ్ళుట మంచిది. ఇక వెళ్ళు"డని పలికిరి. నివృత్తి దేవుడు "మీరువ్యర్థముగా మాటాడుచున్నారు. తత్వవేత్త లిట్లు బలుకరు పరమార్థమునకై పరమహంస నాశ్రయించి సన్యసించినవాడు భ్రష్టుడని వేదములో నెచటనైన విధింపబడియున్న తెలియజేయుడు చూత" మనెను. బ్రాహ్మణులు కోపావేశపరులై "మీ తండ్రి భ్రష్టుడనుటకు సందేహ మేల? కులభ్రష్టులగు మీ యెదుట మేము వేదము నుచ్చరింపము,గాని సన్యాసమును వదలి మరల గృహస్థుడైన వాడు వర్ణ భ్రష్టుడని వేదమునందు విధింపబడినదని మాత్రము దృఢముగా జెప్పెద"మనిరి.

జ్ఞాన దేవుడు ముందుకువచ్చి యాదారిని వచ్చుచున్న దున్న పోతు నొక దానిని జూపి "ఇదిగో, దీనికిని మీకును భేదము లేదు. మీతో మాటాడుటకంటె దీనితో మాటాడుట మేలు. సూర్యు డొక్కడయ్యు ననేక ఘటములందు ప్రతిబింబించునట్లు సమస్త భూతములందు సంతర్యామియై వెలయుచున్న వాడు భగవంతు డొక్కడే యని గుర్తించలేక జాతి మతభేదములను లెక్కించుచు మాకు సమానులుగాని మాకంటె గొప్పవారుగాని లేరని తలంచి వ్యర్థముగా గర్వపడుచున్నారు. వేదములందలి నాలుగుముక్క లేవో నేర్చి యూరక కూసినంత మాత్రమున మీరు జ్ఞానులనియే భావింప వలెనా? జ్ఞానోదయమై యున్న నిట్టి భేదభావము లుదయించునా? న్యాయము దెలియక ధిక్కరించుచున్నారు. ఇట్టి నడత మీకు సరి యైనది కా"దనెను. బ్రాహ్మణులు "జాతిభేదము లేదనుటయేగదా నీయభి ప్రాయము? భేద మున్నది లేనిది నీ కిప్పుడే తెలియజేసెద" మని పలికి యొక కఱ్ఱతో నా దున్నపోతు వీపుమీద నొక దెబ్బ వేసిరి. 'అబ్బా' యని జ్ఞాన దేవుడు మిట్టిపడెను. బ్రాహ్మణు లతని వీవున దేలియున్న వాతను జూచి "ఇప్పుడు తెలిసినది. నీకును నీ దున్నపోతునకును భేదము లేదనుట విశద మగుచున్నది. నీవు మమ్ము దున్నపోతు లంటివి. ఇవుడు దున్నపో తెవ్వరో నీవే యోచింపు"మని పలికి నవ్విరి. జ్ఞానదేవుడు వారి యవివేకమునకు

విస్మయపడి "మూర్ఖులారా! మీ యవివేకము నేమందును? ఈ దున్నపోతునకున్న తెలివిలో సహస్రాంశ మయిన మీకు లేదనుట విశద మగుచున్న"దని పలికెను. బ్రాహ్మణు లందులకు "ఓరీ! మూర్ఖుడా ! దున్న పోతునకు జ్ఞాన మేమున్నది? దాని కెంతటి జ్ఞాన మున్నదో నీకు నంతమాత్రమే యున్నది. పెక్కు మాట లెందులకు? ఇప్పు డీ దున్న పోతునకుగల తెలివిని మాకు జూపితివా మంచిది. లేకున్న నిన్నిక్కడనే పాతి పెట్టెద"మనిరి. జ్ఞాన దేవుడు వారినిజూచి "మూర్ఖులారా! తొందరపడకుడు. దీనికిగల జ్ఞానమును మీకిప్పుడే తెలియజే సెదను, అంతటితో నైన దీనితో మీరు సమానులు కారని మీరే సమ్మతింపగల" రని పలికి, యా దున్నపోతు వీపుమీద తన కుడిచేయి పెట్టి, "మహిషేశ్వరా! ఈ బుద్ధి లేని దురహంకారులు వినునట్లుగా వేదములను జెప్పు" మనెను.

వెంటనే యామహిష ముదాత్తానుదాత్త స్వరిత భేదములతో ఘనపద క్రమము తప్పక వేదములను జెప్పు నారంభించెను. కొంత తడవునకు జ్ఞాన దేవుడు "మహీష రాజమా! బ్రాహ్మణత్వము తపస్సు చేత గలుగునా? కులముచేత గలుగునా? జ్ఞానముచేత గలుగునా? కర్మముచేత గలుగునా? వీరికి వివరముగా తెలియజేయు" మనెను. ఆ దున్నపోతు "బ్రాహ్మణత్వము తపస్సు చేత గలిగెడిదేకాని కులము చేతగాని తక్కినవాని చేతగాని కలుగదు. దాసి కడుపున బుట్టిన నారదుడు, శునక గర్భమున బుట్టిన శౌనకుడు, పల్లెదానికడుపున బుట్టిన వ్యాసుడు మొదలగు మహాత్ములు తపోమహిమచేతనే బ్రహ్మ జ్ఞానమును పొంది బ్రాహ్మణులైరి.కాని కులము చేతనైనవారు కారు"అని సప్రమాణముగా జెప్పెను. వినయముతో ముట్టికాళ్లు వేసికొని జ్ఞానదేవునకు నమస్కరించెను. జ్ఞానదేవుని హస్తస్పర్శచే నాయెనుబోతు దుస్తరమగు నజ్ఞాన కూపమునుండి బయటబడి సుజ్ఞానమును బొందెను. ఆ బ్రాహ్మణు లాశ్చర్యపడి యచట నిలిచియున్న నేమి కీడు మూడునో యని భయపడి కాళ్ళకు బుద్ధి చెప్పిరి. సిద్ధులారా! వారెంతటి మూర్ఖులో యోచించుడు.

## జ్ఞానదేవుడు శ్రాద్ధమును నెరవేర్చి బ్రాహ్మణుని రక్షించుట.

ఒక బ్రాహ్మణుడు వారి వాదమునెల్ల విని దున్నపోతు వేదమును జెప్పుట విని యాశ్చర్యపడి, యాబాలురు మహాపురుషులని యెంచి,

వారికడకు వెళ్ళి నమస్కరించి, వారి ననేక విధముల స్తుతించి, వారిని వెంటదీసికొని తనయింటికి బోయి, యొకచోట వారికి విడిది చేసియిచ్చెను. ఆ గ్రామములోని వైదికు లావిషయమును దెలిసికొని కోపావేశపరులై యా బ్రాహ్మణుని మీద దోషారోపణము చేసి, యతనిని తమజాతి నుండి వెలివేసిరి. స్థల పరస్థలములవారికి వాజ్మూలముగాను పత్రికా మూలముగాను జాటిరి. నాటినుండి విప్రు లెవ్వ రతని యింటికి బోవుట మానివేసిరి.

ఒకనా డాబ్రాహ్మణుడు తనతండ్రికి శ్రాద్ధముచేయుచు తన కత్యంత మిత్రులుగానున్న కొందరు శ్రోత్రియులకు నిమంత్రణము చెప్పబోయెను. వారు కులమువారి నిర్బంధమునకు భయపడి "అయ్యా! నీవు వర్ణ భ్రష్టుని కుటుంబము నింట నుంచుకొని యాదరించుచుండుటచే సభాపతులు నిన్ను జాతినుండి వెలివేసిరి. కావున మేము వచ్చుటకు వీలుపడ"దని పలికి విచారపడిరి. ఆబ్రాహ్మణుడు చింతించుచు నిల్లు చేరి నిట్టూర్పులు విడుచుచు పరి పరి విధముల జింతించుచుండెను. జ్ఞానదేవు డతనిని జూచి "స్వామి! చింతా క్రాంతుడవై యోచించు చుంటివేమి? నీకు గలిగిన యాపద యెట్టిదో తెలియజేయు"మని యడిగెను. ఆ బ్రాహ్మణుడు "నాయనా! ఏమని తెలుపవలెను? వ్యర్థముగా నా బ్రాహ్మణత్వము మునిగి పోవునట్టి కాలము తటస్థించినది. మిమ్ము నాయింట నుంచుకొని యాదరించినందుల కీమూర్ఖ బ్రాహ్మణులు నామీద కోపించి నన్ను జాతినుండి బహిష్కరించినారు. నేడు నా తండ్రి శ్రాద్ధము. బ్రాహ్మణులు రాకపోయిన శ్రాద్ధ కర్మ వ్యర్థమగును. ఏమి చేయుటకు దోచక విచారించుచున్నా"నని పలికెను.

జ్ఞానదేవుడు పశ్చాత్తాపపడి యిట్టి దుష్టులను, ధర్మభ్రష్టులను సర్వోత్కృష్టులనుగా భావించి పూజించుట యవివేక మనెను. ఆ బ్రాహ్మణుడు "నీమాట వాస్తవమేకాని లోక వ్యాపారములకు లోబడి యున్నంతవరకు లోకులు నడచినట్లే నడువవలసియుండును. లేదేని సన్యాసము దీసికొనవలసివచ్చును. అందున నిందున లేక నిలిచినచో రెంటికి జెడిన రేవడివలె నపవాదమునకు గురి కావలసివచ్చు" ననెను. జ్ఞానదేవుడు "స్వామీ! బ్రహ్మమును దెలిసికొన్న వాడే బ్రాహ్మణు డనియు, బ్రాహ్మణత్వమునకు తపస్సే కారణమనియు, గుణమే ప్రధానముకాని కులము ప్రధానము కాదనియు సప్రమాణముగా మహిషముచేత జెప్పించిన నీమూర్ఖ బ్రాహ్మణులకు బుద్ధి రాలేదు. ఏమిచేసిన వీరికి దెలివి వచ్చునో తోచుట లేదు.

ఇనుముతో గూడిన నిప్పుగూడ సమ్మెటపోట్లు దిన్నట్లు మా సహవాసముతో నిరపరాధుడవగు నీవు గూడ దుఃఖము ననుభవింపవలసి వచ్చిన"దని విచారపడెను. ఆ బ్రాహ్మణుడు "పరమార్థ విషయమై నీవన్నట్లు మన కీవిప్రులతో బని లేదు.కాని పితృ దేవతల కర్పించిన యన్నమును బ్రాహ్మణులే భుజింపవలెననియు, నితరులు భుజింపరాదనియు, నట్లు భుజించినచో కర్త కుటుంబ సహితముగా రౌరవాది నరకము ననుభ వించుననియు కర్మకాండమునందు విధింపబడి యుండుటవలన విచారింప వలసివచ్చిన"దనెను. జ్ఞానదేవుడు "పితృ దేవతల కర్పించు పదార్థమును పితృ దేవతలైనను, సద్బ్రాహణులైనను భుజింపవలసినదేకాని యిట్టి వేషధారులు భుజింపకూడదు. వేదముల నధ్యయనముచేసి వాని యర్థముల గ్రహించి గ్రహించిన ప్రకారముగా వర్తించుచు బ్రాహ్మణోత్తములకే శ్రాద్ధముల

బ్రహ్మ జ్ఞానసంపద నొందిన యందు భోజనము పెట్టవలసినదని స్మృతులయందు విధించియుండుట జూడ లేదా" యనెను. అందులకు బ్రాహ్మణుడు "లోకమున పితృ దేవతలను రప్పింపగలిగిన సమర్థులను, స్మృతులయందు జెప్పబడిన లక్షణములు గల సర్వోత్తములగు బ్రాహ్మణులను గని పెట్టి తేగల బుద్ధిమంతులును లోకములో నుండుట యరుదు. అందులకయి మనము ప్రయత్నముచేయుట వ్యర్థ" మనెను. జ్ఞానదేవు "డొక వేళ పితృ దేవతలే నిమంత్రణమున కొప్పుకొని వచ్చినచో వారిని పూజించి భోజనాదులతో సంతుష్టి పరచుట కే దేని యాటంక మున్నదా? యనెను. బ్రాహ్మణుడు "వారికి భోజనములు పెట్టి సంతుష్టి పరచుట కాటంక మేమి? వారికొరకే గదా మన మీశ్రాద్ధ మొనర్చుట? ప్రత్యక్షముగా పితృ దేవతలే వచ్చి మన పూజ నంగీకరించినచో శ్రాద్ధము సఫలత నొందుననుటకు సందేహ మున్నదా" యనెను. జ్ఞానదేవు "డట్లయినచో బితృదేవతలనెల్ల నిక్కడ కిప్పుడే రప్పింతును. నీవు శ్రాద్ధమునకు వలసిన సమస్త పదార్థములను సిద్ధము చేయు" మని యతనిని సమ్మతింపజేసి, యక్షతలు దీసికొని, పైకిజూచి, బ్రాహ్మణుని యింటికి వచ్చి శ్రాద్ధమును నెర వేర్చునట్లు పితృ దేవతలకు నిమంత్రణము చెప్పెను. వెంటనే పితృ దేవతలు విమానము లెక్కి యాకాశమార్గమున నా బ్రాహ్మణుని యింటికి వచ్చిరి. ఆ బ్రాహ్మణుడు దివ్య తేజోమూర్తులైయున్న పితృ దేవతలను కనులపండువుగా దర్శించి, భక్తి ప్రపత్తులతో వారి నందర నుచితాసనముల గూర్చుండబెట్టి, యర్ఘ్య పాద్యాది

విధులతో బూజించి, విస్తళ్ళు వేసి సమస్త పదార్థములను వడ్డించి "పితృ రూపో జనార్దన" యన్న వచనమును జెప్పి, యాపోశనము వేసెను. పితృదేవత లందరును పరమానంద భరితులై భోజనములు చేయ సాగిరి. ఆ గ్రామములోని వైదికు లెల్ల మధ్యాహ్న వేళ నకస్మాత్తుగా నా బ్రాహ్మణుని యింటికి వచ్చిన దివ్య విమానములను జూతి యచ్చెరువంది, పరుగెత్తివచ్చి, తమ శరీరకాంతులతో నా గృహము సంతయు వెలిగించుచు వరుసగా బీటలమీద గూర్చుండి భోజనములు చేయుచున్న పితృదేవతలను జూచి, యాశ్చర్యచకితులై, యేమియు దోచక నిలుచుండిరి. పితృదేవలు భుజించి సంతుష్టి నొందిన పిదప బ్రాహ్మణుడు వారికి పాద ప్రక్షాళనము చేసి దక్షిణ తాంబూలముల నిచ్చి భక్తిప్రపత్తులతో నమస్కరించి, స్వస్థానములకు వెళ్ళవచ్చునని వినయముతో బలికెను. పితృదేవతలు సంతసించి యతనిని "పుత్ర వంతుడవై చిరాయుష్మంతుడవై సకల సంపదలతో సుఖింతువు గాక" యని యాశీర్వదించి, విమానము లెక్కి యాకాశమార్గమున బోయిరి. పైఠణపురవాసు లీవినోదమును జూచి పరమాశ్చర్యముతో "ఓహో! ఎంతటి యాశ్చర్యము! ఇట్టి వింత యెన్నడును జూడ లేదు. పితృ దేవతలే వచ్చి శ్రాద్ధమును సార్థక మొనర్చినపుడు చెప్ప వలసిన దేమున్నది? దేవుడే వచ్చి నైవేద్యము నారగించిన పూజారి మిడకరించినట్లు పితృ దేవతలే మంత్రణమున కొప్పుకొని శ్రాద్ధమును బ్రాహ్మణులు గుటకలు మ్రింగు చున్నారు. వీరి మూర్ఖత్వమే వీరి నింతకు దెచ్చిన "దని పరి పరి విధముల బలికిరి. బ్రాహ్మణు లంతట తెలివి దెచ్చుకొని "ఆహా! ఈ నివృత్తి దేవుడును, జ్ఞానదేవుడును, సోపాన దేవుడును, త్రిమూర్తులు. ముక్తాబాయి సాక్షాత్పరాశక్తి, వీరే జీవన్ముక్తులు. అజ్ఞానులమై వీరి మహత్త్వమును గుర్తింపలేక మన మపరాధము చేసి యూరక పాపము కట్టుకొంటి" మని పశ్చాత్తాపపడి, జ్ఞానదేవుడు మొదలగు వారి పాదములకు సాగిలబడి తమ నేరమును మన్నింపవలెనని యనేక విధముల బ్రార్థించిరి.

జ్ఞాన దేవుడు వారిని జూచి "అయ్యలారా! కుల భ్రష్టులగు మాకు కుల శ్రేష్ఠులని ప్రతిష్ట వహించిన మీరు నమస్కరించుట యుక్తము కాదు. మమ్ము దాకి నమస్కరించినచో మీ రగ్ని ప్రవేశము చేసి దేహ త్యాగమే చేసికొనవలసి వచ్చును. మీకును మాకును హస్తిమశకాంతరము గలదు. మమ్మొందుల కన్యాయముగా పరిహాసము చేసెద" రని పలికెను. బ్రాహ్మణులు " తెలివి

తక్కువ వలన మేము చేసిన తప్పిదము నెల్ల మన్నించి మమ్మెటులయిన రక్షింపు" మని ప్రార్థించిరి. అందులకు జ్ఞానదేవుడు "ఆహా! ఆషాఢభూతి విద్యలలో మించిన వారు లేరు. మీ పని అందిన జుట్టు, అందకున్న కాళ్లు పట్టుకొనుట. మీ ముఖముల జూచినను పాపమే. పితృదేవత లారగించిన పవిత్ర స్థలమున మన మీవంటి కుత్సితులు నిలువ పాత్రులు కారు. ఇచట నిలువక వెడలిపొం" డని కసరుకొనెను. బ్రాహ్మణులు దీనులై "స్వామీ! మావంటి పామరు లోక వేళ తెలివి లేక తప్పిదములు చేసిన నీ వంటి "పెద్దలు మన్నింపక త్రోసిపుచ్చిన మా గతి యేమి? ఇక మమ్ము రక్షించు వారెవ్వరు? ఎట్లయిన మా యపరాధమును మన్నించి మమ్ము శిష్యులనుగా బరిగ్రహించి కృతార్థులనుగా జేయవలె" నని కంట దడి పెట్టి యనేక విధముల బతిమాలిరి.

జ్ఞాన దేవుడు వారికి బుద్ధివచ్చినందులకు సంతసించి, వారి నేరములను మన్నించి, భయపడవలదని యోదార్చి, పితృ దేవతలు భుజించిన స్థలమున విస్తళ్లు వేయించి, బ్రాహ్మణుల నెల్ల గూర్చుండ జేసెను. వారి ప్రార్థన ప్రకారము తన యన్నయు, దమ్ముడును, తండ్రియు, తానును వారి పంక్తిని గూర్చుండి భుజించిరి. బ్రాహ్మణులెల్ల వారి మీది యీర్ష్యను వదలి యొకనాడు సభ చేసి "ఈ పరమ పవిత్రులగు మహాత్ములకు ప్రాయశ్చిత్తమా! వీరి పాద తీర్థమే ముల్లోకములను పావన మొనర్చు గంగా జలము. వీరి పాదధూళి సోకిన స్థలమే దివ్య స్థలము. వీరు సాక్షాత్పర బ్రహ్మ స్వరూపులు. వీరిని సేవించిన మోక్షము సులభముగా ప్రాప్తించు" నని నిశ్చయించి యొక శుభ మహూర్తమున వారి కుపనయనములు చేసి, నిరాక్షేప నిరూపణమును వ్రాసి యిచ్చిరి. జ్ఞానదేవుడు మొదలగు వారు వారి ప్రార్థన పై వారికితత్త్వోప దేశము చేసిరి.

## జ్ఞానదేవుడు జ్ఞానేశ్వరీయము అనుభవామృత మను గ్రంథములను రచించుట.

జ్ఞానదేవుని కరస్పర్శచే సర్పవేది సోకగనే బంగారమగు నినుము వలె దున్నపోతు సంచిత కర్మముల నుండి విము క్తి నొంది బ్రహ్మానందము ననుభవించుచు వేద వేదాంతముల సారాంశము నధ్యయనము చేయుచుండెను. ఒకనాడు జ్ఞానదేవుడు నివృత్తి దేవుని జూచి "అన్నా! బ్రహ్మజ్ఞాన ముదయించుటచే నీ దున్నపోతు రహస్యమగు శ్రుత్యర్థము

వెల్లడైనచో కర్మ మార్గము పూర్తిగా నశించును. కర్మాసక్తి లేనిచో లోకమున యజ్ఞ యాగాది కర్మలు నిలిచి పోవును. గాన గొన్ని యనర్థములు గలుగును. కాబట్టి యీ మహిషము నిచ్చట విడిచి పెట్టి పోవుటకు వీలు లేదు. మన వెంట దీసికొని పోవుట మంచి"దని పలికి, యతనిని సమ్మతింప జేసి, యా యెనుబోతును దీసికొని, యటనున్న బ్రాహ్మణుల సెలవంది, యలకావతికి సకుటుంబముగా బయలు దేఱెను. వారు మహాసల క్షేత్రమునకు బోయి ప్రవర తీర్థమున స్నానము చేసి మోహనరాయ స్వామిని దర్శించి, పాషండ మతమును జయింప నెంచి యట కొన్ని దినములు నిలిచిరి. ఒకనాడు జ్ఞానదేవుడు వేదాంత విషయము నుపన్యసించు చుండెను. మహా జను లెల్ల రతనికి నమస్కరించి, భగవద్గీతార్థము ను విపులీకరించు మని ప్రార్థించిరి. అందరకును దెలియునట్లు 'జ్ఞానేశ్వరీయ' మను ప్రాకృత వ్యాఖ్యానమును జేసి, మోహనరాయస్వామి ఆలయము లో సభ జేసి దానిని వినిపించెను. ఆకాశము నుండి మేఘ గంభీర స్వరమున "ఆహా! నీ దయా గుణము నేమని కొనియాడ వలెను? పూర్వమర్జునునకు కృష్ణ రూపమున బోధించిన విధమున నిప్పుడీ రూపమున భగవద్గీతకు ప్రాకృత వ్యాఖ్యానము చేసి రహస్యముల నెల్ల వెల్లడించి లోకము నుద్ధరించితివి. ఈ గ్రంథమును జదివినవారెల్ల నిస్సందేహముగా సదానంద సామ్రా జ్యము ననుభవింపగల" రను వాక్యములు వినబడెను. జనులామాటలు విని, యాశ్చర్యపడి, శ్రీకృష్ణపరమాత్మయే మరల నీలోకమున ధర్మము నుద్ధరింప నవతరిం చెనని యెంచి, జ్ఞానదేవునకు సాష్టాంగ నమస్కారము చేసి, సంతోషాతిశయమున నృత్యము చేసిరి. కంకణము చేత రత్నమును రత్నముచేత గంకణమును ప్రకాశించునట్లు జ్ఞానేశ్వరీయమను వ్యాఖ్య భగవద్గీతయు భగవద్గీత చేత జ్ఞానేశ్వరీయమును పరస్పర శోభగాంచెను.

ఒకనాడు నివృత్తిదేవుడు జ్ఞానదేవుని జూచి "తమ్ముడా! భగవద్గీతకు ప్రాకృత వ్యాఖ్యాన మొనర్చి మహోపకారము చేసితివి. దాని కనుకూలముగా ననుభవ విషయముల నెల్ల దెలుపుచు మరి యొక గ్రంథమును రచించిన మఱింత యుపకారముగా నుండు"ననెను. జ్ఞానదేవు డందులకు సమ్మతించి, శ్రీకృష్ణావతారమున బ్రహ్మ యొక్క గర్వము నణచుటకు గో గోపసంఘమును నిర్మించినట్లు పాషండుల యొక్క గర్వము నణచివేయుటకై యమోఘ విషయముల నెల్ల జేర్చి పద్యరూపమున 'అనుభవామృత' మను మహా

గ్రంధము నొక దానిని మృదు మధురముగా రచించెను. ఆ గ్రంధము వలన సూర్యోదయ మగుటతో పటాపంచలగు మంచువలె పాషండ మతము పటా పంచ లయ్యెను. వారచటి నుండి బయలుదేరి యలకావతికి సమీపమున నున్న వనము జేరి భగవద్ధ్యానము జేయుచుండిరి. దున్న పోతు వేదమును జదువుచు నాయువు దీరుటచే వారి కందరకి ముట్టి కాళ్లతో వందనములు చేసి పురుష సూక్తమును జదివి యనాయాసముగా ప్రాణములను వదలెను. దాని దేహము నుండి యొక దివ్యజ్యోతి బయలు దేరి జ్ఞానదేవుని యందు జొచ్చి నిత్యానందకరమగు మోక్ష సామ్రాజ్యము నొందెను. వా రత్యంత ప్రీతితో నా మహిషము యొక్క దేహమును విధ్యుక్తముగా సమాధి చేసి యా సమాధిని బూజించి దానికి 'శోభ' యని పేరిడి యచటి నుండి బయలు దేరి యలకావతి జేరిరి.

అలకావతి రాజు వారి రాక విని పరమానందమున నా పట్టణము సంతయు నలంకరింప నాజ్ఞాపించి, మంగళ వాద్యములతో వారిని పల్లకీల మీద దీసికొని వచ్చి గొప్ప యుత్సవము జేసి యిల్లుచేర్చెను. అచటి బ్రాహ్మణులు ప్రతిష్ఠాన పురమున జరిగిన విషయముల నెల్ల నెప్పటి కప్పుడు దెలిసికొని యుండుట వలన సోపానదేవు డిచ్చిన శుద్ధ పత్రికను దీసికోని, వారిని జగద్గురువులుగా భావించి పరమానందముతో నృత్యము చేసిరి. రాజునకు గలిగిన ఆనందమున కంతము లేదు. అతడు బ్రాహ్మణుల కెల్ల సంతర్పణము చేయించి విఠోబా కుటుంబము నెల్ల సత్కరించి వారి యాజ్ఞాను సారము వర్తించు చుండెను. బ్రాహ్మణు లే కాక సమస్త వర్ణముల వారును వారి ధర్మోపన్యాసముల నత్యంత శ్రద్ధతో వినుచు వారిని నిరంతరము సేవించుచు పరమానందము ననుభవించు చుండిరి.

## చాంగదేవుడు జ్ఞానదేవుని జూడవచ్చుట

బ్రహ్మ యొక్క ప్రథమ యామమున స్వర్గ లోకాధి పత్యమును జేసిన ఇంద్రులు పదునాలుగు మంది కర్మ వశము చేత కారాగార బద్ధులై కష్టపడు చుండిరి. ఒకనాడు నారద మహర్షి యటకు వచ్చెను. వారు పరమ భక్తితో నతనికి నమస్కరించిరి. అతడు వారిని చిరునవ్వు నవ్వి, హరి కీర్తనలు బాడుచు పరమానందమున నృత్యము చేయ సాగెను. వారిలో చాంగుడను నింద్రుడు నారదుడు తమ్ము జూచి నవ్వినందులకు కారణ మూహించి,

భగవద్భక్తి లేక కాలమును వ్యర్థ పుచ్చుట వలననే తమ కట్టి దుర్గతి సంభవించిన దని యెంచి, చేతులు జోడించి, "స్వామీ! నా యవివేకమున నాత్మ తత్వమును విచారింపక చాల దినముల నుండి యీ నరక బాధ ననుభవించు చున్నాను. దయయుంచి యీ కష్టము నుండి విముక్తి జెంది జనన మరణ రహిత మగు శాశ్వతానంద పదము నొందుటకు దగిన మార్గమును దెలియజేయు" మని దీనముగా బ్రార్థించెను, అతనిని సాదర శీతలేక్షణములు వీక్షించి "చాంగ దేవా! ఈ దేహముతో నీలోకమున నున్నంత వరకు నీ కోరిక పూర్తి కాదు. ఈ దేహమును వదలి భూలోకమున బుట్టి పాండురంగ క్షేత్రమున విఠోబా రూపమున భక్త రక్షణార్థమై యిటుక మీద నిలువబడి యున్న పరబ్రహ్మమూర్తిని భక్తితో సేవించినగాని నీకు మోక్షము సిద్ధింపదు. దేవతలు నేరుగా మోక్షమున కర్హులు కారు. ఎట్టి వారైనను ముక్తి నొందవలె నన్నచో మానవ రూప మెత్తక తప్పదు. కావున భూలోకమున మానవుడవై జన్మించి పాండురంగని భక్తితో భజించుము. నీకు తప్పక మోక్షము సిద్ధించును. ఇది నిశ్చయ" మని పలికెను. చాంగ దేవుడు పరమానంద భరితుడై "స్వామి! ఈ దేహమును విడిచి భూలోకమునకు వెళ్ళుటకు సదుపాయమును దెలుపు" మనెను. నారదు డతనికి ద్వాదశాక్షరీ మహామంత్రము నుపదేశించెను. చాంగదేవుడా మంత్రమును భక్తితో విన్నతోడనే దేహమును వదలి భూలోకమ్మున నతి వృద్ధు డగు విఠోబా రుక్మియ ను నతనికి కుమారుడవై జన్మించెను. ఆ వృద్ధుడు తనకు లేక లేక కలిగిన కుమారుని జూచి యత్యంత ప్రీతుడై వానిని గాపాడుచు క్రమము గా నుపనయనము చేసెను. పదియారవ సంవత్సరమున వాని కొక్క చక్కని చుక్కను దెచ్చి పెండ్లి చేసెను. వాడు పూర్వ జన్మ వాసనా విషేషమును బట్టి యిచ్ఛా మాత్రమున నాకాశగమనము మొదలగు వినోదములు అనేకములు గావించుచు స్వేచ్ఛగా దిరుగు చుండును. అతని నోటి నుండి వెలువడు పలుకు లన్నియు ఫలించు చుండెను. కాలక్రమమున నరువది నాలుగు కళలును పదునాలుగు విద్యలును చాంగ దేవుడు చెప్పినట్లు వినుచుండెను. యమ నియ మాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణ సమాధు లను నష్టాంగ యోగములును సులభముగా సిద్ధించెను. అతని పేరన్న నవకోటి సిద్ధులు సహితము భయపడు చుండిరి. అతడు తనకు నూరు సంవత్సరములు నిండుగనే ప్రాణమును బ్రహ్మాండము నందు దాచియుంచి మృత్యువును

వంచించి మరల కొంత కాలమున కా ప్రాణమును దేహము లోనికాకర్షించి యధా ప్రకారముగా సంచరించు చుండెను. ఇట్లు చేయుటచే నతనికి వేయియు నన్నూరు సంవత్సరముల వయస్సయినను జరా మరణములు లేక నవయౌవనము తలచూపు చుండెను. అందు వల్ల ప్రజ లెల్ల నతనిని మహానుభావుడని యెంచి గౌరవించు చుండిరి. అతడు ఖాన దేశమున తపతీ నదీతీరమున నొక మఠము గట్టించి యందు పదునాలుగు వందల మంది శిష్యులు సేవింపగా వాసము చేయు చుండెను. నిరంతరము శిష్య ప్రశిష్యులతో గూడ స్నానార్థమై యాకాశ మార్గమున గోదావరీ తీరమునకు బోవువాడు. ఇంతటి మహిమ గలవాడయ్యు తన్నా శ్రయించిన వారికి జ్ఞానోపదేశము జేసి వారి వలన సేవింపబడు చుండెనేకాని తాను మాత్ర మెన్నడును సద్గురు సేవ చేసిన వాడు కాడు. లోకమున దన కంటే తెలిసిన వాడుకాని గొప్పవాడుకాని లేడని యెంచి మిక్కిలి గర్వించు చుండెను. అతని కంటికి యోగులును జ్ఞానులును తృణ ప్రాయులుగా గనబడు చుండిరి. ఒకనా డింద్రు డతనికి ప్రత్యక్షమై లోక రక్షణార్థమై భూలోకమున త్రిమూర్తులును నాది శక్తియు మానవ రూపమున నవతరింతు రనియు వారిని శరణు జొచ్చినచో ముక్తిగలుగు ననియు బోధించెను.

పైఠణపురమున జ్ఞానదేవు డొనర్చిన వినోదములనెల్ల జూచు చుండినట్టి యొక్క బ్రాహ్మణుడు తన దేశమునకు వెళ్ళి, చాంగ దేవుని కడకు బోయి, యతనికి సమస్కరించి, జ్ఞానదేవుడు సకుటుంబముగా పైఠణపురమునకు వచ్చుట మొదలుకొని పితృదేవతలను రప్పించి శ్రాద్ధమును నెర వేర్చుట వరకు గల విషయములనెల్ల విశదముగా దెలిపి, వారి మహత్త్వము ననేక విధముల గొనియాడెను. చాంగ దేవుడు కొంత యోచించి, యేమి చేయుటకును దోచక యేకాంతమున గూర్చుండి యుండెను.

అతని కింద్రుడు దెలిపియుంచిన విషయము గుర్తునకువచ్చి, యా త్రిమూర్తులు నాదిశక్తియే వీరై యుందురని నిశ్చయించెను. శిష్యులను కొందరిని బిలిచి జ్ఞానదేవుని దర్శించుటకై వెళ్ళవలెననెను. శిష్యులు జ్ఞానదేవుని మహత్త్వమును వినియుండుటచే నతనిని దర్శించిన తమ గురువు ముక్తి నొందుగదా యని చింతించి, యచటికి వెళ్ళ కుండుటకై యొక తంత్రమును బన్ని "స్వామీ ! నీ విప్పుడే వెళ్లుట మంచిదికాదు, పత్రికా మూలమున నతని యభిప్రాయమును దెలిసి కొని తరువాత వెళ్ళవచ్చును.

లేనిచో పరువునకు లోపము వాటిల్లు" నని పలికిరి, అత డధ్యాత్మ తత్వవిచారము చేసి యహంకారమును నాశనము చేసినవాడు కాడు గనుక దురభిమాన సూచకములగు వారి మాటలకు దలయొగ్గి, తాళపత్రములను గంటమును దీసికొని, వారి నేమని సంబోధించుటకును దోచక, తన శిష్యులు నిద్దరిని బిలిచి, "మీరు పోయి వారి నలువురిని జూచి మాట్లాడి వారి స్థితిగతులను ఆచార వ్యవహారములను చక్కగా విచారించి వారియోగ్యతను గూర్చి యా గ్రామస్థులచేత నొక పత్రికను వ్రాయించి తీసికొని రావలసిన"దని చెప్పి, వట్టి తాటాకు చుట్ట నొక దానిని వారి చేతికిచ్చి, దానిని దీసికొని వెళ్ళి వారి కీయవలసినదని చెప్పెను.

ఆశిష్య లచటినుండి బయలు దేరి, తమ విద్య ప్రభావముచే నాకాశమార్గమున నలకావతిజేరి సిద్ధోపంతు గృహమునకు వచ్చిరి. జ్ఞానదేవుడు నివృత్తిదేవుని జూచి "అన్నా! చాంగ దేవుని శిష్య లిద్ద రిచటికి కార్యార్థమై వచ్చిరి. చాంగ దేవు డుత్తుంగ ప్రభావము గలవాడని పలుకుచుండుట వినియుంటిమి. మన కతని దర్శనము కొలది కాలములో లభింపనున్నది. తన శిష్యులచేత నత డొక తాళపత్రపు చుట్ట నంపియున్నాడు. అందులో నొక యక్షరమైనను లే"దని చెప్పెను. చాంగ దేవుని శిష్య లామాటలు విని యాశ్చర్య చకితులై జ్ఞాన దేవుని సమీపించి, యతనికి నమస్కరించి "స్వామీ! నీవు పర బ్రహ్మస్వరూపుడవు; సర్వజ్ఞుడవు. నీకు దెలియని విషయములు లేవు. మేము వచ్చిన విషయము నప్పుడే తెలిసికొంటివి. నీ మహత్త్వమును గొనియాడ మాతరముగా "దని స్తుతించి, తాటాకు చుట్ట నతని యెదుటబెట్టి నిలుచుండిరి.

జ్ఞానదేవుడు తాళపత్రములను విప్పి యది వట్టిదిగా నుండుట జూచి నివృత్తిదేవునకు జూపి "చాంగ దేవుని వివేకమును గు గుర్తించు" మనెను. నివృత్తి దేవుడు చిరునవ్వుతో నాపత్రమును దీసికొని యిటు నటు ద్రిప్పి యాశ్చర్యపడి "తమ్ముడా! ఈ చాంగ దేవుడు మరుద్గణాంశమున జన్మించినవాడు. ఇతనికి పదునాలుగు విద్యలు నరువది నాలుగుకళలు కరస్థములు. అష్టాంగ యోగములు బాగుగా దెలియును. పదునాలుగువందల సంవత్సరములనుండి దేహమును భద్రముగా గాపాడుకొనుచు మృత్యుభయము లేక విచ్చలవిడిగా సంచరించుచున్నాడు. ఆత్మజ్ఞానమును మాత్రము సంపాదించ లేదు. దురభిమాన మతనిని వదల లేదు. అందువలన

మనల తీర్థస్వరూపులనిగాని, చిరంజీవులనిగాని సంబోధించుటకు తోచక మనకు లేఖనము వ్రాయుటకు సంశయించి, తన యాత్మజ్ఞానశూన్యతను తెలియజేయుటకై వట్టి తాళపత్రముల నిచ్చి పంపినా"డని చెప్పెను. జ్ఞానదేవుడు మందహాసముచేసి, తాటాకు గంటము దీసికొని యతనికి "స్వస్తిశ్రీ చాంగ దేవునకు, చిత్తగింపవలెను. సచ్చిదానంద పరబ్రహ్మమంతటను నిండియుండగా నల్పమనియు, నధికమనియు, గొప్పవాడనియు, చిన్న వాడనియు, నధికారి యనియు, సేవకుడనియు, మిత్రుడనియు, శత్రువనియు ద్వైతభావ మెట్లుండునో యోచింపుము. శరీర మెవ్వరిది? అందున్న వాడెవ్వడు ? ఈ విషయములను పరిశోధించి చూడుము. యోగ విద్యలవలన మోక్షము సిద్ధింపదు. ఇంద్రియములకు మనస్సే రాజు. రాజును బంధించి చెరసాలయం దుంచిన భటు లెల్ల పారిపోవుదురు. బ్రహ్మాండము నందుగల పదార్థము లెల్ల పిండాండమునందు గలవు.కాని మాయ యావరించి యుండుటవలన నవి గాన రాకున్నవి. ఆ మాయయొక్క మహిమచేతనే నేను నాదియన్న భ్రాంతి గలుగు చున్నది. వివేకముతో తత్వమును విచారింగా నా భ్రాంతి తీరి పోవును. ద్వైతమును వదలి యద్వైతమును జూచినచో సర్వమునకు కారణభూతమగు పదార్థమేదో యదియే నీకును నాకును కారణమై యున్నదని తెలియు"నని తత్వవిషయము నెల్ల నరువది యైదుశ్లోకము లలో వ్రాసి, దానిని చాంగ దేవుని శిష్యులకిచ్చి, యా పత్రమును వారి గురువున కిమ్మని చెప్పెను. వారు జ్ఞానదేవునకు నమస్కరించి, మరల నాకాశమార్గమున గురుసన్నిధి జేరి, జ్ఞాన దేవు డిచ్చిన పత్రము నతనియెదుట బెట్టిరి. వారి మహత్వమును గూర్చి వివరించిరి. వారి తేజో విశేషములను జూచిన నిజముగా తిమూర్తులు, పరాశక్తియే యవతరించి యుందు రనుటకు సందేహము లేదనిరి.

## జ్ఞానదేవాదులు గోడనెక్కి చాంగదేవు నెదుర్కొనబోవుట

చాంగ దేవుడు వారు దెలిపిన విషయముల నెల్ల విని, తాళ పత్రమును జదివి, యతని గర్వ రాహిత్యమును బ్రశంసించి, యందులోని విషయములను పలుమారు జదివి తనకు బోధపడకుండుటచే వారు తనకంటె గొప్పవారే కాక సంపూర్ణ జ్ఞానులనియు వారిని సందర్శించి పత్రమునందలి విషయముల యర్థమును దెలిసికొనవలె ననియు నిశ్చయించెను. తన

నిశ్చయమును శిష్యులకు దెలిపి, తన విద్యాబలమున గొప్ప సర్పముల నలంకరించుకొని భయంకరమైన పెద్దపులి నొక్కి బయలు దేఱెను. అతని శిష్యులును పెద్దపులుల నెక్కి గొప్ప సర్పములను బట్టుకొని ధ్వజము లెత్తించుకొని గురు ప్రభావమును వర్ణించుచు నాడంబరముగా గురువు ననుసరించిరి. వారి యాడంబరమును జూచి ప్రజ లాశ్చర్యపడుచుండిరి. చాంగ దేవు డలకావతి కైదు క్రోసుల దూరమున నిలిచి, జ్ఞానదేవునకు తన యాగమనవార్తను దెలుపుటకు కొందరు శిష్యులను బంపెను. వారు బోవునప్పటికీ చాంగ దేవుడు తమకడకు వచ్చుచున్న విషయమును దెలిసికొని నివృత్తిదేవుడు మొదలుగాగల నలువురు నొక మొండిగోడ మీద గూర్చుండి చూచుచుండిరి. చాంగ దేవుని శిష్యులు వారిని జూచి, నమస్కరించి, తమ గురువు వర్తమానమును దెలియ జేసిరి. జ్ఞానదేవుడు మున్నగువారు చాంగ దేవు నెదుర్కొనుటకై బయలు దేరుచుంటి మనిరి. ప్రజలు మూకలుగట్టి వేడుక చూచుటకై రాసాగిరి. జ్ఞానదేవుడు తాము గూర్చున్న మొండిన గోడను జూచి "సిద్ధ వర్యుడని ప్రసిద్ధి వహించిన చాంగ దేవుడు శిష్యప్రశిష్యులతోగూడ వ్యాఘ్రము నెక్కి మనకడకు వచ్చుచున్నాడు. ఆయనను మనము గౌరవింపవలెను. కాన నీవు త్వరితముగా నడువవలె" ననెను.

వెంటనే గోడ మహావేగమున నడువసాగెను. జను లాశ్చర్యపడి కరతాళ ధ్వసులు చేయుచు జయ జయ ధ్వనులతో గంతులు వేయసాగిరి. చాంగ దేవు డెదురుగా వచ్చి యా వినోదమును జూచి యాశ్చర్య చకితుడై నిర్జీవమగు వస్తువుమీద గూర్చుండి వచ్చుచున్న సద్గురు శిఖామణిముందు సజీవ వాహనము నెక్కి పోవుట తన పరువునకు దగనిపని యని యెంచెను. పులిమీదనుండి దిగి చేతులు జోడించి నడచివచ్చి, యా నలువురకు సాష్టాంగముగా నమస్కరించెను. శిష్యులును దిగి పాదచారులై యతని వెంట వచ్చి జ్ఞానదేవుడు మొదలగు వారికి నమస్కరించి దూరముగా నిలుచుండిరి. పెద్దపులులు వెడలి పోయెను. నివృత్తి దేవాదులు గోడనుండి క్రిందికిదిగి చాంగ దేవునకును శిష్యులకును ప్రతినమస్కారములు చేసి, చాంగ దేవు నాలింగనము చేసికొని యొక్క మఱ్ఱి చెట్టుక్రింద విశ్రమించి సరస సల్లాపములతో కొంతతడవు సంతోషము ననుభవించిరి. నివృత్తి దేవాదులు భగవద్ధ్యానము చేయుచు, మంత్రముల జపించుచు, భగవంతుని స్తుతించుచు, సాలగ్రాముల బూజించుచు, రామాయణాది సద్గ్రంథముల బారాయణము

చేయుచు నిశ్చింతగా నుండిరి. చాంగ దేవుడు వారి సామాన్య చర్యల కాశ్చర్యపడి, యింతటి సామాన్య క్రియ లొనర్చు వీ రద్భుత క్రియల నెట్లు జేసియుందురని యెంచి, జ్ఞానదేవుతో "స్వామీ! మీరంద జీనిర్జీవ వాహణము నెట్లు నడిపితిరో తెలుపు"మనెను. జ్ఞానదేవుడు "ఈవిద్య గోప్యమైనది. అయినను నీకు కొంత తెలిపెదను. శ్రద్ధగా వినుము. భగవత్సంకల్పము లేక గడ్డిపోచయును కదలదు. ఎంత గొప్ప కార్యమైనను భగవంతుడు తలచినచో సులభముగా జరుగును. శ్రీరామావతారమున సముద్రమున కొండలు బెండులవలె దేల్చి వానరులు లంకను ముట్టడించిరి.

సూర్యకిరణములు సోకినంతనే చీకట్లు మటుమాయమై పోవునట్లు భగవ దనుగ్రహము గలిగినంతనే బుద్ధి నావరించి యున్నట్టి యజ్ఞానము తొలగిపోవును. ప్రపంచమంతయు భగవల్లీలయేకాని వేరుకాదు. అతని శక్తిని వర్ణింప వీలుపడదు. సర్వమును తానై, సచ్చిదానంద స్వరూపుడై, ఆద్యంత రహితుడై, అప్రమేయుడై, సర్వశక్తుడై వెలయుచున్న పరమాత్మ తన మహత్త్వముచే వేనినైన నడుపగలడు. ఆకాశము తాను లేకపోయినచో సకలలోకములకు నవకాశమే లేకుండు ననుచున్నది. వాయువు తాను లేకున్న ప్రాణులకు నిలువ వీలు లేదనుచున్నది. అగ్ని తాను లేకున్న ప్రపంచ వ్యవహార మేమియు జరుగదనుచున్నది. జలము తాను లేకున్న నేజంతువైనను జీవింప లేదనుచున్నది. భూమి తాను లేకున్న జీవ కోటి కంతటికిని పట్టు లేకపోవు ననుచున్నది. ఇట్లు జడములగు పంచ భూతములే ప్రపంచ కార్యములనెల్ల నడుపుచున్నపు డీమహాభూతముల కన్నిటికి నాధారభూతుడై వెలయుచున్న పరమాత్ముని కీగోడను నడుపుట గొప్పకా"దని పలికెను. చాంగ దేవు డదియంతయు జక్కగా విని, సంతోష భరితుడై, చివాలున లేచి, యతని పాదములకు నమస్కరించి, చేతులు జోడించి "స్వామీ! నేనజ్ఞానాంధకారములో జిక్కి సుజ్ఞాన మార్గమును గానక చిత్రశ్రమ పడు చుంటిని. నా మీద పరిపూర్ణకటాక్ష ముంచి కృతార్థునిగా జేయు" మని ప్రార్థిం చెను.

జ్ఞానదేవుడు చాంగ దేవు నాదరించి "అయ్యా! నీవు మరుద్గణాంశ సంభూతుడవయ్యు షడ్చక్రములను భేదించి యోగసిద్ధి నొందియు మోహకరములగు జాల విద్యలచేత జనులను భ్రమింపజేసి గౌరవమును వహించితివేకాని యాత్మ తరుణోపాయమును గుఱించి యెంతమాత్రమును

యోచింపకుంటివి. పనికిమాలిన విద్యలచే వ్యర్థముగా పలునాలుగువందల సంవత్సరముల కాలమును పాడు చేసితివి. నీ యవివేకము నేమనవలెను. దురభిమానముచే దుస్సాంగత్యము గలిగి కాలమును వ్యర్థపుచ్చు నిరర్థకులు దుర్గతిని బొందుదురు. ఇప్పుడు మన యిద్దర సమావేశ మగ్ని కర్పూరములు బెరసినట్లయినది. కొంత సేపటి కీ రెండును మాయమై పోవు"నని చెప్పెను. చాంగ దేవుడు మరల నమస్కరించి యెట్లయిన తన్ను భవసాగరము నుండి తరింపజేయుమని యనేక విధములు బ్రార్థించెను.

ముక్తాబాయి చాంగ దేవుని జూచి "అయ్యా! నీ వింత వరకు దురభిమానములో నున్నందున తత్వ విషయమై నీకు తెలియ లేదు. జాల విద్యలను గ్రహించుటలో నిచ్చిన శ్రద్ధలో సగమైనను తత్వ విషయమును గ్రహించుటలో నిచ్చియున్న నిప్పటి కెంతయో ప్రబుద్ధుడవై యుండువాడవు. జరిగిన దేదో జరిగిపోయినది. ఇంతటితో నైనను జాగ్రత్తపడి, నీ వెవ్వరైనదియు నీ కీ దురభిమాన మెట్లు వచ్చినదియు విచారించినచో సర్వ మాత్మ స్వరూపమే యనెడి యదార్ధ జ్ఞానము పట్టుబడి నీవు కడతేర గల" వని చెప్పెను. వారు గూర్చుండి తత్వ విషయమును గూర్చి మాటాడిన స్థలమున నున్న మరి చెట్టు నిప్పటికిని విశ్రాంతి వట మని వాడుచున్నారు.

జ్ఞానదేవుడు నివృత్తి దేవునితో "అన్నా! మధ్యాహ్నమైనది. చాంగ దేవుని శిష్యులతో గూడ భోజనమునకు మన యాశ్రమము నకు దీసికొని వెళ్ళుద" మని పలికి, వారి నెల్ల వెంట బెట్టుకొని బయలు దేరి మెల్లగా నలకావతి జేరి తన మఠమున నందరను దర్భాసనములపై గూర్చుండ జేసి భగవద్భజన జేయ నారంభించెను. ముక్తా బాయి చాంగ దేవుని దెహాభిమానమును బోగొట్టు నుపాయ మాలోచించు చుండెను. జ్ఞాన దేవుడు చాంగదేవునితో "శిష్యులతో గూడ స్నానాదులను ముగించి భోజనమునకు సిద్ధము క"మ్మనెను. చాంగ దేవుడు స్నానముచేసి వచ్చి నిత్య విధులు నిర్వర్తించుకొని శిష్యులతో గూడ వచ్చి మఠమును గూర్చుండెను. పంచాగ్నులు ప్రజ్వలింపుచున్న సోపానదేవుని వీపు మీద ముక్తాబాయి పక్వాన్నములను సిద్ధము చేయుచుండెను. చాంగ దేవుడు విస్మయ మంది వారి మహత్త్వము ననేక విధముల నభివర్ణించు చుండెను. ముక్తాబాయి సమస్త పదార్ధములను తయారు చేసి నిమిష మాత్రములో నెల్ల వారికిని వడ్డించెను. అందరును సంతుష్టిగా భుజించిరి.

చాంగ దేవుడు జ్ఞానదేవునితో "తాళ పత్రము నందలి విషయముల భావమును విపులముగా దెలియజేయు" మనెను. జ్ఞానదేవుడు "దీనిని నీ శిష్యుల చేతికిచ్చిన నిందులోని యర్థ మెవ్వడైనను తెలియజేయగల"డనెను. చాంగ దేవుడు పలునాలుగు వందల శిష్యులలో ప్రముఖుడగునొకని చేతికా తాళపత్రము నిచ్చి బాగుగా నాలోచించి తెల్ల వారు వరకు దాని యర్థమును దెలుపు మనెను. ఆ శిష్యుడు తక్కిన వారి కా విషయమును దెలిపెను. ఎవ్వరికిని దాని యర్థము తోచలేదు. శిష్యులెల్ల" మనము చాంగ దేవుడు గొప్పవాడని యాశ్ర యించి కొన్ని గొప్ప బూటకపు విద్యలు నేర్చినంత మాత్రమున నిగ్రహానుగ్రహ సమర్థులగు మహాత్ముల భావమును గ్రహించి చెప్ప గలిగినంత శక్తులము కాము. తల కొట్టుకొన్నను తాత్పర్యము తెలియుకున్నది. తెల్లవారి దీని యర్థమును చెప్పలేక పోయిన మన ప్రాణము మీదికే వచ్చును. మన శిష్యత్వ మితని కక్కర లేదు. ఈయన గురుత్వము మన కక్కర లేదు. మనము జాగ్రత్త పడి సెలవు వుచ్చుకొనుటమంచి" దని యాలోచించి యా యర్థ రాత్రమున నెవ్వరి తోను జెప్పక తిన్నగా బయలు దేరి పారిపోయిరి.

తెల్లవారగనే చాంగ దేవుడు లేచి శిష్యులెల్ల నేక కాలమున తప్పించుకొని పారిపోయి నందులకు మిగుల చింతించి, చక్రతీర్థమునకు బోయి, స్నాన సంధ్యా ద్వనుష్టానములను ముగించి తిరిగి వచ్చి జ్ఞానదేవాదులకు నమస్కరించి, తన శిష్యులెల్ల పారిపోయిన విషయమును దెలిపి, చేతనున్న తాళపత్రమును వారి యెదుట నుంచి, దాని యర్థమును దెలయజేసి కృతార్థుని జేయుడని యనేక విధముల ప్రార్థించెను. వారందరును శిష్యులు పారిపోవుట విని నవ్విరి. జ్ఞానదేవాదులు ముక్తాబాయితో "చాంగ దేవునకు తత్వోపదేశము చేసి కృతార్థునిగా జేయు" మనిరి.

## ముక్తాబాయి చాంగదేవునకు తత్వోపదేశము చేయుట

ముక్తాబాయి మందహాసము చేసి చాంగ దేవుని తన సమీపమున గూర్చుండ జేసికొని మృదుమధుర గంభీర భాషణములతో "నాయనా! సంసారమను కీకారణ్యమతి భయంకరమైనది. దాని నుండి బయట బడవలెనన్న యనేక యుపద్రవములు వాటిల్లుచుండును. అత్యంత ప్రయాసతో నాగమములను వృక్షచ్ఛాయల నాశ్రయించి, లౌకిక కర్మములనెల్ల

మాని పరలోక సుఖములకు ప్రధాన సాధనములగు నిత్య నైమిత్తికాది కర్మములను నిరంతరము ప్రతిఫలాపేక్ష లేక భగవత్ప్రీతిగా జేయుచు, దైవానుగ్రహమువలన పరిశుద్ధ చిత్తమును పొంది, భూమి, పర్వతము, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, పావురము, అజగరము, సముద్రము, మిడుత, తేనెటీగ, తుమ్మెద, యేనుగు, జింక, చేప, వేశ్య, కురరపక్షి, శిశువు, కన్య, శరకర్త, పాము, సాలెపురుగు, కందురీగ - వీనిగుణములను బాగుగా గ్రహించి, వీని నాదర్శముగా గొని యా ప్రకారముగా మెలగుచున్నచో ప్రత్యగాత్మ బ్రహైక్య సాక్షాత్కార విచారమున కధికారియై కడతేర గలడు. పరమార్థ విషయమున నాపదార్థముల గుణములను గ్రహించి యుపయోగించు టెట్లనెడి సంశయము నీకు గలుగవచ్చును. శ్రద్ధగా వినుము.

భూమి సమస్త జంతువుల కాశ్రయమై వారి కార్యముల కెల్ల సహించి యున్నట్లు ముముక్షు నన్ని వేళల నోర్పు వహించి వలయును. పర్వతము, తృణ, వృక్ష, గుల్మాదులు నదులు మున్నగు వానినెల్ల శిరమున వహించి జీవకోటి కెల్ల సుపకరించునట్లు స్వార్థము లేక పరుల విషయమై నిరంతర ముపకార స్మృతి గలిగియుండవలెను. జలము పారిశుద్ధ్య మాధుర్యాది గుణములచే స్నాన పానాదులకు యోగ్యమై యుండునట్లు సత్ప్రవర్తనముచే నెల్లప్పుడును శుచిర్భూతుడై యుండవలయును. అగ్ని యెప్పుడు జీకటితో జేరక తేజో మయమై యుండునట్లు నజ్ఞానముచే గప్పబడక సుజ్ఞాన విశిష్ఠుడై యుండవలయును. సమిధలు మొదలగు వానిచేత వెలుగునట్లు ముముక్షువు శుద్ధతపస్సుచేత వెలుగవలయును. తన కప్రయత్నముగా లభించిన వస్తువులను నిలువయుంచక తక్షణమే భక్షించునట్లు భావికాలా పేక్ష లేక యెప్పుడు దొరకిన దాని నప్పుడు వినియోగింపవలయును. అగ్నిహోత్రము పదార్థములందు రుచిపక్వము పెంచనట్లు ముముక్షువును తనకు లభించిన వస్తువులందు రుచి పక్వము లెంచరాదు. అరణిని మధించి ప్రజ్వలింప జేయునట్లు ముముక్షువు నిధి ధ్యాసరూపమధనముచే జ్ఞానమును ప్రజ్వలింపజేసి పరమాత్మను దర్శింపవలెను. అగ్ని తన్ను పాసించు వారి పాపములను నిరసించుచు తన కర్పించబడిన హవ్య కవ్యములనెల్ల స్వీకరించునట్లు ముముక్షువు తన్నాశ్రయించిన వారిపాపములను దొలగించుచు వారు సమర్పించిన పదార్థములను స్వీకంపవలెను. జీవుడు

దేవతిర్య జ్మనుష్యాది శరీరములందు బ్రవేసించి చంద్ర, కొరవి, చింత మొదలగు కాష్ఠ విశేషములందు జ్వాలా భేధములచేత నగ్ని ప్రకాశించునట్లు నానారూపములతో ప్రకాశించు చున్నాడు. వాయువు మంద వేగములు, సుగంధ మర్గంధములు, శీతోష్ణములు మున్నగు గుణములతో గూడి వీచుచున్నను ఆగుణము లెల్ల వాయువునకు సంసర్గ దోషమువలన గలిగినవేకాని సహజములు కానట్లు దేహమున నుండు నాత్మకు కర్మవశమున సంభవించు సుఖ దుఃఖాది వికారములెల్ల నజ్ఞానవశమున దోచునవేకాని సహజములు కావు. ముముక్షువు విషయ సుఖములు కనుకూలమగు నాహారములను విసర్జించి దేహధారణము వలసినంతమాత్ర మాహారమును భుజింప వలెను. ఆహారమును బొత్తిగా వదలిన దేహము క్షీణించును. శరీరము క్షీణించినచో మన స్థైర్యము చెడినమీదట నాత్మానుసంధానము జరుగదు. ఆత్మానుసంధానము లేనిచో గడతేరుటకు వీలు లేదు. కాన మితాహార మత్యావశ్యకము.

ఆకాశము సమస్త పదార్ధములందు నిండియుండియు దేనియందును దగులక విలక్షణమై యున్నట్లు పరమాత్మ సమస్త పదార్థముల బాహ్యాంతరములయందు నిండియున్న దయ్యును వాని కన్నిటికిని విలక్షణమై యున్నది. ఆకాశము తనయందు దోచునట్టి మేఘములు మెరుపులు మున్నగువానిని వేనిని స్పృశింపనట్లు పరమాత్మయు కాలవశమున దనయందు దోచు నుత్పత్తి స్థితిలయములను వేనిని పొందక సచ్చిదానందముగా బ్రకాశించును.

సూర్యుడు తన కిరణముల చేత జలము నాకర్షించుచున్నను తా నుపయోగించుకొనక మరల కిరణముల మూలమున భూమికి వదలినట్లు ముముక్షువు తన కితరులిచ్చిన పదార్ధములను బుచ్చుకొన్నను తనకొర కుంచుకొనక తన్నాశ్రయించిన వారికి బంచి పెట్టవలయును. శ్రోత్రాదికములగు నింద్రియములచేత శబ్దాది విషయములను గ్రహించినను మనస్సునం దుంచక వానిని వెంటనే తొలగింపవలెను. వృద్ధి క్షయములు చంద్రకళకేకాని చంద్రునకు లేనట్లు షడ్భావ వికారములు శరీరమున కేగాని యాత్మకు లేవు. పావురము తన దారపుత్రాదుల యందలి స్నేహానుబంధముతో వలలో జిక్కి నశించునట్లుగా నీషణ త్రయమునం దాసక్తి గలవాడు ప్రకృతి బద్ధుడై మానవజన్మమును వ్యర్థము చేసి సంసార

సాగరమున బడి సంతత దుఃఖము ననుభ వించును. అజగర మప్రయత్నముగా తనకు లభించిన యాహారమును గొని తృప్తి జెందునట్లు ముముక్షువు తనకు లభించిన పదార్థమును రుచి యెంచక భుజించి తృప్తి జెందవలయును.

సముద్ర మెప్పుడును గాంభీర్య ప్రసన్నతలు గలిగి, చొచ్చుటకుగాని దాటుటకుగాని సాధ్యముగాక, కలతనొందక నిశ్చలతనొంది, నదులువచ్చి చేరినపు డుప్పొంగకయు నదులు రాకపోయిన దరగి పోకయు నొకే విధమున నుండునట్లు జ్ఞాని యెప్పుడును వెలుపల బ్రసన్నతయు లోపల గాంభీర్యమును గలిగి పరులకు లోబడక వారి వలన క్షోభ మొందక చిత్త స్థైర్యమును పొంది తనకు సంభవించు మంచి చెడ్డలకు మోదఖేదముల నొందక సమచిత్తుడై యుండవలయును. మిడత రాత్రి వేళ నగ్నినిజూచి యుక్తాయుక్తములను విచారింపక భ్రమించి యందులో బడి నాశన మొందునట్లు శక్తికిమించిన కార్యములయందు బ్రవేశించువాడు తప్పక నశించును. తేనెటీగ యెపుష్ప మునం దెంతమాత్రము తేనె దొరుకునో యంతమాత్రమే పాన మొనర్చి యాపుష్పమును విడిచి మరియొక పుష్పమునకు బోవునట్లు ముముక్షు వెవ్వ రేవస్తువు నెంతమాత్ర మిచ్చిన సంతటితో దృప్తి నొందుచుండవలెను. తేనెటీగ తాను దినక కూడ బెట్టిన తేనె నితరుల పాలుచేసి చెడిపోవునట్లు సంచయేచ్ఛ గలవాడు నశించునని గుర్తించి దొరకిన దానితో సంతుష్టిగలిగి వర్తింపవలయును. తుమ్మెద వివిధ పుష్పములయందలి రసమును పానముచేసి సంతుష్టి జెందునట్లు ముముక్షువు సకలశాస్త్రముల సారాంశముల గ్రహించి తుష్టి జెంద వలయును. మగయేను గాడయేనుగుతో సంపర్క సుఖమునకు దల పెట్టి మానవులకు జిక్కినట్లు, స్పర్శసుఖము నపేక్షించినవాడు మోహపాశముచేత గట్టబడి శిక్షకు పాత్రుడగును. కావున యోగి కష్టతో జేసిన స్త్రీ ప్రతిమనై నను తాకగూడదు. జింక వీనుల కింపుగా వినబడిన రాగమునకు మోహపడి యురులలో జిక్కినట్లు మోక్షాపేక్ష గలవాడు గ్రామ్యగీతములకు జెవి యొగ్గినచో చెడిపోవును. చేప గాలమున గ్రుచ్చియున్న యామిషమున కాశజెంది తన ప్రాణమునకు ముప్పు దెచ్చుకొనునట్లు జిహ్వా చాపల్యమునకు జిక్కి రుచ్యములగు పదార్థముల నపేక్షించిన మృత్యువున కెరగావలసివచ్చును. జిహ్వాచాపల్యము వదలు వరకు విషయచాపల్యములు వదలవు. రసనేంద్రియ మొక్కటి జయింపబడినచో తక్కిన యింద్రియము లెల్ల

సులభముగా జయింపబడును. రుచిపక్వముల లెక్కింపక మితాహారమును గొనుచున్నచో నింద్రియము లెల్ల బలహీనములై యాత్మకు వశమగును.

ఒక వేశ్య ద్రవ్యమును సంపాదించవలె ననెడి దురాశచే ధన మెక్కువగా నిచ్చిన వానిని భర్తగా వరింపదలచి జక్కగా నలంక రించుకొని వీధివాకిట నిలచి తెల్లవారు వరకు విటుల రాక కెదురు చూచు చుండెను. తనకు వలసినంత ధనమిచ్చువాడు రాలేదు. తన కోరిక నెర వేరకుండుటచే విసిగి, పడక యిల్లు జొచ్చి పరుండి " నేనెంత మూర్ఖురాలను, సర్వాంతర్యామి యగు భగవాను డెల్ల వారికి వల్లభుడై యుండ నతని సేవింపక హేయమగు పురుష దేహ స్పర్శ కాశపడి ఇంత కాలమును వ్యర్థ మొనర్చితిని. ఇక నీ దురాశా పిశాచమునకు జోటీయక యాత్మ భర్తయగు సకల లోక కర్తను చిత్తమున నిలిపి నిరంతర మతనితో లక్ష్మీదేవి వలె సరస సల్లాప సుఖ మనుభవించుచు నానంద పారవశ్యమున జొక్కు చుందు" నని నిశ్చయించి, నిశ్చల చిత్తంతో నిద్రించెను. అట్లే మానవుడు కామ నిగ్రహ మిహపర సుఖదాయక మని యెంచి మెలగవలయును. కురర పక్షి శ్రమ పడి సంపాదించి మాంసమును దెచ్చుకొన్నప్పుడు తక్కిన పక్షులు దాని మీదబడి ముక్కులతో నెక్కి కాళ్లతో రక్కి నానా బాధలు పెట్టి యది మాంసపు ముక్కను వదలి వేయగనే దాని జోలికిపోక మాను కొనును. కావున ప్రియవస్తువును సంపాదించుట యందు దుఃఖమును దానిని విడుచుట యందు సుఖమును కలుగును. శిశు వజ్ఞానమున మానావ మానములు, శత్రు మిత్రలు, సుఖ దుఃఖములు మున్నగు వానిని వేనిని దలపక తన యాటయందే యాశక్తి గలిగి యానందించు నట్లు జ్ఞాని జ్ఞాన వశమున మానావ మానములు మొదలగున వెల్ల శరీరమునకేగాని యాత్మకు లేవని తెలిసికొని సంతత మాత్మ తత్వము నందాసక్తి కలిగి యుండవలెను.

ఒక బీద కన్య తన యింటికి బంధువులు రాగా బియ్యము లేకుండుటచే ధాన్యమును దంచ నారంభించి గాజులు ఘల్లు ఘల్లు మని శబ్దము చేయగా విసిగి వాని నొక్కటొక్కటిగా దీసి వేసి మంగళ సూచకముగా చేతి కొక్క గాజు నుంచు కొని దారిద్ర్య సూచకమగు కంకణ ధ్వని యణగినందులకు సంతసించి తన కార్యమును నెర వేర్చెను. కావున సనేకులతో గూడి ముచ్చట కారంభించిన గుట్టు చెడి కలహములు సంభవించి మనో విచారము గలుగునని యెంచి ముముక్షు వెవ్వరితోను జేరక యొంటరిగా

నుండవలయును. శరకర్త తాను జేయుచున్న బాణము యొక్క ఋజు మార్గమును జూచుచున్నప్పుడు స్వయముగా రాజే వచ్చి తన ముందు నిలుచున్నను జూడక తదేక ధ్యానముతో నుండునట్లు ముముక్షువు దృఢ వైరాగ్యము చేతను అభ్యాస యోగముచేతను మనస్సును స్థైర్యముగా నుంచి యితర చింత లేక తైలధార వలె న విచ్ఛిన్నమగు ధ్యానముతో పరమాత్మ యందే దృష్టి నిలుప వలయును. వైరాగ్య మనగా నింద్రియములను విషయముల వైపు బోకుండ నిర్బంధము చేయుట. అభ్యాస యోగ మనగా మనస్సును పరమాత్మ యందు నిశ్చలముగా నిలుపుటకై యలవరచుట. విషయాసక్తి పూర్తిగా నశించినగాని పరమాత్మను దర్శించుట కాసక్తి కలుగదు. అభ్యాస వైరాగ్యము లన్యోన్య సహకారులు.

సర్ప మొంటరిగా వసించుచు జాగ్రత్త గలిగి యుండునట్లు జ్ఞానవంతుడగు వాడు తటస్థించిన గృహముల యందు వసించుచు నేకాంత స్థలమున శయనించుచు జాగ్రత్త గలిగి నిర్విచారముగా నుండవలయును. సాలె పురుగు తనకు సంబంధించిన వస్తువుతోనే తంతువులను నిర్మించి, తంతువుల కంటే తా నన్యముగా నుండి క్రీడించుచు మరల నా తంతువులను భక్షించుచు నుపాదాన కారణమును నిమిత్త కారణమును తానేయై యున్నట్లు సర్వశక్తుడగు పరమాత్మ తన మాయచేత స్థావర జంగమాత్మక మగు ప్రపంచమును సృజించి యా ప్రపంచము కంటే విలక్షణముగా నుండి లోక వ్యాపారముల వేనిని పొందక క్రీడించుచు మరల వానిని లయింపజేయుచు సమస్తమునకు కారణభూతుడై వర్తించు చున్నాడని గ్రహింప వలయును. కందురీగ యొక పురుగును దెచ్చి తన గూటి యందుంచి దాని చుట్టు ఝుంకారము చేయుచు దిరుగుచుండ నాపురుగు భయము చేత తన లక్ష్యము నంతయు నా కందురీగ యందే యుంచి తుదకు దాని రూపమునే వహించునట్లు దేహదారి యే పదార్థము నందు దృఢముగా మనస్సు నిలిపి ధ్యానము చేయునో యా పదార్థము యొక్క స్వరూపమును బొందును. అందు వలన నిరంతరము భగవత్స్వరూపము నందు చిత్తముంచి ధ్యానింప వలయును.

ఈ గుణముల నెల్ల మనస్సు నందు స్థిరముగా నిలిపి ద్వంద్వము లేవియు తనకు లేవని నిశ్చయించి, కర్మాను సారముగా సంప్రాప్తించిన వాని ననుభవించుచు, నంతర్విషయమున లక్ష్యముంచి వర్తించుచున్న యెడల

నహంకార మమకారములు నశించి నిర్వికల్ప బ్రహ్మానందము తనంత తానే సిద్ధించును" అని బోధించెను. హస్త మస్తక సంయోగముచేసి, 'తత్వమసి' యను మహా వాక్యమును తాత్పర్య సహితముగా నుపదేశించి, కృతార్థుడవు గమ్మని యాశీర్వదించెను. చాంగ దేవుడు పరమానందము నొంది ముక్తాబాయికిని, నివృత్తిదేవునకును, జ్ఞానదేవునకును, సోపానదేవునకును నమస్కరించి వారి ననేక విధముల స్తుతించెను, వారి యాజ్ఞ ప్రకారము చాంగ దేవుడు పాండురంగని సేవించుటకై పుండరీక క్షేత్రమునకు వెళ్లెను.

# జ్ఞానదేవుని దయచే విసోబా ఖేచరుడు జ్ఞానియగుట

ఆపట్టణమున విసోబాయను నొక గొప్ప ధనికుడుండెను. అతడు ధన మదముచే విచ్చల విడిగా దిరుగుచుండెను. ఆ పురము నందలి జనులెల్ల రతనికి ఋణపడియుండుటచే నతనికి భయపడు చుండిరి. అతడు జ్ఞానదేవాదులు సన్యాసి పుత్రులను నసూయచే వారి ననేక విధముల నిందించుచుండెను.

ఒకనాడు దీపావళి పండుగ వచ్చెను, నివృత్తి దేవుడు ముక్తాబాయితో "అమ్మా! సాధువులకు విందు చేయవలెను, మందిగలు చేయు" మనెను, ముక్తాబాయి వానిని గాల్చుట కొక బాన కావలసి వచ్చుటచే దాని కొరకు కుమ్మరివాని యింటికి బోవుచుండెను. ఆమె విసోబాను జూచి, వాని కెదురుగా బోక, చాటున నిలిచెను. ఆ దుర్మార్గు డామెను జూచి సమీపించి "ఓసీ! దుష్టురాలా! ఎచటికి వెళ్లుచున్నావు? ఈ గ్రామమును వదలిపోగూడదా? ఇందలి వైదికాధములు కులభ్రష్టులగు మిమ్ము జేర్చుకొని యందరిని జెడగొట్టెచున్నారని పలికెను. ముక్తాబాయి భయపడి కాలికొలది పరుగెత్తెను. వాడామెను వెంటాడి సిగబట్టి తలమీదగొట్టి యెచటికి బోవనుంటి" వనెను, ఆమె "దీపావళి పండుగకు మండిగలు జేయుటకు బాన కొరకై కుమ్మరివాని యింటికి వెళ్లుచుంటి" ననెను, వాడామె ననేకముగా నిందించి, యటనుండి కుమ్మరి వాని యింటికి బోయి! జ్ఞానదేవాదులకు తనయాజ్ఞ లేక కుండలీయగూడదని చెప్పి, తన దారిని బోయెను.

ముక్తాబాయి కుమ్మరివాని యింటికేగి, యెంతగా బతిమాలినను వాడు బాన నీయలేదు. ఆమె యింటికివచ్చి విచారించుచు జ్ఞానదేవునకా విషయమునెల్ల దెలిపెను. జ్ఞానదేవు డామె నోదార్చి, ద్వంద్వ వికారములను

లక్ష్య పెట్ట వలదనెను. విసోబాకూడ మనవాడేకాని యన్యుడు కాడనెను. స్నానము చేసి మడి గట్టుకొను మనెను. విసోబా యేమి జరుగునో చూతమని జ్ఞాన దేవుని గృహము కడకు వచ్చి దావున నుండి గమనించుచుండెను. జ్ఞాన దేవుడు సిద్ధాసనము వేసికొని కూర్చుండి ధారణా మహత్త్వమున జఠరాగ్నిని బ్రజ్వలింప జేసెను. అతని నోటనుండి యగ్నిజ్వాలలు భగ్గున నెగసెను. వీపు వేడిమిచేత కనకనలాడుచుండెను. అతడు తన చెలెలిని బిలిచి "భక్ష్యములను తయారు చేసికొను" మనెను. ముక్తాబాయి యతని వీపుమీద పాకము చేసి క్రొత్త పుటికలలో బెట్టి భద్రపరచెను. జ్ఞాన దేవుడు జఠరాగ్ని నుపశమింప జేసికొని భగవధ్యానము చేయుచుండెను. జ్ఞాన దేవుడు మొదలగువారు సాధువుల నందరను విస్తళ్ల ముందు పీటలమీద గూర్చుండజేసి, తామును వారిపంక్తిని గూర్చుండిరి. ముక్తాబాయి పదార్థములనెల్ల వడ్డించెను. అందరును పరిషేచనములు చేసి భుజించుచుండిరి. ఇదంతయు చూచుచున్న విసోబా తన యవివేకమువలన వారిని నిందించినందులకు మిగుల చింతించి, వారిని, శరణుజొచ్చుట కర్తవ్యమనియు తరించుటకు వారి యుచ్చిష్టము నుజ్జీవించుటయే ముఖ్యసాధన మనియు నిశ్చయించి, లోనికేగి జ్ఞానదేవుని విస్తరిలోని పదార్థములో నొక కబళ మెత్తుకొని కన్నుల కద్దుకొని నోట బెట్టుకొని మ్రింగెను.

జ్ఞానదేవుడు "ఏమిరా! నీవు ఖేచరుడవుగా నున్నావు! ఛీ! ఇచటినుండి వెడలిపొ"మ్మనెను. విఠోబా యతని నోటినుండి వెడలిన మాటనే తనకు తత్వోపదేశముగా గ్రహించి, వారికి నమస్కరించి, క్షమాపణ వేడి, యచటినుండి వెడలిపోయి, ప్రపంచ వ్యాపారములను మాని, పరమాత్మయందు చిత్తముంచి వర్తింప జొచ్చెను. జ్ఞానదేవుడు ఖేచరుడనుటచే నాటినుండి యతనికి విసోబా ఖేచరుడను నామము సుప్రసిద్ధమయ్యెను. జ్ఞాన దేవుని దివ్య ప్రసాదము స్వీకరించి నప్పటినుండి యతనివలన నా గ్రామస్థుల కెట్టిబాధ లేకుండెను.

ఒకనాడు విసోబా జ్ఞానదేవునికడకు వచ్చి, అతనికి నమస్కరించి "స్వామీ! నీ యనుగ్రహమువలన కృతార్థుడనైతిని. నీ శేష ప్రసాదమహిమచేత నా దుర్గుణము లెల్ల నశించినవి. ఇక నే నెట్లు వర్తింపవలయునో సెలవి"మ్మని ప్రార్థించెను. జ్ఞానదేవుడు మందహాసముచేసి "అయ్యా! వినుము. బ్రహ్మమే తానన్న నిశ్చయ జ్ఞానము చేత దశేంద్రియములను వానికి కారణముగానున్న

మనస్సును నిగ్రహించి, నీకభిముఖముగా జేసికొని, యరిషడ్వర్గమును జయించి, నిర్మల బ్రహ్మాకారవృత్తిచేత కేవల పరిపూర్ణ తత్వన్వరూపమును దర్శించి ఆనందమయుడవై, చిత్తవిశ్రాంతిని బొందు"మని పలికి, "బ్రహ్మానందము ననుభవింతువు గాక"యని యాశీర్వదించెను. విసోబా పరమానంద భరితుడై జ్ఞానదేవునకు నమస్కరించి, యచటినుండి వెడలిపోయి, యతడుపదేశించినట్లు వర్తించుచుండెను. జ్ఞానదేవాదులు తమ్మాశ్రయించిన వారికి తత్వోపదేశములు చేయుచు, నత్యద్భుత లీలలు గావించుచు సదానందము ననుభవించుచుండిరి.

సిద్ధులారా! ఈ పరమ పవిత్రుడగు జ్ఞానదేవుని చరిత్రమును జదివిననువిన్నను జనులు పరమాత్ముని యనుగ్రహముచే చిత్త శుద్ధియు, నాయురారోగ్య సంపత్తియు గలిగి యంతమున బ్రహ్మానంద సామ్రాజ్యమును జూరగొందురు. తరువాత పాండురంగమూర్తి కత్యంత భక్తుడగు నామదేవుని చరిత్రమును తెలిపెదను. విశ్రాంతి గైకొనుము" అని చెప్పగా వృద్ధ వసిష్ఠాది సిద్ధులెల్ల పరమానంద భరితులై నా భాజిసిద్ధు ననేక విధముల గొనియాడిరి.

# విన్నపము

ఏ విషయం మనమాచరించాలన్నా ఆత్మజ్ఞానులు సలహా ప్రకారం చేస్తే ఉత్తమ ఫలితాలు పొందడం ఖాయమని పెద్దలు అభిమతము, ఆత్మజ్ఞానుల సలహా కాదని మనం మలిన బుద్ధినాశ్రయిస్తే మనలను మనమే చీకటిపాలు చేసు కొంటాము. జ్ఞానేశ్వరి భగవద్గీతలో పదహారవ అధ్యాయం దైవాసుర సంపద్విభాగ యోగంలో నాల్గవ శ్లోక వివరణలో శ్రీజ్ఞానేశ్వర మహారాజ్ గారు చెపుతారు. "ఈలోకమునందును పరలోకమునందును స్నేహపూర్ణుడైన మన ధర్మము- మనము చేసిన ధర్మకార్యములను ఆడంబరముగా నలుదిక్కులకు ప్రచారము చేసికొన నారంభించినచో ఆ ధర్మము కూడా అధర్మమేయగును. దీనినే దంబమందురు." అని చెప్పారు. గనుకనే శ్రీ భరద్వాజ మాస్టరు గారు విద్యానగర్ సాయి మందిరంలో దాతల పేర్లు ప్రకటించుటకు అంగీకరించలేదు. ఏ వస్తువు పైన దాతల పేర్లు వ్రాయనివ్వలేదు. గనుక సోదరభక్తులందరూ గుప్త దానం చేసి ఉత్తమ ఫలితం నొంద ప్రార్థన. వస్తువులే కాదు ఏ ధర్మ కార్యములో గూడ తమ పేరు బయట రాకుండా చూచుకొనవలెనని విన్నపము.

పెసల సుబ్బరామయ్య.